15-09Pg1exHMNWJQEVK GNT 1_15-09Pg1exHMNWJQEVK.qxd 9/15/2025 12:45 AM Page 1

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

గుంటూరు

15-9-2025 సోమవారం సంపుటి: 31

సంచిక: 225 పేజీలు: 12 వెల: 6.50

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# పాక్‌కు మరో చావుదెబ్బ



సూర్యకుమార్ యాదవ్

# ఆసియాకప్‌లో భారత్ జయభేరి

**7 వికెట్ల తేడాతో ఘన విజయం**

**127 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన భారత్**

**భారత్ బౌలర్ల దెబ్బకు పాక్ బ్యాటర్లు చిత్తు**

**కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన సూర్యకుమార్ యాదవ్**

**ప్లేయర్ ఆఫ్ దిమ్యాచ్‌గా కుల్దీప్ యాదవ్**

**దుబాయి, సెప్టెంబరు 14:** యావత్‌క్రికెట్‌ప్రపంచం మొత్తం ఉత్కంఠభరితంగా ఎదురుచూసిన మ్యాచ్‌లో అందరూఊహించినట్లుగానే భారత్ ఘనవిజయం సాధించింది. ఆదివారం దుబాయి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పాకిస్తాన్‌తో తలపడిన భారత్‌జట్టు అత్యంత సులువుగా గెలుపు సాధించింది. ఏడు వికెట్ల తేడాతో పాకిస్తాన్ జట్టుపై ఘనవిజయం నమోదుచేసింది. ప్రపంచకప్‌లోనే కాదు ఆసియాకప్‌లో కూడా మాకు తిరుగులేదని భారత్‌జట్టు రుజువుచేసింది. చిరకాల ప్రత్యర్థిని మట్టికరిపించింది. మెగాటోర్నీలో రెండో విజయం సాధించింది. కుల్దీప్‌యాదవ్ విజృంభణతో 127 పరుగులకే ముందు పాకిస్తాన్ పరిమితం అయింది. ఛేదనలో అభిషేక్‌శర్మ 31పరుగులుచేసి మెరుపు ఆరంభం ఇచ్చాడు. ఆతర్వాత సూర్యకుమార్ యాదవ్ 47 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచి కెప్టెన్ ఇన్నింగ్స్‌తో పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మూడో వికెట్‌కు తిలక్‌వర్మ 31 పరుగులుచేయగా ఆతడికి జోడీగా 56 పరుగులు జోడించిన సూర్యజట్టు విజయానికి బాటలువేసాడు. చివరిలో

## స్కోర్లు పాక్: 127/9, భారత్-131/3

శివందూబై తనదైన స్టైల్‌లో ఆడగా సిక్సర్‌తో భారత్‌కు ఏడు వికెట్ల విజయం వరించింది. అభిషేక్‌శర్మ కేవలం 13 బంతుల్లో నాలుగు ఫోర్లు రెండు సిక్స్‌లతో 31పరుగులుచేస్తే శుభ్‌మన్‌గిల్ తక్కువ పరుగులకే ఔట్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన సూర్యకుమార్ తిలక్‌వర్మలే మ్యాచ్‌ను నిలబెట్టారు. తిలక్‌వర్మ 31 శివమ్‌దూబే 10తో కలిసి సూర్యకుమార్ 47 పరుగులుచేసి జట్టు విజయానికి బాటలువేసారు. పాకిస్తాన్ బౌలర్లలో స్పిన్నర్ సెయిమ్ ఆయూబ్ మూడు వికెట్లు తీసాడు. మ్యాచ్‌లో గిల్ ఔట్ అయ్యాక క్రీజులోకి వచ్చిన కెప్టెన్ ఎస్కేవై రన్‌ఛేజ్‌కు తగ్గట్లుగా స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లాడు. గతంలో పాక్‌పై పెద్దగా రాణిం చలేక పోయిన ఈ ప్లేయర్ ఈసారి మాత్రం పట్టుదలతో ఆడాడు. చివరి వరకూ క్రీజులో ఉండి కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను గెలిపించాడు. తిలక్‌వర్మ 31 బంతుల్లో 31 పరుగులుచేసే >>2



లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్‌లో అవార్డ్ అందుకుంటున్న దేవాన్ష్

2లో

# 'దేవాన్ష్' ప్రపంచ రికార్డు

**'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లోకి ఎక్కిన సిఎం చంద్రబాబు మనుమడు**

# వృద్ధిరేటు లక్ష్యం 15%

**పౌరసేవలు జవాబుదారీగా ఉండాలి**

**ఐదేళ్లలో 125 కేబినెట్ భేటీలు, 25 కలెక్టర్ కాన్ఫరెన్స్‌లు లక్ష్యం**

**నేడు, రేపు జిల్లా కలెక్టర్ల సదస్సు**

**మంత్రులు, కార్యదర్శులకు సిఎం చంద్రబాబు దిశా నిర్దేశం**



**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం అందిస్తున్న పౌరసేవలతో పాటు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో సంతృప్తే ముఖ్యమని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దానికి అనుగుణంగానే మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని సీఎం ఆదేశించారు. ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్సుపై తన క్యాంపు కార్యాలయంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన గత రాత్రి పొద్దు పోయేంతవరకు సమావేశమయ్యారు. పౌరసేవలు, సంక్షేమ పథకాలపై పబ్లిక్ పర్సెప్షన్‌ను విశ్లేషిస్తున్నామని సీఎం తెలిపారు. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 10.5 శాతం వృద్ధి రేటుకు చేరుకున్నామని అన్నారు. 2029 నాటికి జీఎస్డీపీ రూ.29 లక్షల కోట్లకు చేరే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. 2034కు తలసరి ఆదాయం రూ.10.55 లక్షలకు చేరేలా కార్యాచరణ చేపట్టాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జీఎస్డీపీలో వ్యవసాయం అనుబంధ రంగాలే కీలకంగా ఉన్నాయని అన్నారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, రాష్ట్రస్థాయిలో విభాగాధిపతులు పనిచేయాల్సి ఉందని సీఎం స్పష్టం చేశారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకూ 25 కేబినెట్ సమావేశాలు నిర్వహించామని.. ఐదేళ్లలో 125 కేబినెట్ సమావేశాలతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా అదే సంఖ్యలో రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాలు నిర్వహణ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. అలాగే ఏడాదిలో ప్రతీ త్రైమాసికానికి ఒకసారి చొప్పున ఐదేళ్లలో 25 జిల్లా కలెక్టర్ సమావేశాలూ నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 3 శాతం వృద్ధి తగ్గిన కారణంగా రాష్ట్రం సుమారుగా రూ.6 లక్షల కోట్ల సంపద కోల్పోయిందని అన్నారు.

**కలెక్టర్ల కాన్ఫరెన్సులో 8 అంశాల వారీగా చర్చ:** ఈసారి జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సును విభిన్నంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పౌరసేవలు, పథకాల అమలుపై జిల్లాల వారీగా జవాబు దారీతనం ఉండేలా ఈ కాన్ఫరెన్సు నిర్వహించ >>2



# గరళ కంఠునిలా విషమైనా మింగేస్తా

**ఈశాన్య ప్రజలు ఆరాధించే వ్యక్తిని అవమానించడమా?**

**హజారికాపై కాంగ్రెస్ ఘోరతప్పిదం**

**అసోం బహిరంగసభలో ప్రధాని మోడీ**

**గువాహతి,సెప్టెంబరు 14:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రముఖ గాయకుడు, భారతరత్న భూపేన్ హజారికాను కాంగ్రెస్ పార్టీ ఘోరంగా అవమానించిందని, ఈశాన్య రాష్ట్రాల ప్రజల మనోభావాలను దెబ్బ తీయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. ఆదివారం అసోంలోని దర్రాంగ్ జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. మొత్తంగా రూ.18,500 కోట్ల విలువైనప్రాజెక్టులకు ఆయన భూమిపూజనిర్వహించారు. వీటిలో బయో ఇథనాల్; పోలిప్రొపైలెన్ ప్లాంట్లు కూడా ఉన్నాయి. తర్వాతజరిగిన సభలో మోదీ మాట్లాడుతూ, "భూపేన్ హజారికాకు భారతరత్న ప్రకటించిన రోజు, పాటలు పాడేవారికి, డ్యాన్సులు చేసేవారికా మోదీ భారతరత్న ఇచ్చేది అని నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. ఆ మాటలు నన్ను తీవ్రంగా బాధించాయి" అని తెలిపారు. తనను ఎవరైనా దూషించినా తాను శివుడిలా విషాన్నిదిగమింగుతానని, కానీ ఈశాన్య ప్రజలు ఆరాధించే వ్యక్తిని అవమానిస్తే మాత్రం సహించలేనని ఆయన భావోద్వేగంగాఅన్నారు. అంతకుముందు, మంగళ్‌దోయ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. కొత్త మెడికల్ కాలేజీ, ఆసుపత్రి, జీఎన్ఎం స్కూల్, బీఎస్సీ నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

# మహిళా శక్తిలో భారత్ అగ్రగామి



ఆదివారం తిరుపతిలో మహిళా సాధికారత సదస్సును ప్రారంభిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా. చిత్రంలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రఘురామకృష్ణరాజు

**మహిళా సాధికారత ఒక్కరోజులో సాధ్యంకాదు..**

**ఆధ్యాత్మిక, సామాజిక ఉద్యమాల్లోనూ మహిళ కీలకపాత్ర**

**తిరుపతి జాతీయ సదస్సులో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా**

**తిరుపతి,సెప్టెంబరు 14ప్రభాతవార్తప్రతినిధి:** మహిళా శక్తికారణంగానే ఇవాళ ప్రపంచంలోనే భారత్‌ముఖ్యదేశంగా అవతరించిందని లోక్‌సభస్పీకర్ ఓంబిర్లా అన్నారు. స్వాతంత్ర్యపోరాటంలోనూ మహిళలు కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఆదివాసీ నేపథ్యం నుండి వచ్చిన మహిళ ప్రస్తుతం భారతరాష్ట్రపతిగా ఉన్నా రని ఆయన గుర్తుచేశారు. మహిళా సాధికారత ఒక్కరోజులో సాధ్యం కాదని, అనేక కార్యక్రమాలు చేపడుతూ ఉంటే సాధ్యమవుతుందని తెలిపారు. దేశంలో ఆధ్యాత్మిక సామాజిక ఉద్యమాల్లోనూ స్త్రీలు కీలకపాత్ర పోషించారని చెప్పారు. తిరుపతిలో ఆదివారం మొదలైన రెండురోజుల జాతీయ మహిళా సాధికారత సదస్సులో దేశంలోని అనేక రాష్ట్రాల నుండి పార్లమెంట్,శాసనసభ మహిళా ప్రజాప్రతినిధులతో కలసి తొలిరోజు జ్యోతివెలిగించి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా లోక్‌సభస్పీకర్ బిర్లా మాట్లాడుతూ సమాజంలో మహిళలకు గౌరవం ఇవ్వడం అనాదికాలంనుండి వస్తున్న భారత సంప్రదాయమన్నారు. మహిళల భాగస్వామ్యంలేకుండా ఏ దేశం అభివృద్ధిచెందలేదని తెలిపారు. వారికోసం రాజ్యాంగం అనేక నిబంధనలు రూపొందించిందని, మహిళా శక్తితోనే భారత్ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. భరతభూమిలో మహిళా నాయకత్వం శతాబ్దాలకు ముందే ప్రారంభమైందని ఆయన గుర్తుచేశారు. నేడు అనేక రంగాల్లో మహిళా నాయకత్వం బలోపేతమైందన్నారు. రాజకీయాలు, శాస్త్రసాంకేతిక రంగంతోబాటు చివరకు ఎంతో కీలకమైన సైన్యంలోనూ మహిళలు కీలకపాత్ర పోషిస్తుండటం చూస్తున్నామన్నారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ >>2



# 'డబుల్ ఇంజిన్'తో రాష్ట్రం సమగ్రాభివృద్ధి

**జిఎస్టీ సంస్కరణలతో దేశం మరింతముందుకు: జెపినడ్డా**

**విశాఖపట్నం, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** బిజెపి పార్టీ అనేది దేశాన్ని అభివృద్ధి పదంలో తీసుకెళ్లేందుకే అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా అన్నారు . ఆదివారం రైల్వే గ్రౌండ్స్ లో నిర్వహించిన సారథ్యం సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా కనకమహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు తోపాటు మహావిష్ణువు సింహాచల కొండపై వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సారథ్యం సభలో విజయవంతంగా నిర్వహించారని 26వ జిల్లాగా విశాఖపట్నంలో ముగింపు సభ నిర్వహిస్తున్నామని ఈ సభకు హాజరు కావడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. తెలుగు ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారని ఆయన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల ముందు తాను ఒకసారి తిరుపతి వెళ్లానని అక్కడ తాను వైసిపి పూర్తిగా అవినీతి లో ఊరికిపోయిందని వాటిని నిర్మూలించవలసిన అవసరం ఉందని ప్రజలకు చెప్పానని తెలిపారు. అయితే ఎన్నికలు జరిగింతర్వాత డబల్ ఇంజన్ సర్కార్కు ప్రజలు పట్టం కట్టారని ఆయన అన్నారు. 11 సంవత్సరాల తర్వాత వచ్చిన మార్పులు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాకముందు ఏ విధంగా దేశం ముందుకు సాగిందో ఆలోచించేయాలని ప్రతి ఒక్కరిగా అయినా సూచించారు. నరేంద్ర మోడీ పేదవాడి అభివృద్ధి కోసం ఎటువంటి కార్యచరణ చేపడుతున్నారో >>2

# నాలుగు రోజులు వర్ష సూచన

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతి నిధి:** అల్పపీడనం,ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు.. కురిసేందుకు అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఆదివారం తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడరాదని సూచించారు. ఇక సోమవారం అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు >>2



ఆదివారం గంగమ్మకు జలహారతి ఇస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

# పెన్నకు నీరు విడుదల

- **సోమశిల జలాశయం నుంచి నదిలోకి నీటిని వదిలిన మంత్రి ఆనం**
- **3 జిల్లాలకు నీరు అందించేలా ప్రణాళికలు**
- **నెల్లూరుకు 150 టిఎంసిల నీటినిల్వ సామర్థ్యం**
- **టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు**

**అనంతసాగరం (నెల్లూరు), సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** చుట్టుప్రక్కల ఉన్న ఐదు జిల్లాల కంటే సోమశిల జలాశయానికి 150 టిఎంసిల నీటిని నిల్వ చేసుకున్న సామర్థ్యం నెల్లూరు జిల్లాకే ఉందని రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సోమశిల జలాశయం నుండి 5,6గేట్ల ద్వారా పెన్నానదికి నీటిని విడుదల చేసి గంగమ్మకు జలహారతినిచ్చారు. అనంతరం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జలాశయం సామర్థ్యాన్ని >>2

# తిరుపతిలో అత్యాధునిక బస్‌స్టేషన్

**రోజుకు లక్షమంది రాకపోకలు సాగించేలా నిర్మాణం: సిఎం**

**విజయవాడ,సెప్టెంబరు 14, ప్రభాతవార్తప్రతినిధి:** రోజురోజుకు పెరుగుతున్న యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుపతిలో అత్యాధునిక బస్ స్టేషన్ నిర్మించాలని, అన్ని సౌకర్యాలతో ఆకట్టుకునేలా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ లిమిటెడ్, ఏపీఎస్ఆర్టీసీ అధికారులతో సమీక్షను ముఖ్యమంత్రి నిర్వహించారు. నూతనంగా నిర్మించే బస్ స్టేషన్‌లో సుమారు 150 బస్సులు ఒకేసారి నిలిపి ఉంచేలా బస్ బే ఉండాలన్నారు. హెలిపాడ్ సౌకర్యంతో పాటు, రోప్‌వే,కమర్షియల్ కాంప్లెక్స్‌లు, >>2

15-09pg2exHMNWJQE 2nd_15-09pg2exHMNWJQE.qxd 9/15/2025 12:49 AM Page 1



# వృద్ధిరేటు లక్ష్యం15%

>> నున్నట్టు తెలిపారు. సరైన వ్యక్తి, సరైనచోట ఉండాలన్న లక్ష్యంతోనే కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేశామని అన్నారు. తాను 4వ సారి ముఖ్య మంత్రి అయినా ప్రజాప్రయోజనాల కోసం నిరంతరం ఏదో ఒక కొత్త అంశాన్ని నేర్చుకుంటూనే ఉంటానని సీఎం అన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా మెరుగైన పాలన అందించే అంశంపై అధ్యయనం చేస్తూ ఉండాలని సూచించారు. రెండు రోజుల పాటు జరిగే కలెక్టర్ల సదస్సులో మొదటి రోజున జీఎస్డీపీ అంశంపై ప్రజెంటేషన్ లో భాగంగా సేవలు, పరిశ్రమలు, వ్యవసాయం, పర్యాటకం తదితర రంగాల పురోగతిపై సమీక్షిస్తామని తెలిపారు. జిల్లాలు ఈ రంగాల్లో ఎక్కడ ఉన్నాయన్న దానిపై కలెక్టర్ల నుంచి వివరాలు తెలుసుకుంటామన్నారు. ఇక రెండో అంశంగా సంక్షేమం, సూపర్ సిక్స్, అన్నా క్యాంటీన్లు, పీ4 తదితర అంశా లను సమీక్షించనున్నట్టు తెలిపారు. మూడో అంశంగా లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించిన ప్రజెంటేషన్ ఉంటుందని తెలిపారు. నాలుగో అంశంగా స్వర్ణాంధ్ర, సర్క్యులర్ ఎకానమీ, పంచాయితీరాజ్, మున్సిపల్ తదితర అంశాలపై జిల్లాల వారీగా పురోగతి తెలుసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. ఇక రెండో రోజున ఐదో అంశంగా మానవ వనరుల అభివృద్ధి, వైద్యారోగ్యం, విద్య, స్కిల్ డెవలప్మెంట్, ఆరో అంశంగా ఐటీ, క్వాంటం వ్యాలీ, ఆర్టీఐహెచ్, వాట్సప్‌లో పౌరసేవలు, డేటా లేక్, ఏఐ తదితర అంశాలను చర్చిస్తామని వివరించారు. ఏడో కేటగిరీలో రెవెన్యూ విభాగంలో భూములు, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, ట్రాన్స్‌పోర్ట్ లాంటి అంశాలపై జిల్లాల వారీగా వివరాలు తెలుసుకుంటామని స్పష్టం చేశారు. ఇక రెండో రోజు 8వ అంశంగా రాష్ట్రంలో శాంతిభద్రతలపై ఎస్పీలు, జిల్లా కలెక్టర్లతో సమీక్షిస్తామని తెలిపారు. ప్రభుత్వ విభాగాలు అందించే పౌరసేవలపై ప్రజల్లో సంతృప్త స్థాయిపైనా చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ విజన్ ను పటిష్టంగా అమలు చేయాలని సీఎం పేర్కొన్నారు.

**నెక్స్ జెన్ సంస్కరణలపై కమిటీ:** ఆర్టీజీఎస్ ద్వారా నేపాల్‌లో చిక్కుకు పోయిన తెలుగు వారిని వెనక్కు తీసుకువచ్చే ఆపరేషన్ విజయవంతమైందని సీఎం వ్యాఖ్యానించారు. మంత్రి నారా లోకేష్ సహా అధికారులు కృషి చేశారని, దీనిపై ప్రజల్లో ప్రభుత్వం పట్ల మంచి సానుకూల స్పందన వచ్చిందన్నారు. వివిధ సంక్షోభ సమయాల్లో సరిగ్గా స్పందిస్తేనే ప్రజల్లో విశ్వాసం, నమ్మకం పెరుగుతాయని సీఎం అన్నారు. అమరావతిలోని సీఆర్డీఏ భవనంలో మానవ వనరుల నైపుణ్యాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రం ఇటీవల జీఎస్టీని రెండు స్లాబులకు కుదిస్తూ తెచ్చిన సంస్కరణ విజయవంతమైందని.. ఏపీలోనూ నాలా పన్ను రద్దు చేసి నెక్స్ జెన్ సంస్కరణను అమలు చేశామని సీఎం అన్నారు. దీనిపై మరింత అధ్యయనం చేసేందుకు మంత్రులు, అధికారులతో కమిటీ వేయాలని సీఎం సూచించారు. మరోవైపు చిన్న చిన్న కోర్టు వివాదాల కారణంగా ప్రభుత్వ సమయంతో పాటు ధనమూ వృధా అవుతోందని, ఆర్బిట్రేషన్ ద్వారా కొన్ని అంశాలను పరిష్కరించుకునే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు, సీనియర్ అధికారులు హాజరయ్యారు.

**తెలుగు సంస్కృతి, చరిత్ర, సాహిత్యం, కళలు ఉట్టిపడేలా ఎన్టీఆర్ స్మృతివనం:** తెలుగువారి ఆత్మగౌరవం ఆత్మవిశ్వాసం కలగలిపి తెలుగు వైభవంగా అమరావతిలో నిర్మించే ఎన్టీఆర్ స్మృతివనం ప్రాజెక్టును చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు, భాష, సాహిత్యం, కళలు, ప్రాచీన చరిత్ర తదితర అంశాలకు పెద్దపీట వేస్తూ దీనిని చేపట్టాలని సూచించారు. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై సీఎం సమీక్షించారు. అమరావతిలోని నీరుకొండ వద్ద చేపట్టనున్న ఈ ప్రాజెక్టులోని అంశాలను అధికారులు సీఎంకు వివరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రాచీన తెలుగు చరిత్రతో పాటు ప్రజల మనస్సుల్లో నిలిచిపోయిన అల్లూరి, పొట్టిశ్రీరాములు లాంటి విశిష్ట వ్యక్తుల విగ్రహాలు, సంస్కృతీ సంప్రదాయాలు, భాష, లిపికి చెందిన వివరాలను కూడా తెలియచెప్పేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తెలుగు ప్రజల ప్రతీకగా ప్రజా రాజధాని అమరావతిని కూడా ప్రతిబింబించేలా ప్రాజెక్టు చేపట్టాలన్నారు. 182 మీటర్ల ఎత్తైన ఎన్టీఆర్ విగ్రహ స్మృతి వనం ప్రాజెక్టుకు అనుబంధంగా నీరుకొండ రిజర్వాయర్ ను తీర్చిదిద్దాలన్నారు. ప్రత్యేకించి పర్యాటకులు పెద్ద ఎత్తున సందర్శించేందుకు అనువుగా ఆకర్షణల్ని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. గుజరాత్ లో నిర్మించిన స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాజెక్టును కూడా పరిశీలించాలని సీఎం పేర్కొన్నారు. అమరావతిని అనుసంధానిస్తూ కృష్ణా నదిపై చేపట్టనున్న ఐకానిక్ వంతెన డిజైన్లను కూడా సీఎం పరిశీలించారు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కన్వెన్షన్ సెంటర్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అంతకముందు ఎన్టీఆర్ విగ్రహ నమూనాలను పరిశీలించారు.

# మహిళా శక్తిలో భారత్ అగ్రగామి

>> కల్పించేందుకు చట్టం తీసుకువచ్చామన్నారు. అభివృద్ధి చెందిన దేశాలలో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. మహిళలకు గౌరవం ఇవ్వడం భారతదేశంలో సంప్రదాయమని బిర్లా ఉద్ఘాటించారు.

**మహిళా సాధికారతకు ఎన్టీఆర్ ఎంతో కృషి: :రాజ్యసభడిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌సింగ్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత మాజీ సీఎం



మహిళా సాధికార సదస్సులో పాల్గొన్న వారికి జ్ఞాపికలను అందజేస్తున్న దృశ్యం

ఎన్టీరామారావు మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారని రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌సింగ్ తెలిపారు. తిరు పతిలో జాతీయ మహిళా సాధికారత సదస్సుప్రారంభంలో ఆయన ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుని ప్రణామాలు తెలిపారు. మహిళల సాధి కారత కోసం ప్రధాని నరేంద్రమోదీ అనేక కార్యక్రమాలు చేపట్టారని వెల్లడించారు. బీహార్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం మహి ళలకు రిజర్వేషన్లు, జన్‌ధన్ యోజనలో సగానికిపైగా ఖాతాలు మహిళలవేనని చెప్పారు. ప్రధాని మోదీ, ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు చేపడుతున్న మహిళల అభివృద్ధి,సంక్షేమంకు ప్రశంసలు కురిపించారు. తిరుపతి జిల్లా సత్యవేడు శ్రీసిటీలో చంద్రబాబు నాయుడు చొరవతోనే సగానికిపైగా మహిళలు ఉద్యోగాలు చేస్తుండటం అభినందనీయమన్నారు. దేశంలోనే తొలిసారిగా నైపుణ్యగణనను ఏపిలో చేపట్టారని సింగ్ తెలిపారు.

**మహిళా భాగస్వామ్యంతోనే 'వికసిత్‌భారత్':ఎంపి పురందేశ్వరి**

మహిళల భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ సాకారమవుతుందని బిజెపి ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. మహిళా సాధికారత కోసం కేంద్రం ఎన్నో పథకాలు అమలుచేస్తోందన్నారు. 'భేటీ బచావో బేటీ పడావో,మహిళా సమ్మాన్‌నిధి వంటి అనేక పథకాలు మహిళల అభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ఆర్థిక సమానత్వం కోసం ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని ఆమెతెలిపారు. ఇంకా ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్, శాసనసభ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు,డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణమరాజు,ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్,దేశంలోని కేంద్రపాలి తప్రాంతాలు, వివిధ రాష్ట్రాలమహిళా మంత్రులు,ఎంపిలు, ఎమ్మెల్యేలు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మహిళా సాధికారత సదస్సుకు విచ్చేసిన ఏపి,తెలంగాణ మహిళా ప్రజాప్రతినిధులు

# ఆసియాకప్‌లో భారత్ జయభేరి

>> శివమ్ దూబే ఏడు బబంతుల్లో పది పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. దీనితో 15.5 ఓవర్లలోనే భారత్‌మూడు వికెట్ల నష్టానికి 131 పరుగులుచేసి లక్ష్యాన్ని అధిగమించి విజయం సాధించింది. టాస్‌గెలిచి తొలుత బ్యాటింగ్‌చేసిన పాకిస్థాన్‌ను తొమ్మిది వికెట్ల నష్టానికి 127 పరుగులకే పరిమితంచేసారు. కుల్‌దీప్‌యాదవ్ 18 పరుగులిచ్చి మూడు వికెట్లు తీస్తే అక్షర్‌పటేల్ 18 పరుగులిచ్చి రెండు వికెట్లుతీసాడు. అలాగే జస్‌ప్రీత్‌బుమ్రా 28 పరుగులకు రెండు వికెట్లు తీసి పాక్ బ్యాటర్లను ఆడుకున్నారు.భారత బౌలర్ల దెబ్బకు పాకిస్థాన్ బ్యాటర్లు వణికిపోయారు. తొలి ఓవర్ మొదటి బంతికే సైమ్ ఆయూబ్ వికెట్ ను హార్ధిక్ పాండ్య పడేసాడు. తర్వాత ఓవర్‌లో బుమ్రా మహ్మద్ హ్యారిస్‌ను ఔట్‌చేసాడు. తర్వాత స్పిన్నర్లు కుల్దీప్‌యాదవ్ అక్షర్‌పటేల్‌లు కలిపి ఐదు వికెట్లు తీయడంతో పాక్ కోలుకోలేకపోయింది. ఒకదశలో 64 పరుగులకే ఆరువికెట్లు నష్టపోయిన పాక్ చివరిలో షాహీన్ అఫ్రిదీ 16 బంతుల్లో 33పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు.

వేగంగా ఆడటంతో దాయాది జట్టు తొమ్మిది వికెట్ల నష్టానికి కేవలం 127 పరుగులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. పాక్‌పై గెలిచిన భారత్ జట్టు ఆసియాకప్ సూపర్-4లోకి ప్రవేశించింది.కుల్దీప్‌యాదవ్ కేవలం 18 పరుగులే ఇచ్చి 3 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు.







# 'దేవాన్ష్' ప్రపంచ రికార్డు

## లండన్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్న మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్ గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మనవడు నారా దేవాన్ష్ అందుకున్నారు. విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తనయుడు, పదేళ్ల యువ చెస్ ప్రాడిజీ నారా దేవాన్ష్ చదరంగంలో అత్యంత క్లిష్టమైన 175 పజిల్స్ ను వేగంగా పరిష్కరించారు. తద్వారా ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్ గా ప్రపంచ రికార్డ్ సాధించినందుకు గాను వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్స్2025 అందుకున్నాడు. లండన్ లోని వెస్ట్ మినిస్టర్ హాల్ లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని 'ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్175 పజిల్స్' అవార్డ్ అందుకున్నాడు. ఈ కార్యక్రమానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఈ ఘనతను సాధించేందుకు నారా దేవాన్ష్ గతేడాది చెక్ మేట్ మారథాన్‌లో లాస్లో పోల్గార్ ప్రసిద్ధ చెస్ సంకలనం 5334 ప్రాబ్లమ్స్ అండ్ గేమ్స్ పుస్తకం నుంచి తీసుకున్న 175 సంక్లిష్టమైన చెక్ మేట్ పజిల్స్ ను వేగవంతంగా పరిష్కరించాడు. ఈ పజిల్స్ ఒకటి తర్వాత ఒకటి కష్టంగా మారుతూ వేగం, కచ్చితత్వం, ఆలోచనా నైపుణ్యాలను పరీక్షిస్తుంది. దేవాన్ష్ వీటన్నిటినీ అత్యంత తక్కువ సమయంలో పరిష్కరించడం ద్వారా రికార్డు సృష్టించారు. ప్రపంచ చెస్ రంగంలో అత్యుత్తమ యువ ప్రతిభావంతుల్లో ఒకరుగా దేవాన్ష్ కు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం లభించింది. ఈ విజయానికి దేవాన్ష్ అకుంఠిత శ్రమతో పాటు, తల్లి నారా బ్రాహ్మణి, తండ్రి నారా లోకేష్, కోచ్ కే. రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహం అందించారు. ఈ విజయం గురించి మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ "ఈ రోజు వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో దేవాన్ష్ ఈ గౌరవాన్ని అందుకోవడం ప్రత్యేకమైంది. అతని ముందుచూపు, ఆలోచనాశక్తి, ఒత్తిడిలో ప్రదర్శించిన సమయస్ఫూర్తి, చిన్న వయస్సులోనే పూర్తిగా ఆటకు అంకితం కావడం వంటి విభిన్న శైలి వల్ల ఈ విజయం సాధ్యమైంది. తండ్రిగా దేవాన్ష్ అవిశ్రాంత శ్రమని నేను దగ్గరగా చూశాను. ఈ గుర్తింపు అతని కృషికి నిజమైన బహుమతి. మేమంతా అతను సాధించిన ఈ ఘనతకు ఎంతో గర్వపడుతున్నాం అని అన్నారు. దీంతోపాటు దేవాన్ష్ మరో రెండు ప్రపంచ రికార్డులను కూడా గతంలో సొంతం చేసుకున్నాడు. 7డిస్క్ టవర్ ఆఫ్ హనోయ్‌ను కేవలం 1 నిమిషం 43 సెకన్లలో పూర్తి చేయడం, 9 చెస్ బోర్డ్స్ పై 32 పావులను సరైన పద్ధతి ద్వారా 5 నిమిషాల్లో అమర్చడంలో ప్రపంచ రికార్డులు సాధించాడు. ఈ రోజు లండన్‌లో జరిగిన అవార్డ్స్ కార్యక్రమంలో ఆయనకు లభించిన గుర్తింపు ఆయన కుటుంబానికి, అలాగే ప్రపంచ చెస్ రంగంలో భారత్ తరపున పెరుగుతున్న ఖ్యాతికి గర్వకారణంగా నిలిచింది.

**సంతోషంగా ఉంది : సిఎం చంద్రబాబు:** దేవాన్ష్ ప్రపంచ రికార్డు సాధించడంపై సీఎం చంద్రబాబు సంతోషంగా ఉందన్నారు., "మా దేవాన్ష్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు 2025 అందుకోవడం గర్వంగా ఉంది" అని తెలిపారు. నెలల తరబడి చూపిన పట్టుదల, గురువుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయంసాధ్యమైందని చంద్రబాబు పేర్కొన్నారు. దేవాన్ష్ సాధించిన ఈ రికార్డు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన దేవాన్ష్‌ను శభాష్ ఛాంప్‌అంటూ ప్రశంసించారు. అంతర్జాతీయ వేదికపై దేవాన్ష్ ప్రతిభకు గుర్తింపు లభించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



5,6గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

# పెన్నకు నీరు విడుదల

>> తొలుత అనుకున్న దానికన్నా 77 టిఎంసిల సామర్థ్యం వరకు పెంచినప్పటికీ కొన్ని పరిస్థితుల దృష్ట్యా 74 టిఎంసిల వరకు నీటిని నిలువ చేయడం జరుగుతుందన్నారు. కృష్ణానది నుండి శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ ఏర్పాటు చేయడం వలన రాయలసీమ, నెల్లూరుకి నీటి నిల్వకు అవకాశం ఏర్పడిందన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నంధ్యాల జిల్లా లో పర్యటించినప్పుడు కుందునది ప్రవాహం అధికంగా ఉందని అక్కడి నుండి నీరు పెన్నా నదికి చేరుకోవడం జరుగుతుందని గమనించామన్నారు. సోమశిల జలాశయం శంఖుస్థాపన నుండి ఎన్నో సందర్భాల్లోచేయడం జరిగిందని మంత్రి పేర్కొన్నారన్నారు. ఆదివారం నుండి 20 టిఎంసిల నీటిని విడుదల చేశామని అందులో కండలేరు జలాశయానికి, తెలుగు గంగ, కనుపూరు, కలువాయి కాలువలకు నీటిని విడుదల చేయడానికి తీసుకోవడం జరిగిందన్నారు. కండలేరు సామర్థ్యంమేరకు నీరు చేరుతుందన్నారు. ఫ్లడ్‌ఫ్లో 24 వేల క్యూసెక్కులు పెంచడానికి టైం పడుతుందన్నారు. టెంపుల్ టూరిజం పార్కుల ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందిస్తున్నామన్నారు. రెవెన్యూ అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ సిబ్బంది ఎప్పటికప్పుడు అవసరమైన రక్షణచర్యలు తీసుకోవాలని సూచించారు.లక్ష క్యూసెక్కుల పైన నీరు దాని ప్రభావం ఉంటుందన్నారు. ఆనం సంజీవరెడ్డి తెనాలి ద్వారా కరువు పీడిత మండలాలైన మర్రిపాడు, వింజమూరు, దుత్తలూరుకు నీటిని అందజేసి పనులు ప్రారంభించినట్లు మంత్రి ఆనం తెలిపారు. హైపవర్ కెనాల్ ద్వారా 60 నుంచి 70 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తుందని అందులో భాగంగా దీపం2కింద సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇవ్వడం, స్త్రీశక్తి, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటివి ఉన్నాయన్నారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేసి రైతులకు మంచి జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

**మంత్రి ఆనంకు స్వాగతం పలికిన కేశవచౌదరి :** రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం సోమశిలలో పర్యటించారు. తొలుత సోమశిల జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేసే సందర్భంగా సోమశిల ప్రాజెక్ట్ ఛైర్మెన్ వేలూరు కేశవచౌదరి మంత్రి ఆనంకు ఘనస్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో సన్మానించి బొకే అందజేశారు.

# 'డబుల్ ఇంజిన్'తో రాష్ట్రం సమగ్రాభివృద్ధి

>> సబ్కా సత్ సబ్కా వికాస్ సైతాంతిక సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నారు అన్నారు. కాశ్మీర్ రాష్ట్రానికి న్యాయం చేస్తామని చెప్పినట్లు చేశామని జనజీవన స్రవంతిలో భాగస్వామ్యం చేశామని చెప్పారు. రామజన్మభూమి లో రాముని ఆలయం నిర్మించామని ముస్లిం సమాజానికి ముస్లిం మహిళలకు కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నామని పార్లమెంట్లో సవరణ తీసుకు వస్తున్నామని ఆయన తెలిపారు. బిజెపి అనేది కార్యకర్తల పార్టీ అని ప్రపంచంలో అత్యధిక రాజకీయ పార్టీగా బిజెపి ఉందని ఆయన చెప్పారు. 2024లో నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించిన నాటికి ఆర్థిక పరిస్థితి నత్త నడక నడిచేదని ఆయన తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల వల్ల ఇప్పుడు మొదటి స్థానంలో ఉందని ఇది గర్వంగా చెప్పుకుంటున్నామన్నారు. రాబోయే తరానికి జీఎస్టీ 2.0 నీ తీసుకొని సంస్కరణలో తీసుకువచ్చామని దేశంలో సెప్టెంబర్‌లో దసరా దీపావళి ఒకే నెలలో వచ్చినట్టు ఉంటుందని అన్నారు. ఆరోగ్య బీమాకు జీఎస్టీ పూర్తిగా తీసివేస్తున్నామని దేశం ఆరోగ్య దేశంగా ఉండాలని మోడీ ప్రధాన ఉద్దేశం అని చెప్పారు. రక్షణ రంగంలో ఏడు రెట్లు ప్రగతి సాధించామని మందులు తయారీ అభివృద్ధిలో కూడా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. అమృత్ భారత్ గా వందే భారత్ పేరుతో రైలు, విమానాశ్రయాలు అభివృద్ధి చేస్తున్నామని, భోగాపురం నిర్మాణం జరుగుతుందని ఆయన తెలిపారు. 17 మెడికల్ కళాశాలలు కట్టిస్తున్నామని అమరావతి రాజధాని కట్టేందుకు సహకరిస్తున్నామని అని చెప్పారు. ముఖ్యంగా దక్షిణ కోస్తా ప్రాంతంలో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తుందన్నారు. పాలన ఏ విధంగా ఉందో ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని చెప్పారు. 15 నెల ముందు ఆంధ్రప్రదేశ్ పూర్తి అంధకారంలోకి వెళ్లిపోయిందని ఇప్పుడు ఆంధ్రాని చంద్రబాబు నాయుడు వెలుగులోకి తీసుకు వస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాసరాజు, రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, కృష్ణయ్య, సత్యనారాయణ, పరశురామరాజు, శివ ప్రకాష్ రెడ్డి, ఆడారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు కేంద్రం పెద్దపీట: మంత్రి అనిత

**తిరుపతిరూరల్,సెప్టెంబర్14 ప్రభాతవార్త:** మహిళల భద్రత కోసం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని రాష్ట్ర హోమ్‌శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తొలి జాతీయ మహిళా సాధికార సదస్సుకు విచ్చేసిన మంత్రి మీడియాతో మాట్లాడారు. తల్లిని చెల్లిని ఏవిధంగా గౌరవిస్తారో అలానే ఇతర మహిళలను కూడా గౌరవించాలన్నారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుఅడుగు వేస్తే, అనుకున్న సాధించవచ్చునని తెలిపారు. వ్యక్తిత్వ హననం వల్ల మహిళలు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారన్నారు. మహిళల శక్తిని దిగజార్చితే దేశమనుగడే ప్రశ్నార్థకంగామారుతుందన్నారు. రాష్ట్రంలో మహిళల సంరక్షణకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళను మహిళాగానే చూడాలి తప్ప...ఆట వస్తువుగా చూడరాదన్నారు.మహిళలు భయం, అందోళనలు మన స్సులోంచి తీసివేయాలన్నారు.

# ఆర్‌డిటి లైసెన్సులు పునరుద్ధరించాలి

## ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు

**విజయవాడ, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** ఆర్‌డిటి లైసెన్సులు పునరుద్దరించాలని ఏపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు డిమాండ్ చేశారు. పలు దశాబ్దాలుగా గ్రామీణ ప్రజల అభివృద్ధికి, బలహీన వర్గాల సుస్థిర జీవితానికి ఆశాజ్యోతి వలే నిలిచిన ఆర్‌డిపై ఇటీవల కుట్రలు జరుగుతున్నాయని, ఎఫ్‌ఆర్‌సిఎ లైసెన్సు రద్దు, నకిలీ ఆరోపణలు, మతమార్పిడి పేరిట వ్యాపిస్తున్న తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలపై ప్రజలకున్న అసంతృప్తిని సేవా సంస్థలపైకి మళ్లించడం, అంతర్జాతీయ నిధులపై నియంత్రణ పెంచే ప్రయత్నం జరుగుతున్నాయని వాటిని వెంటనే నిలువరించాలని లేకుంటే ప్రజా ఉద్యమంగా ఎదిరిస్తామన్నారు.

## వారం - వర్జ్యం

15-09-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
నవమి రా.1.33
మృగశిర ఉ.7.32
వర్జ్యం : మ.3.40-5.13
దు.ము.12.29-1.18,
2) మ.2.55-3.44
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు.

**వృషభం:** అప్పులు ఇవ్వడం, అప్పులు తీసుకోవడం రెండు లాభించవు. ప్రయాణాలు.

**మిథునం:**పురోభివృద్ధిలో స్వల్ప మందగమనం ఏర్పడుతుంది. సోదరుల కలయిక.

**కర్కాటకం:**ముఖ్యమైన పత్రాలపై సంతకాలు చేయునప్పుడు బాగా పరిశీలించి సంతకాలు చేయటం మంచిది.

**సింహం:**మీ మౌనము మీ సహనము మీరు మేలు చేస్తాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**కన్య :** శారీరకంగా, మానసికంగా అలసట, పని భారము అధికమవుతాయి. వస్త్ర లాభం.

**తుల :** స్థిరత్వము, ధైర్యము వలన చాలా ఫలితములు అనుకూల దిశలో పయనిస్తాయి.

**వృశ్చికం:**నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**ధనుస్సు:** వ్యవహారాలలో సన్నిహితుల సహాయం అందుతుంది. ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి.

**మకరం:** విదేశీ పర్యటన అవకాశాలు ఉంటాయి. స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించండి.

**కుంభం:** గృహ సంబంధమైన ఖర్చులను తగ్గించే యత్నమును, ఆదాయమునకు అదనపు మార్గములను అన్వేషిస్తారు.

**మీనం :** కొద్దిపాటి స్పర్థలు, చర్చలు వంటివి ఇబ్బందిని కలిగించినా, ముఖ్యమైన కార్యక్రమాలను పూర్తిచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అత్యాధునిక బస్‌స్టేషన్

>> మాల్స్, మల్టీ ప్లెక్స్‌లతో డిజైన్లు రూపొందించాలని అధికారులకు సూచించారు. రెండు బస్ ఎంట్రీలు, ఎగ్జిట్ వేలు 2 ఏర్పాటు చేయాలని, సోలార్ రూఫ్ టాప్‌తో సొంత విద్యుత్ అవసరాలు తీర్చుకునేలా చూడాలన్నారు. మొత్తం 13 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టిన ఈ బస్ స్టేషన్ కనీసం లక్ష మంది నిత్యం రాకపోకలు సాగించేందుకు వీలుగా నిర్మాణం చేయాలన్నారు. భవిష్యత్‌లో అన్నీ ఎలక్ట్రికల్ బస్సులే నడపనున్న నేపథ్యంలో ప్రతీ బస్సుకు చార్జింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. దీనికి సంబంధించి మొత్తం 5 మోడల్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. వాటిని మరింత అభివృద్ధి చేయాలన్నారు. దీనికోసం స్టేక్ హోల్డర్లతో సమావేశం నిర్వహించాలన్నారు. అలాగే రాష్ట్రంలో అన్ని బస్ స్టేషన్లు ఆధునీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచనలు చేశారు. తిరుపతితో పాటు కీలక నగరాల్లో బస్ స్టేషన్లు అభివృద్ధి చేయాలన్నారు,ఆయా నగరాల్లో అవసరత బట్టి ప్రాంతీయంగాను బస్‌బేలు పెరగాలన్నారు.దీని వలన కీలక ప్రాంతాల్లో బస్సులు అందుబాటులో ఉండటమే కాకుండా, ప్రధాన స్టేషన్‌పై వత్తిడి తగ్గుతుందన్నారు.జాతీయరహదారులకు అందుబాటులో బస్‌స్టేషన్లు ఉండాలన్నారు.

# నాలుగు రోజులు వర్ష సూచన

>> కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.ఆదివారం సాయంత్రం 5 గంటల నాటికి గుంటూరులో 81మిమీ,పల్నాడు జిల్లా తుర్లపాడులో 54.5మిమీ, పెద్దకూరపాడులో 40.2మిమీ, గుంటూరు జిల్లా వంగిపురంలో 39.5మిమీ, కోనసీమ జిల్లా ముక్కములలో 39మిమీ చొప్పున వర్షపాతం నమోదైందన్నారు.గుంటూరు కురిసిన భారీ వర్షం నగరాన్ని అతాకుతలం చేసింది.కీలక రహదారులన్ని కాల్వలుగా మారాయి. జాతీయరహదారిపై వర్షపు నీరు ప్రవహించింది.

15-09Pg3 GNT a_15-09Pg3 GNT.qxd 9/15/2025 12:52 AM Page 1





విజయవాడ బస్‌స్టేషన్‌లో మంచినీటి పాయింటును పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

## ప్రయాణికుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతి నిధి:** ప్రయాణికుల భద్రత, బస్టాండు పరిశుభ్రతలో రాజీపడే ప్రసక్తే లేదని.. ఆహార పదార్థాల విక్రయశాలలు కచ్చితంగా ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందేనని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టం చేసారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం కలెక్టర్ విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాట్‌ఫాంలతో పాటు ఆహార విక్రయ దుకాణాలు,హోటళ్ళు మంచినీటి పాయింట్లు, మరుగుదొడ్ల పరిస రాలను పరిశీలించారు. ఏ సమయంలోనైనా అపరిశుభ్రత అనే మాట వినిపించకూడదని.. ప్రయాణికుల ఆహార భద్రతకు భరోసా కల్పించేలా పరిశుభ్రతా చర్యలు తీసుకోవా లన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పక్కా ప్రణాళికలతో నిరంతర పర్యవేక్షణతో ప్రయాణి కులు సంతృప్తి చెందేలా సౌకర్యాలతో సేవలం దించాలన్నారు. ప్రాంగణంలోని దుకాణాలు, స్టాళ్లు తప్పనిసరిగా ధరల పట్టికలను ప్రదర్శిం చాలని ఆదేశించారు. ప్రయాణికులకు చాలా సులభంగా అర్థమయ్యేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పాత డస్ట్ బిన్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని.. ఈగలు, దోమలు లేకుండా యాంటీ లార్వాల్ చర్యలు, పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.

# రాజంపేట టు పుంగనూరు ఎర్రచందనం స్మగ్లింగ్

## 20 దుంగలు స్వాధీనం: ఒకరి అరెస్టు



**ప్రభాతవార్త ప్రతినిధి, పుంగనూరు సెప్టెంబర్ 14** తమిళనాడు రాష్ట్రంలోని క్రిష్ణగిరి సెంట్రల్ జైలు లో కలిసిన నలుగురు నేరస్తులు ముఠాగా ఏర్పడి ఎర్రచందనం స్మగ్లింగ్ చేసి చివరకు పుంగనూరులో పట్టుబడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. క్రిష్ణగిరి చెందిన మణివన్, తిరువన్నామలై కి చెందిన రవి, కర్ణాటక హుస్కోట కు చెందిన సయ్యద్ ఆరిఫ్, తమిళనాడు హోసూరు కు చెందిన సర్దార్ అనే నిందితులు కృష్ణగిరి జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో స్నేహితులయ్యారు. శిక్ష ముగిసిన తర్వాత విడుదలైన ఈ నలుగురు ఎర్రచందనం స్మగ్లింగ్ కు పథకం రచించారు. అనుకున్నది తడవుగా కడప జిల్లా రాజంపేట అడవుల నుంచి 20 ఎర్రచందనం దుంగలను సేకరించారు. శనివారం వీటిని రవాణా చేసేందుకు ఒక ఇన్నోవా వాహనాన్ని ఏర్పాటు చేసుకుని, దుంగలను అందులో తరలించారు. అర్ధరాత్రి వేళ అక్రమ మార్గాల గుండా వాహనం ప్రయాణిస్తున్న తీరును పోలీసు నిఘా వర్గాలు గమనించాయి. పలమనేరు డి.ఎస్.పి ప్రభాకర్ ఆదేశాల మేరకు పుంగనూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు, ఎస్సై హరి ప్రసాద్ సిబ్బంది కలసి ఈ వాహనాన్ని పుంగనూరు సుగాలి మిట్ట మార్గంలోని నేతిగుట్లపల్లి వద్ద అడ్డగించారు. అప్పటికే వాహనం ముందర రెండు ద్విచక్ర వాహనాల్లో మార్గం చూపుతూ ప్రయాణిస్తున్న ఇద్దరు నిందితులు పరారయ్యారు. కారులో ప్రయాణిస్తున్న మరో నిందితుడు కూడా పరారు కాగా వాహనంతో పాటు సర్దార్ అనే నిందితులు పోలీసులకు పట్టబడ్డాడు. ఇతనిని విచారించగా తక్కిన ముగ్గురు నిందితుల వివరాలు తెలిసాయి. మొత్తం 20 ఎర్రచందనం దుంగలను, మీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం విలువ 34 లక్షల రూపాయలుగా నిర్ధారించారు. తక్కిన ముగ్గురు నేరస్తులను కూడా అదుపులో తీసుకున్నందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డిఎస్పి ప్రభాకర్ తెలిపారు. రాజంపేట అడవుల నుంచి పుంగనూరు అడవుల వరకు పల్లె దారులలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ గతంలో పలు వాహనాలు పట్టుబడ్డాయి. పుంగనూరు అడవులను అడ్డుగా పెట్టుకుని ఎర్రచందనం రాత్రికి రాత్రే చెన్నై హార్బర్ చేర్చేందుకు సినీ ఫక్కిలో నేరస్తులు చేస్తున్న విశ్వ ప్రయత్నాలను పోలీసులు భగ్నం చేస్తున్నారు.

## నాలుగో ఆర్థిక సంఘం అమలు పొడిగింపు

**విజయవాడ, సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** నాలుగవ ఆర్థిక సంఘం అమలు గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. కొద్ది రోజుల క్రితమే ఐదో ఆ ర్థిక సంఘం తన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించారు, ఎప్పుడో కాలపరిమితి దాటిపోయిన నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు కాలాన్ని మరికొంత కాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. నాలుగో ఆర్థిక సంఘం కాలంలో చేయాల్సిన అనేక కార్యక్రమాలు ఇంకా పూర్తి కాకపోవడంతో దానిని వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు పొడిగిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2018 లోనే నాలుగ ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మూడేళ్ల పాటు కొనసాగే ఈ ఆర్థిక సంఘం ఇచ్చే నివేదికలను 2021 నుంచి 2024 మధ్య కాలంలో అమలు చేయాలని కూడా నిర్ణయించారు. ఇదే సమయంలో నాలుగో ఆర్థిక సంఘం కాలపరిమితి ముగిసిపోయిన రెండేళ్ల వరకు కొత్త ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడంతో కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, 2023 లో ఐదో ఆర్థిక సంఘాన్ని ఏర్పాటుచేశారు. అయితే ఇప్పటికీ నాలుగో ఆర్థిక సంఘం నివేదిక మాత్రం పూర్తిగా అమలు కాకపోవడం గమనార్హం ప్రధానంగా స్థానిక సంస్థల అభివృద్ధికి చేయాల్సిన కార్యక్రమాలు ఆగిపోయాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. 2024లోనే ఈ నివేదిక అమలు పూర్తికావాల్సి ఉందని, అయితే అనేక కారణాలతో ప్రగతి కనిపించ లేదని అధికారులు చెబుతున్నారు. అందుకే ఈ అమలు కాలాన్ని మరికొంత కాలం పొడిగించాల్సి వచ్చిందని వారంటున్నారు. కాగా ఐదో ఆర్థిక సంఘం కూడా కొద్ది రోజుల క్రితమే తన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించింది. దీని అమలు కూడా ప్రారంభం కావాల్సి ఉంది. ఇంకా నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సులే పూర్తిగా అమలు కాని నేపథ్యంలో ఇక ఐదో ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు ఎప్పుడు ప్రారంభమవుతాయె చూడాల్సి ఉంది.

## సిఎం చంద్రబాబు తిరుపతి పర్యటన రద్దు

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు ఆదివారం తన తిరుపతి పర్యటనను రద్దు చేసుకున్నారు. తిరుపతిలో నేటి నుంచి రెండు రోజుల పాటు జరుగుతున్న జాతీయ మహిళా సాధికారిత సదస్సుకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకావాల్సి ఉంది. అయితే అధికారుల సూచనలను అనుసరించి సీఎం తన పర్యట నను రద్దు చేసుకున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారికంగా ప్రకటించారు., అమరావతి తిరుపతి మార్గంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో హెలికాప్టర్ ప్రయా ణం సురక్షితం కాదని ఏవియేషన్ అధికారులు తెలిపారు. దీంతో సిఎం చంద్రబాబు పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. మరోవైపు, తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్ హాల్లో జరిగే మహిళా సాధికారతపై జాతీయ సదస్సులో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, ఏపీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, బీజేపీ ఎంపీ పురందరేశ్వరి సహా పలు రాష్ట్రాలకు చెందిన 100 మంది ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నేటి నుంచి రెండు రోజుల పాటు జరుగుతుంది.

## ఎపి ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జి జెఎండిగా పృథ్వీతేజ్

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జి జెఎమ్‌డిగా పృథ్వీతేజ్‌ను ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన జిఓ 86ను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ శుక్రవారం విడుదల చేశారు. ట్రాన్స్‌కో జెఎమ్‌డిగా ఉన్న కీర్తిని తూర్పుగోదావరి జిల్లా కలెక్టరుగా నియ మించారు. ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డిగా ఉన్న పృథ్వీతేజ్‌కు ట్రాన్స్‌కో జెఎమ్‌డికి ఎపి పవర్ కో ఆర్డినేషన్ కమిటీ మెంబర్ కన్వీనర్‌గా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది.

# తిరుమలలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు

## - వాహనసేవల వీక్షణకు 35 ఎల్ఇడిస్క్రీన్లు



**తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి పదిరోజుల్లో ఆరంభంకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయనున్న సామాన్యభక్తులకు అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లుచేస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. ఇప్పటికే తిరుమలలో ఆలయ మాఢవీధుల్లో ఏర్పాట్లు దాదాపు పూర్తికావస్తున్నాయన్నారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వీక్షణకు భక్తులకు తిరుమలఅంతటా 35 ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుపై ఆదివారం సాయంత్రం టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మాఢవీధుల్లో తనిఖీ చేశారు. పదిరోజుల్లో మొదలుకానున్న స్వామివారి వాహనసేవల వీక్షణకు విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మాఢవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు,అందులో ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గరుడసేవరోజు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భద్రత, సౌకర్యాలు ఏర్పాటుచేస్తామన్నారు. వైద్యసేవలు, మరుగుదొడ్లు, తాగునీరు. అన్నప్రసాదాలు, కాఫీ, పాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆలయ మాఢవీధుల్లో, ఆలయుం ముందు, వాహనమండపం ప్రాంతాల్లో గ్యాలరీలు ఏర్పాటు పనులు పూర్తిదశకు చేరుకున్నాయి. వాహనసేవలు జరిగే సమయంలో భక్తులు గ్యాలరీల్లోకి సులభంగా చేరుకునేలా, తిరిగి వెలుపలకు వెళ్ళేలా భద్రత సిబ్బంది చర్యలు తీసుకుంటారన్నారు.

## విజయవాడలో డయేరియాపై ఆందోళనపడాల్సిన అవసరం లేదు: కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలోని డయేరియాపై ఎవ్వరూ ఆందోళనపడాల్సిన అవసరం లేదు అని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ... డయేరియాపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. విజయవాడ రాజరాజేశ్వరి పేటలో ప్రతి ఇంటికీ హైజీన్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సబ్బులు, హ్యాండ్ వాష్, పినాయిల్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నట్లు తెలిపారు. డయేరియాపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్ 91549 70454ను సంప్రదించాలని సూచించారు.

## సెల్ఫ్ ఫైనాన్సింగ్ పద్ధతి తీసుకొచ్చింది మీరు, పిపిపి విధానంపై దుష్ప్రచారం చేస్తారా..

**విజయవాడ.సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:**సెల్ఫ్ ఫైనాన్సింగ్ పద్ధతి మీరు తీసుకొచ్చిన మీరు, పీపీపీ విధానంపై దుష్ప్రచారం చేస్తారా !అంటూ ఏపీ ఆరోగ్యశాఖా మంత్రి వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు లేఖ రాసారు.రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలను రూ.8,480 కోట్లతో నిర్మించాలని నాటి మీ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే నాలుగేళ్ళలో రూ.1450 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందనే విషయం మరిపోయారా ?అని మంత్రి సత్యకుమార్ జగన్‌ను ప్రశ్నించారు.

### ప్రముఖులకు మొమెంటోలు అందచేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



**తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో ప్రారంభమైన జాతీయ మహిళా సాధికారత సదస్సుకు విచ్చేసిన ప్రముఖులకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు తనదైన శైలిలో మెమొంటోలను అందజేశారు. లోక్‌సభస్పీకర్ ఓంబిర్లా, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఎంపి దగ్గుబాటి పురందేశ్వరికి,రాష్ట్రమంత్రి పయ్యావుల కేశవ్‌కు శ్రీవేంకటేశ్వరస్వామి జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.


**pnb Housing Finance Limited**

నమోదిత కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష భవన్, 22, కె.జి. మార్గ్, న్యూఢిల్లీ-110001. ఫోను: 011-23357171, 23357172, 23705414, వెబ్ www.pnbhousing.com

శాఖా కార్యాలయం : #39-3-1, 2వ అంతస్తు, ఆంజనేయులు జెవెల్లర్స్ పైన, M.G రోడ్, విజయవాడ-520010.

శాఖా కార్యాలయం : జిటి ప్రైమ్ 31-4-363, 1వ అంతస్తు, అరండల్‌పేట్, 4వ లేన్, గుంటూరు-522002

[illegible]

| [illegible] | రుణగ్రహీత మరియు సహరుణగ్రహీత పేరు/చిరునామా | [illegible] | తనఖా పెట్టిన ఆస్తి(లు) | [illegible] | [illegible] |
| --- | --- | --- | --- | --- | --- |
| HOU/ VJWD/ 0724/ 1289193 B.O.: విజయవాడ | [illegible] ... ఆంధ్రప్రదేశ్-521 225 ... ఆంధ్రప్రదేశ్-522212 ... ఆంధ్రప్రదేశ్-522509. | NA | గుంటూరు జిల్లా, గుంటూరు ఉప జిల్లా, [illegible] | 04-సెప్టెంబరు-2025 | రూ. 10,93,558.24 [illegible] 04-09-2025 నాటికి |
| HOU/ GNTR/ 0224/ 1219996 B.O.: గుంటూరు | [illegible] ... ఆంధ్రప్రదేశ్-522002 ... ఆంధ్రప్రదేశ్-522034. | NA | గుంటూరు జిల్లా, గుంటూరు ఉప జిల్లా, [illegible] 109-33చ.గ లేదా 91.41చ.మీ. [illegible] | 04-సెప్టెంబరు-2025 | రూ. 30,60,171.32 [illegible] 04-09-2025 నాటికి |

ప్రదేశము : విజయవాడ, గుంటూరు, తేది: 13-09-2025

సం/- అధీకృత అధికారి, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.


## ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలి : సిఐటియు రాష్ట్ర కమిటీ

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** పని గంటల పెంపు బిల్లును ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు ఒక ప్రకటన విడుదల చేశారు. పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో పని గంటలు పెంచుతూ రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో కార్మిక చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెడతామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి ప్రకటించటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా మని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించడమంటే బిల్లును ప్రవేశపెట్టి తమ మందబలంతో ఆమోదింపజేసుకుంటామని చెప్ప టం మినహా మరొకటి కాబోదని పేర్కొన్నారు. అంతకు ముందు మంత్రివర్గం ఆమోదం పొందిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టకుండా రద్దు చేయాలని కోరారు. కార్మికులు ఎక్కువ సెలవులు పొందే విధంగా ఈ సవరణలు చేస్తున్నామని చెప్పటం కార్మికులను మోసగించ టానికేనని తెలిపారు. కర్ణాటక బిజెపి ప్రభుత్వం మొదటగా 2023లో ఫ్యాక్టరీల చట్టానికి సవరణలు చేసి పని గంటలు రోజుకు 12 గంటలు చేసిందని పేర్కొన్నారు. వారానికి 48 గంటల పని కొనసాగుతుందని, వారంలోపే 48 గంటలు పూర్తయితే మిగతా రోజులు వేతనంతో కూడిన సెలవు దినాలుగా పరిగణించ బడతాయని చెప్పిందని తెలిపారు.

# తిరుమల సమాచారం

## మహిళలను ముందుకు తీసుకెళ్లేలా ప్రధాని మోడీ కార్యక్రమాలు

### - పలువురు మహిళా ప్రతినిధులు



**తిరుమల,సెప్టెంబర్ 14ప్రభాత వార్తప్రతి నిధి:** దేశంలో మహిళలను ముందుకు తీసుకెళ్ళేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక పథకాలు ,కార్యక్రమాలు అమలుచేస్తున్నారని ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి,పలువురు మహిళా ప్రజా ప్రతినిధులు తెలిపారు. తిరుపతిలో మొదటిసారిగా జాతీయ మహిళా సాధికారత సదస్సు శ్రీవారిపాదాల చెంత ప్రారంభం కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మహిళా శక్తితో దేశం ఆర్థికంగా, సామాజికంగా పురోభివృద్ధి చెందుతందన్నారు. తిరుపతి సదస్సుకు విచ్చేసిన ఎంపి పురందేశ్వరి, మాజీ గవర్నర్ తమిళిసై, ఇన్ఫోసిస్ అధినేత, ఎంపి సుధానారాయణమూర్తి ,ఏపి మంత్రులు అనిత,సవిత, మహారాష్ట్ర ఎంపి రోహిణి, సంధ్యారాణి, ఎంఎల్ఎ పరిటాల సునీత,తమిళనాడు మంత్రి గాంధీ ఆదివారం ఉదయం తిరుమలేశుని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



**తిరు మల, సెప్టెంబర్ 14ప్రభాత వార్త ప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ఆదివారం ఉదయం నైవేద్యవిరామసమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ నగేశ్ బీమపాక , ఏపి హైకోర్టు జడ్జి జస్టీస్ టిసిడి శేఖర్‌లు కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. కుటుం బంతో కలసి వచ్చిన వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనంచేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## యాచకులు, అనధికార వ్యాపారుల తరలింపు

**తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్న నేపధ్యంలో తిరుమల నుండి యాచకులు, అనధికార వ్యాపారులను ఆదివారం టిటిడి విజిలెన్స్, తిరుమల పోలీసులు తరలించారు. భద్రతను దృష్టిలో ఉంచుకుని కఠిన చర్యల దిశగా తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదివారం ఉదయం తిరుమలలో పర్యటించారు. కళ్యాణకట్ట, ఎస్వీషాపింగ్ కాంప్లెక్స్,ఆస్థానమండపం ప్రాంతాల్లో 82మంది యాచకులు, అనధికార వ్యాపారులను తిరుపతికి తరలించారు. వారి అనుమానితుల వేలిముద్రలను సేకరించారు. హోటళ్ళు, టీ దుకాణాలు ,చిల్లరదుకాణాల యజమానులు తిరుమలలోపనిముగిసిన తరువాత కార్మికులకు తిరుపతిలో వసతి కల్పించాలని పోలీసులు సూచించారు.

## విశాఖపట్నం నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్,సెప్టెంబరు14, ప్రభాతవార్త** విశాఖపట్నం నుంచి తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు నడవనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. విశాఖపట్నం నుంచి తిరుపతి స్పెషల్ ట్రైన్ ఈ నెల 15 నుంచి నవంబర్ 24 వరకు ప్రతి సోమవారం అందుబాటులో ఉంటుంది. అదే విధంగా, తిరుపతివిశాఖపట్నం రైలును ఈ నెల 16 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి మంగళవారం నడపనున్నట్లు వివరించారు. ఈ మార్గంలో మొత్తం 22 సర్వీసులు నడుస్తాయి.ఇక తిరుపతి నుంచి అనకాపలి - తిరుపతి మధ్య అక్టోబర్ 5 నుంచి అక్టోబర్ 27 వరకు మొత్తం 8 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా సంబల్‌పూర్ ఇరోడ్ మధ్య కూడా రైల్వే శాఖ ప్రత్యేక సర్వీసులను ప్రకటించింది. సంబల్‌పూర్ నుంచి ఇరోడ్ వెళ్లే రైలు సెప్టెంబరు 17 నుంచి నవంబర్ 26 వరకు ప్రతి బుధవారం ప్రయాణిస్తుంది.తిరుగు ప్రయాణంలో ఇరోడ్ సంబల్‌పూర్ రైలు సెప్టెంబరు 19 నుంచి నవంబర్ 28 వరకు ప్రతి శుక్రవారం సర్వీసు అందిస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గంలో కూడా మొత్తం 22 ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైల్వే శాఖ సూచించింది.

## ప్రధాని జన్మదిన సందర్భంగా 'సేవాపక్షోత్సవాలు'



కోలా ఆనంద్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు 'సేవా పక్షోత్సవాలు' నిర్వహించుటకు బిజెపి నిర్ణయించిందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ ఆదివారం మీడియాకు తెలిపారు.ఈ మేరకు పార్టీ నాయకులు అమలు చేయటానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా మెడికల్ క్యాంపులు, స్వచ్ఛ భారత్, మొక్కలు నాటడం, దివ్యాంగులకు సత్కారం, క్రీడల పోటీలు, అన్నదానాలు నిర్వహిస్తామని వివరిం చారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోనరేంద్ర మోదీ జన్మదిన కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ నెల 17న రక్తదానం నిర్వహిస్తామన్నారు. బిజెపి నాయకుల ప్రధాన కార్యక్రమాలను శ్రీకాళహస్తి నియోజకవర్గంలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, పట్టణ మాజీ అధ్యక్షులు గరికపాటి రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శి కూనాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం 'చదవటం మాకు ఇష్టం' కార్యక్రమం

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పౌరగ్రంథాలయ సంస్థ ఒక వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. విద్యార్థులో పఠనాసక్తిని పెంచేందుకు ప్రతి ఆదివారం నిర్వహించే చదవటం మాకు ఇష్టం కార్యక్రమం నిర్వహిస్తుంది.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఒక్కో అంశంపై అవగాహన కల్పిస్తోంది.నిష్ణాతుల మార్గదర్శనంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై మక్కువను పెంచుతుంది.ఈ ఆదివారం విజయవాడలో ఠాగూర్ గ్రంథాలయంలో మాతృభాషపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ప్రతి ఒక్కరికీ మన మాతృభాష అయిన తెలుగు తెలిసి ఉండాలి. విద్యార్థులు మాతృభాష నేర్చుకోవడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం తెలుసుకుంటారు. పాఠ్యాంశాలు కూడా సులభంగా అర్థం చేసుకోవచ్చు అని తెలుగు ఉపాధ్యాయురాలు వల్లభనేని సుమతి గారు విద్యార్థులకు తెలియజేశారు.

ప్రతి ఆదివారం ఆమె విద్యార్థులకు అక్షరాలు నేర్పించడం, చదవటం రాయటం , బోధన తదితర అంశాలు లో శిక్షణ ఇస్తున్నారు. ఈ విషయం అమెరికాలో ఉన్న వారి సుమతి కుమారుడు వల్లభనేని వంశీ మాతృభాష మీద మక్కువతో విద్యార్థులకు అక్షరాలతో కూడిన పదాలు నేర్చుకునే పుస్తకాలను బహుకరించారు.


**ACHARYA N.G RANGA AGRICULTURAL UNIVERSITY**

Administrative Office, Lam, Guntur-522034: A.P.

**e-Procurement Tender Notice**

Tenders are invited from the eligible contractors, for Tender Notice No. 06-08, dated 11.09.2025 Civil work - 1 No, Electrical work - 2 Nos, through e-procurement. Details can be had from **www.angrau.ac.in** or from O/o the Estate Officer at the above address. Schedules can be downloaded through **http://www.apeprocurement.gov.in.** For the works 06-08, downloading starts from 15.09.2025 @ 3.00 PM onwards & ends on 29.09.2025 upto 3.30 PM. For details contact: TPA to Estate Officer: 9490008945.

Sd/- ESTATE OFFICER

DIPR.No.4422PP/CL/Advt/1/1/2022-23, Date: 12.09.2025

వార్త


నీవు జీవితంలో అభివృద్ధి చెందాలంటే నిత్యం నూతన మార్గాలను అన్వేషించాలి.

-రాబర్ట్ ఆంథోనీ

# పౌష్టికాహార లోపం

ప్రపంచ జనాభాలో పౌష్టికాహారలోపంతో బాధపడుతున్న బాలల్లో దాదాపు ఇరవైశాతంపైగా భారత్‌లోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక ఏనాటి నుంచో వెల్లడిస్తున్నది. ఐదు సంవత్సరాల్లోపు పిల్లల్లో నలభైశాతం మంది పిల్లలు తక్కువ బరువుతో పుడుతున్నారని, వారిలో ఏడు శాతం మంది పిల్లలు పుట్టిన ఐదేళ్లలోపే మరణిస్తున్నారని ఆ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈభూమ్మీద పుట్టిన వారికి ఎవరికైనా రాజ్యాంగం కల్పించిన హక్కే జీవించే హక్కు. అలాంటిది కన్నులైనా సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన ఆహారం అందక చనిపోతే దానికి బాధ్యత వహించాల్సింది ప్రభుత్వాలే. తల్లీబిడ్డకు పోషకాహారం సకాలంలోఅందివ్వకపోతే ఆ పాపం పాలకులదే అవుతుంది. అందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ యునిసెఫ్ నిర్వహించిన అనేక అధ్యయనాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అనారోగ్య పరిసరాలు, వాతావరణంలో కలుషిత నీరు, డయేరియా వంటి రోగాలబారిన పడి ఆస్పత్రులపాలవుతున్నారు. పిల్లల్లో పోషకాహారలేమి ఉన్నప్పుడు వారికి బలవర్ధక ఆహారం అందివ్వాలని ప్రభుత్వాలు ఐసిడిఎస్ వంటి పథకాల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించినా ఫలితాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఇలా పోషకాహారలేమితో బాధపడుతున్న కారణంగా భారతదేశం ఆర్థికంగా నష్టపోతున్నది. మరొకపక్క పాఠశాలల్లో పారిశుధ్య సౌకర్యం లేకపోవడం వల్ల అంటువ్యాధులు ప్రబలిపోతున్నాయి. మరుగుదొడ్లు లేకపోవడం పరిశుభ్రత ఇక్కడి సమస్య. జనాభాలో దాదాపు ముప్పైఆరు శాతం మందికి సరైన శానిటేషన్ సౌకర్యాలు లేవు. ఇక సమగ్రశిశువు అభివృద్ధి పథకం కింద మాతాశిశు సంరక్షణ కోసం వారికి పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయని ఎన్నోసార్లు కాగ్ చురకలు అంటించింది. మాతాశిశు సంక్షేమంపై జరుగుతున్న నిర్లక్ష్యానికి మచ్చుతునకే పౌష్టికాహారలోపం. సరైన పోషకాలు అందకపోతే పసిపిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపిస్తుంది. అందుకే అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లిపాలు శ్రేష్ఠమని డాక్టర్లు చెబుతుంటారు. మాతృస్తన్యం ద్వారానే పౌష్టికాహారం మేలైన పద్ధతిలో అందించే వీలుంది. ఈ విషయంపై అవగాహన కల్పించడంలోనూ, వైద్యశాఖ అంతగా కృషి చేయలేకపోతున్నదేమోననిపిస్తున్నది. దేశంలోని బాలలందరికి సమగ్రంగా అంగన్‌వాడీ ప్రయోజనాలు అందించాలని దేశ సర్వోన్నత న్యాయస్థానం ఏనాడో మార్గదర్శక సూత్రాలను జారీ చేసినా వాటిని అధ్యయనం చేసి చర్యలు తీసుకున్న సందర్భాలు కూడా లేవనే చెప్పొచ్చు. పిల్లలకే కాదు ముప్పైఏళ్లు దాటిన వారెందరో దేశంలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. భారత్‌లో గత మూడు దశాబ్దాలుగా ప్రజల ఆర్థికస్థితిగతుల్లో వచ్చిన మార్పులు ఆహారపు అలవాట్లను మార్చేశాయి. మరొకపక్క వ్యవసాయోత్పత్తులు గణనీయంగా పెరిగినా ఇప్పటికీ దేశంలో పదిహేను శాతానికిపైగా జనాభా అర్ధాకలితో అలమటిస్తున్నారు. మొత్తం నూట పదిహేడు దేశాల నుంచి సేకరించిన సమాచారంతో రూపొందించినప్రపంచ ఆకలి సూచి 2019లో భారత్‌ది 102వస్థానం. దేశంలో దాదాపు ఇరవై కోట్ల మంది పౌష్టికాహార సమస్యతో బాధపడుతున్నారు. ఇందులో పదిహేను నుంచి నలభైతొమ్మిదేళ్ల వయస్సున్న మహిళల్లో యాభైఒక్కశాతం అత్యంత బలహీనంగా ఉంటున్నారని ఆహార వ్యవసాయ సంస్థ నివేదిక పేర్కొంది. చాలా మంది రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్నారు. చిన్నారుల స్థితిపై యునిసెఫ్ గతంలో ఇచ్చిన నివేదిక ప్రకారం చనిపోతున్న ఐదేళ్లల్లోపు పిల్లల్లో అరవైతొమ్మిదిశాతం సరైన పౌష్టికాహారం లభించక ప్రాణాలు విడుస్తున్నారనే విషయం అందరిని ఆందోళనకు గురిచేస్తున్నది. దాదాపు నాలుగున్నర కోట్ల మంది పిల్లలు వయసుకు తగ్గ ఎత్తుకు పెరగడం లేదు. రెండున్నర కోట్ల మందికిపైగా చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువు ఉండటం లేదు. దేశంలో అత్యధికుల ఆహారంలో పిండిపదార్థాల శాతమే ఎక్కువ ఉంటుందని, మాంసకృతుల వంటి ఇతర పోషకాల శాతం చాలా పరిమితమేనని నివేదికలు వెల్లడిస్తున్నాయి. గ్రామీణుల్లో అరవైశాతం శక్తి కేవలం పిండిపదార్థాల రూపంలో వస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో ఉండేవారికి యాభైఒక్క శాతం పిండిపదార్థాల శక్తి వస్తున్నది. దేశంలో పాలు, కూరగాయలు, మాంసం ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతున్నా అవి అవసరాన్ని తీర్చలేకపోతున్నాయి. ఒక వ్యక్తి నిత్యం తీసుకునే ఆహారంలో మూడువందల గ్రాముల కూరగాయలు ఉండాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. భారత్‌లో ప్రస్తుతం దాదాపు ఇరవై కోట్ల టన్నుల కూరగాయలు యేటా ఉత్పత్తవుతున్నాయి. ఇప్పటికీ పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న వారిలో పదిహేను శాతం, గ్రామీణుల్లో తొమ్మిది శాతం మాత్రమే నిత్యం అవసరమైన మేరకు కూరగాయలను తింటున్నారు. దేశంలో దాదాపు ఇరవై తొమ్మిది కోట్ల టన్నుల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. గ్రామీణ ప్రాంతంలో తొమ్మిదిశాతం, పట్టణ ప్రాంతాల్లో దాదాపుపదిహేను శాతం మాత్రమే తీసుకుంటున్నారని సర్వేలు చెబుతున్నాయి. సమతుల ఆహారాన్ని తీసుకోకపోవడానికి ఆర్థిక సమస్యలు కారణమైనా అవగాహనలోపం కూడా దీనికి తోడవుతున్నది. ఇంకొక పక్క కల్తీ కూడా ప్రజారోగ్యంపై కాటు వేస్తున్నది. ఈ కల్తీని నిరోధించేందుకు పాలకులు తీసుకొంటున్న చర్యలు ఫలితాలివ్వలేక పోతున్నాయి. ఫలితంగా ఎందరో అనారోగ్యం పాలౌతుండగా, పౌష్టికాహారం లోపం దీనికి తోడౌతున్నది. కొత్త చట్టాలు, నూతన పథకాలు తెస్తే తెండి ఉన్న వాటిని త్రికరణ శుద్ధిగా అమలు చేసేందుకు కృషి చేయాలి.

మితిమీరిన ఆశలకు పోయేవారే ఎక్కువగా మోసాలకు గురి అవుతూ ఉంటారు.



అరిస్టాటిల్

అవసరానికి ఆదుకొనే స్నేహితులుండడం అదృష్టం. అసలు స్నేహితుల అవసరం రాకపోవడం ఇంకా అదృష్టం.



ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు



## సమస్యగా మారుతున్న ఇ -వేస్ట్

ఈ డిజిటల్ యుగంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు(ఈవేస్ట్) ఒక తీవ్రమైన సమస్యగా మారుతోంది. మొబైల్, కంప్యూటర్, టీవీ, ఫ్రిజ్ వంటి పరికరాల వినియోగం వేగంగా మారుతూఉండటం ఈసంక్షోభాన్ని మరింతపెంచుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం, భారతదేశంలో 2023వ సంవత్సరంలో సుమారు 17 లక్షల టన్నుల ఈవేస్ట్ ఉత్పత్తి అయింది. అయితే, దీనిలో కేవలం 30 మాత్రమే అధికారికంగా ప్రాసెస్ చేయబడింది. మిగిలిన వ్యర్థాలు అనధికారిక రంగాల్లో సరైన భద్రతా చర్యలు లేకుండా నిర్మూలించబడుతున్నాయి. దీని వల్ల వాయు, జల, మట్టికాలుష్యం వంటి తీవ్రమైన సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈవ్యర్థాలలో సీసం, పాదరసం, క్యాడ్మియం వంటి విషపదార్థాలు ఉంటాయి

- సి.సాయిరుత్విక్, నల్గొండ

## రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య భిక్ష పెట్టండి

తెలంగాణకుసాగు, త్రాగు, పరిశ్రమలకు ఇతరత్రా ఉపయోగపడుతున్న విధంగా సింగరేణి కూడాఅదేవిధంగా బృహత్తర విస్తృత స్థాయిలో నిధులు అందించి దాదాపు ప్రతి ఒక్క రంగానికి నిధులు సమ కురుస్తూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతున్నది. ప్రతిసంవత్సరం గణనీయమైన లాభాలుగడుస్తున్నది. కానీ బొగ్గును ఉత్పత్తి చేసి లాభాలు గడించుటకు సర్వశక్తులు ధార పోసిన రిటైర్డ్ ఉద్యోగుల పట్ల సింగరేణి తల్లి కనికరం చూపడం లేదు. వైద్యసౌకర్యాలు అందక ఆచేతనస్థితిలో బతుకుతున్నారు.

- దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

## పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం

భారతదేశంలో మత్తు పదార్థాల వినియోగం ప్రమాదకరంగా పెరుగుతోంది. పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లో కూడా డ్రగ్స్ సులభంగాలభించడం, యువత వాటి వలలో చిక్కుకోవడం గమనార్హం. కుటుంబవ్యవస్థల బలహీనత, మానసిక ఒత్తిడులు, మిత్రుల ప్రభావంవంటి కారణాలు యువతను మత్తు పదార్థాలవైపు నడిపిస్తున్నాయి. అలాగే, భారత్ రెండు ప్రధాన మత్తు పదార్థాల ఉత్పత్తి ప్రాంతాల మధ్య ఉండటం వల్ల అక్రమంగా డ్రగ్స్ ప్రవేశించే అవకాశాలు పెరిగాయి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పిల్లలను ఆటలాడిద్దాం

క్రీడలు కేవలం ఉల్లాసానికే కాదుమానసిక వికాసం, శారీ రక బలానికి ఎంతో అవసరం. తల్లిదండ్రులు తమ పిల్లల బాల్యాన్ని ఆటలకు దూరం చేస్తున్నారు. వసతులు లేమి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకొరత, పాఠశాలల్లో పోటీత త్వం ఇందుకు కారణాలుగా నిలుస్తున్నాయి. పాఠశాలస్థాయి నుంచి చదువులపై ఒత్తిడి అధికమవుతుంది. ఉద యం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు క్లాసులే క్లాసులు. అదనపు బోధనతో వారి విరామ సమయాన్ని ఉపాధ్యాయులు లాగేసుకుంటున్నారు. దొరికిన కాస్త విరామ సమయం స్మార్ట్‌ఫోన్లు ఆకర్షిస్తున్నాయి. ఈ ప్రతికూలతలు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. ప్రతిపాఠశాలలోవ్యాయామ ఉపాధ్యాయులు నియామకం చేసి క్రీడాపరికరాలు అందజేయాలి.

- సి. చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు జిల్లా

## ప్రమాదంలో ప్రాథమిక హక్కులు

హక్కుల గురించి మాట్లాడడడం రాయడం ఒక మృగ్యం అయిపోతున్న పరిస్థితిలో ఉన్నాం. సంచార స్వేచ్ఛ లేదు జైళ్లలో కనీసం విచారణలేకుండా కుక్కబడినపరిస్థితి ఉంది. దళితులలో ఆదివాసులలో ఈతీవ్రత మరింత ఎక్కు వ అయితే రాజ్యాంగం ఆశించింది అందించింది ఇదేనా అనే భావన కలుగుతుంది. ఇవ్వాళ ఆదివాసులు తమకు ఏమి కావాలి అని దానిని వాళ్లే నిర్ణయించుకుంటారు అనిరాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ దాని అమలులో మాత్రం ఆ ఛాయలు కనిపించవు. నిరసన తెలిపేం దుకు అవకాశం లేదు. చివరికి తనకు నచ్చిన ఆహారం తినే స్వేచ్ఛకూడా లేదు. రాజ్యాంగ సభచర్చలలోఎక్కువ కాలం నలిగిన ప్రాథమిక హక్కుల ఉనికే ప్రమాదంలో ఉంది.

- భారత అవినాష్, జనగామ

## తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి

దశాబ్దాలుగా అన్ని రంగాల్లో వెనకబడి కుంగిపోతున్నా తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి. గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలో కాపు కులంతో తెలగ కులాన్ని జతచేయడం వల్లనే ఉత్తరాంధ్రలో ఉన్న తెలగ కులాన్ని బీసీగా గుర్తించడం లేదు. ఎందుకంటే కాపులు ఆర్థికంగా బలమైన వారు కాని తెలగ కులస్థులు కేవలం వ్యవసాయాన్ని నమ్మి ఆర్థికంగా ఎదగలేకపోయారు. రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ఉద్యోగులు సంపాదించలేకపోయాం. రాజకీయాల్లో రాణించలేకపోయం. అందుకే మా జీవితాల్లో ప్రగతి సూర్యోదయాన్ని చూడలేకపోయాం.

-జి.అశోక్ కుమార్, విశాఖపట్నం

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఎరువుల సమస్యకు 'సేంద్రియ' పరిష్కారాలు

**ఎరువుల సమస్యకు శాశ్వత పరిష్కారాలు సాధించాలంటే దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరం. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించడం అత్యంత అవసరం. దీనివల్ల నేల సారం పెరగడంతో పాటు, రసాయనాల వల్ల కలిగే హాని తగ్గుతుం ది. అంతేకాకుండా, నానో ఎరువుల ఉత్పత్తిని పెంచడం. ఇవి తక్కువ మోతాదులో ఎక్కువ పోషకాలను అందిస్తాయి. వీటిని వాడటం వల్ల రసాయన ఎరువుల వినియోగం తగ్గు తుంది. ఎరువుల ఉత్పత్తిలో కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి పరిశోధన, అభివృద్ధి రంగంలో పెట్టుబడులను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించవచ్చు. అలాగే, ఎరువుల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడా నికి, సరఫరా గొలుసును బలోపేతం చేయడానికి అంతర్జా తీయ స్థాయిలో వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకోవడం అవసరం.**

డి. జయరాం

భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోంది. పంటల దిగుబడిని పెంచడంలో, ఆహార భద్రతను నిర్ధారించడంలో ఎరువులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అయితే దేశీయంగా ఎరువుల ఉత్పత్తి, వినియోగంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. మనదేశంలో అత్యధికంగా ఉపయోగించే ఎరువు యూరియా. దీనికి ప్రధాన కారణం, ఇందులో నత్రజని శాతం ఎక్కువగా ఉండడం. మొక్కల ఎదుగుదలకు నత్రజని అత్యంత అవసరమైన పోషక పదార్థం. ఇది ఆకుల పెరుగుదలకు, కిరణజన్య సంయోగ క్రియకు దోహదపడుతుంది. యూరియా తక్కువ ధరలో లభిస్తుంది. దీనిని రైతులు సులభంగా వాడవచ్చు. అందుకే, దేశంలో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశంలో మొత్తం యూరియా వినియోగం దాదాపు 357 లక్షల టన్నులు. అయితే యూరియాను ఎక్కువగా వాడటం వల్ల నేల సారం తగ్గిపోవడం, భూగర్భ జలాలు కలుషితం కావడం వంటి పర్యావరణ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. వ్యవసాయ శాఖ నివేదికల ప్రకారం, దేశంలో అధికంగా వాడుతున్న ఎరువులలో యూరియా తర్వాత డైఅమ్మోనియం ఫాస్ఫేట్, మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ ఉన్నాయి. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, డైఅమ్మోనియం ఫాస్ఫేట్ వంటి ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా నానో యూరియా విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. 500 మిల్లీలీటర్ల నానో యూరియా బాటిల్ ఒక బస్తా సంప్రదాయ యూరియాకు సమానమని నిపుణులు చెబుతున్నారు. ఇది మొక్కలకు అధిక నత్రజనిని అందించి, పర్యావరణానికి హాని తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే నీటి కాలుష్యం, నేల కాలుష్యాన్ని తగ్గిస్తుంది. యూరియాకు ప్రత్యామ్నాయంగా డీఏపీని విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పటికీ దానిలో ఫాస్ఫేట్, నత్రజని పోషకాలు మాత్రమే ఉంటాయి. పొటాష్, ఇతర పోషకాలు ఇందులో ఉండవు. అందువల్ల, అన్ని పోషకాలు లభించే మిశ్రమ ఎరువుల వాడకం ముఖ్యమని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. భారతదేశంలో ఎరువుల ఉత్పత్తి కోసం కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఉన్నాయి. వీటిలో ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్, బ్రహ్మపుత్ర వ్యాలీ ఫర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, అలాగే కోరమాండల్ ఇంటర్నేషనల్ వంటి ప్రైవేట్ సంస్థలు ఉన్నాయి. అయితే మన దేశీయ అవసరాలకు తగ్గట్టుగా ఎరువులను ఉత్పత్తి చేయలేకపోవడం ఒక ప్రధాన సమస్య. పెరుగుతున్న జనాభా, వ్యవసాయ భూమి విస్తీర్ణం, అధిక పంటల దిగుబడి లక్ష్యాల కారణంగా ఎరువుల అవసరం భారీగా పెరిగింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం భారతదేశం తన ఎరువుల అవసరాల్లో దాదాపు 30శాతం దేశీయంగా ఉత్పత్తి చేస్తుండగా, మిగిలిన 70శాతం దిగుమ



తులపై ఆధార పడుతోంది. ఈ లోటును పూడ్చుకోవడానికి మనం భారీగా ఎరువులను దిగుమతి చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. మనదేశం ఎరువుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించలేకపోవడానికి కొన్ని ప్రధాన కారణాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది ముడిసరుకుల కొరత. ఎరువుల ఉత్పత్తికి అవసరమైన సహజ వాయువు వంటి ముడిసరుకులు మన దేశంలో తక్కువగా ఉన్నాయి. ఈ కారణంగా, వాటిని మనం దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. అంతేకాకుండా, ఎరువుల పరిశ్రమల్లో ఆధునిక సాంకేతికత, మౌలిక సదుపాయాలు తగినంతగా లేకపోవడం కూడా ఒక కారణం. దీనివల్ల ఉత్పత్తి సామర్థ్యం తక్కువగా ఉంటుంది. ఈ లోటును పూడ్చుకోవడానికి భారతదేశం భారీగా ఎరువులను దిగుమతి చేసుకుంటుంది. తన ఎరువుల అవసరాలను తీర్చడానికి చైనా, కెనడా, జోర్డాన్, రష్యా, మొరాకో వంటి దేశాల నుండి దిగుమతి చేసుకుంటుంది. ఈ దిగుమతులకు భారీగా విదేశీ మారక ద్రవ్యం అవసరమవుతుంది. మన దేశం ఎక్కువగా యూఎస్ డాలర్లలో చెల్లింపులు చేయాల్సి వస్తుంది. ఎరువుల ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో హెచ్చుతగ్గులకు లోనైనప్పుడు, దాని ప్రభావం మన దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. ఈ విదేశీ మారక ద్రవ్యాన్ని మనం ఎగుమతులు పెంచడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా సమకూర్చుకుంటున్నాం. అయితే దిగుమతులపై అధికంగా ఆధారపడటం వల్ల దేశీయ ఆర్థిక వనరులపై ఒత్తిడి పెరుగుతుంది. ఎరువుల ఉత్పత్తిలోస్వయం సమృద్ధి సాధించాలంటే అనేక సవాళ్లను అధిగమించాలి. ముఖ్యంగా ముడిసరుకుల లభ్యతను పెంచడం ఒక పెద్ద సవాలు. సహజ వాయువు నిల్వలను పెంచడం, కొత్త ఎరువుల ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా ఈ సమస్యను కొంత వరకు పరిష్కరించవచ్చు. మూసివేసిన ఎరువుల ఫ్యాక్టరీలను పునఃప్రారంభించడం కూడా ఒక మంచి పరిష్కారం. రసాయన ఎరువుల ఉత్పత్తి, వినియోగం వల్ల పర్యావరణానికి హాని జరుగుతుంది. దీనికి పరిష్కారంగా, సేంద్రీయ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడం, నానో యూరియా వంటి ఆధునిక, పర్యావరణహిత ఎరువులను ప్రోత్సహించడం అవసరం. రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించడం, సేంద్రీయ ఎరువుల ఉత్పత్తిని ప్రోత్సహించడం వల్ల పర్యావరణానికి హాని తగ్గించవచ్చు. ఎరువుల సమస్యకు శాశ్వత పరిష్కారాలు సాధించాలంటే దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరం. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించడం అత్యంత అవసరం. దీనివల్ల నేల సారం పెరగడంతో పాటు, రసాయనాల వల్ల కలిగే హాని తగ్గుతుంది. అంతేకాకుండా, నానో ఎరువుల ఉత్పత్తిని పెంచడం. ఇవి తక్కువ మోతాదులో ఎక్కువ పోషకాలను అందిస్తాయి. వీటిని వాడటం వల్ల రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. ఎరువుల ఉత్పత్తిలో కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి పరిశోధన, అభివృద్ధి రంగంలో పెట్టుబడులను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించవచ్చు. అలాగే, ఎరువుల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, సరఫరా గొలుసును బలోపేతం చేయడానికి అంతర్జాతీయ స్థాయిలో వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకోవడం అవసరం. ఈ చర్యలన్నీ తీసుకున్నట్లయితే భారతదేశంఎరువుల రంగంలో స్వయంసమృద్ధి సాధించి, రైతులకు భరోసా కల్పించడంతోపాటు, ఆహార భద్రతను పటిష్టంచేయగలదు. •

# ప్రజాస్వామ్యం కోసం వేదిక ఇచ్చారు.. స్పందన ఎక్కడ?

సోరుపాక అనిల్ కుమార్

ప్రభుత్వాన్ని మనం ప్రజల సేవకుడిగా చూడాలని నేర్పారు. దేశ అభివృద్ధికి, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిని అందించాల్సిందేనని భావిస్తాం. అందుకే ప్రతి కుటుంబం తన ఆదాయంలో కొంత భాగాన్ని పన్నుల రూపంలో చెల్లించి, ప్రభుత్వంపై నమ్మకంతో జీవిస్తోంది. తన సమస్యను చెప్పుకునేందుకు, తన కష్టాలను వినిపించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేదికలు ఉన్నాయని నమ్ముతూ ముందడుగు వేస్తుంది. గ్రామాల్లో నీటి సమస్య వచ్చినా, పట్టణాల్లో విద్యుత్ నిలిచిపోయినా, ఆసుపత్రిలో మందులు అందక బాధపడుతున్నా, స్కాలర్‌షిప్ అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా ఇలా ఎన్ని సమస్యలు ఉన్నా ఇవన్నీ ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఈమెయిల్ ఐడీలు, టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశారు. కానీ వాటి వలన ఎటువంటి స్పందన ఉండటం లేదు. ఫిర్యాదు చేసిన తర్వాత రోజులు, వారాలు గడిచినా పరిష్కారం లేకపోవడం అనుభవంగా మారుతోంది. సమస్య ఎక్కడికి వెళ్లిందోకూడా తెలియని పరిస్థితులు చాలాచోట్ల కనిపిస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న సేవలు పేరు కోసం మాత్రమేనా? సమస్యను వినేందుకు ఉన్న నెంబర్లు కేవలం రూపకల్పనగా మిగిలిపోయాయా? అనే ప్రశ్నలు ప్రతి ఒక్కరి మనసులో కలుగుతున్నాయి. ప్రజల బాధను పట్టించుకోకుండా ప్రభుత్వ కార్యాలయాలు వ్యవహరించడంతో నమ్మకం క్రమంగా తగ్గుతోంది. ప్రతి వ్యక్తి చెల్లించే పన్నుల ద్వారా ప్రభుత్వ సేవలపై ఆధారపడుతూ జీవిస్తాడు. అలాంటి సమయంలో స్పందన లేకపోతే నిరాశ ప్రభుత్వంపై నమ్మకం తగ్గుతోంది. అలాంటప్పుడు సమస్యను పరిష్కరించుకునేందుకు మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వ్యవస్థపై అసహనం పెరిగి, సామాజిక సంక్షోభంగా మారుతుంది.




ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతో మాత్రమే పరిమితం కాదు. రోజువారీ సేవల ద్వారా, సమస్యలపై స్పందించే విధానాల ద్వారా ప్రజల భాగస్వామ్యం పెరుగుతుంది. అధికారుల పని కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు ప్రజల మాట విని, తక్షణంగా స్పందించి, అవసరమైన చర్యలు తీసుకోవడం ముఖ్యమైన బాధ్యత. ఒక ఫోన్‌కాల్‌కు కూడా సమాధానం అందని పరిస్థితిలో ఉన్న కార్యాలయాలు ప్రజల సమస్యలను పరిష్కరించగలవా? అనే ప్రశ్న ఎన్నోచోట్ల మారుమ్రోగుతోంది. స్పందించకపోవడం వల్ల ప్రజలు అసహనంతో నిండిపోతున్నారు. మధ్యవర్తుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సేవలపై విశ్వాసం తగ్గిపోతోంది. ఇది వ్యక్తిగత సమస్యగానే కాదు, సమాజ స్థాయిలో ప్రభావాన్ని చూపే పెద్ద సంక్షోభంగా మారుతోంది. న్యాయంగా సేవలు అందకపోతే సామాజిక అసమానతలు, అసంతృప్తి, నిరుత్సాహం పెరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వానికి ప్రజల నుండి వినిపిస్తున్న సమస్యను వినాలి. సమస్యను తెలిపిన తర్వాత కనీసం స్పందన ఇవ్వడం కూడా కష్టంగా మారితే, ప్రభుత్వం నిజంగా ప్రజల కోసం పనిచేస్తుందా? పేరు కోసం మాత్రమే ఈ సేవలను అందిస్తున్నదా? అనే ప్రశ్నలు సామాన్యుల మనసుల్లో కలుగుతున్నాయి. ఫిర్యాదులను సమయానికి స్వీకరించేలా, పారదర్శకంగా వాటి స్థితిని తెలియజేసేలా వ్యవస్థను బలపరచాలి. అందుబాటులో ఉన్న నెంబర్లు పనిచేస్తున్నాయా? సమాధానాలు అందుతున్నాయా? సమస్యలను వినేందుకు అధికారులు శ్రద్ధ చూపుతున్నారా? అన్నది కేవలం కార్యాలయాల పనిగా కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలి. ప్రజల సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వానికి గౌరవం పెరుగుతుంది. ప్రజలు కూడా నమ్మకంతో ముందడుగు వేయగలరు. ఇప్పటికైనా ప్రభుత్వం జాగ్రత్తగా ఆలోచించి, ప్రతి ఫిర్యాదును గౌరవంగా స్వీకరించేలా వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రజల మాట వినాలి టోల్ ఫ్రీ నెంబర్లకు మెయిల్స్‌కి వెంటనే స్పందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రభుత్వం నిజమైన సేవకుడిగా నిలబడగలదు. •

# రాహుల్ గాంధీ 'సామాజిక న్యాయం'పై సందేహాలు!

మన్నారం నాగరాజు

రాహుల్ గాంధీ ఇటీవల కాలంలో 'సామాజిక న్యాయం' అనే నినాదాన్ని బలంగా వినిపిస్తున్నారు. దేశవ్యాప్తంగా పాదయాత్రలు చేస్తూ ప్రజలతో మమేకమవుతూ, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల సమస్యలను వెలికితీస్తానని చెబుతున్నారు. కానీ ప్రజలు, ముఖ్యంగా బీసీ సమాజం అడుగుతున్న ప్రశ్న మాత్రం మరింత బలంగా మారుతోంది. మీ సామాజిక న్యాయం నినాదం నిజంగా చిత్తశుద్ధితోనా? లేక ఎన్నికల ప్రయోజనాల కోసమా? రాహుల్ గాంధీ రోడ్లమీద ప్రజలతో మాట్లాడుతూ బీసీల పేర్లు ప్రస్తావించడం, వారికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం ఒక విషయం. కానీ అదే మాటలను పార్లమెంట్‌లో బలంగా వినిపించడం, రాజ్యాంగ బలంతో అమలు చేయించడం మరో విషయం. ఈ రెండవ దశలో రాహుల్ గాంధీ కనిపించకపోవడం బీసీలలో అనుమానాలను పెంచుతోంది. భారతదేశంలో బీసీల సంఖ్య జనాభాలో సగానికి పైగా ఉంటుంది. సర్వేల ప్రకారం కనీసం52శాతం నుంచి 55శాతం వరకు జనాభా బీసీలదే. ఓట్ల పరంగా చూసినా, రాజకీయ ప్రభావం పరంగా చూసినా వారు కీలక పాత్రధారులు. కానీ ఆశ్చర్యకరంగా, ఇప్పటివరకు వారికి తగిన రాజకీయ గౌరవం దక్కలేదు. బీసీల కోసం బలమైన చట్టాలు, నిర్ణయాలు పార్లమెంట్‌లో ఆమోదించబడ్డ ఉదాహరణలు చాలా అరుదు. కాంగ్రెస్‌పార్టీ దాదాపు ఆరు దశాబ్దాలకు పైగా ఈ దేశాన్ని పాలించింది. కానీ ఆ కాలంలో బీసీల కోసం ఒక ప్రత్యేకమైన, సుస్థిరమైన బిల్లును తీసుకురావడంలో విఫలమైంది. రిజర్వేషన్లను కాపాడేలా తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే ప్రయత్నం చేయడంలో వెనకబడిపోయింది. ఇది బీసీలలో పెద్ద ఆవేదనగా మారింది. ఇప్పటిరోజుల్లో రాహుల్ గాంధీ రోడ్ల మీద 'రాజ్యాంగాన్ని కాపాడాలి, సామాజిక న్యాయం జరగాలి' అని తరచుగా చెబుతున్నారు. కానీ అదే విషయాన్ని పార్లమెంట్‌లో బలంగా ఎందుకు చెప్పలేకపోతున్నారు? ఉదాహరణకు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన కామారెడ్డిలో బహిరంగ సభలో మాట్లాడుతూ 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తాం' అని ప్రకటించారు. నిజంగా అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీలో బిల్లును కూడా ఆమోదించారు. కానీ ఆ బిల్లును రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్పించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంలో మాత్రం ఒక్క అడుగు కూడా వేయలేదు. రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు ఆమోదం ఒక దశ మాత్రమే. దానిని రాజ్యాంగ పరిరక్షణలోకి తేవడం అత్యవసరం. కానీ ఆ పని జరగకపోవడంతో బీసీలు కాంగ్రెస్ చిత్తశుద్ధిని సందేహిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో బీసీల కోసం ఒకరోజు దీక్ష చేశారు. అది కేవలం తెలంగాణ బీసీలకే కాకుండా దేశవ్యాప్తంగా బీసీల సమస్యలను ప్రతిబింబించింది. అలాంటి సమయంలో జాతీయ నాయకుడిగా రాహుల్ గాంధీ ఆయన పక్కనే ఉండాల్సింది. కానీ ఆయన గైర్హాజరు కావడం 'బీసీల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఎక్కడుంది?' అనే ప్రశ్నను మరింత బలంగా నిలబెట్టింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి బీసీల కోసం నిరసన చేస్తున్నప్పుడు జాతీయ నాయకుడు దూరంగా ఉండటమే బీసీలలో అసంతృప్తిని పెంచింది.



రాహుల్ గాంధీ

భారతదేశంలో ఉన్న అత్యున్నత పదవులు ఇప్పటి వరకు ఎక్కువగా ఎలైట్ వర్గాలకేపరిమితం అయ్యాయి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని వంటి పదవుల్లో ఒక బీసీకి కూడా స్థానం దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ ఇన్ని దశాబ్దాల పాటు అధికారంలో ఉన్నప్పటికీ ఒక బీసీని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా కూడా నిలబెట్టలేదు. ఇది బీసీ సమాజంలో గాయాన్ని మరింతగా ముద్ర వేసింది. మీరు మాటల్లో సామాజిక న్యాయం అంటారు, కానీ పదవుల్లో ఆ న్యాయం ఎందుకు కనబడదు అని వారు ప్రశ్నిస్తున్నారు. రాహుల్ గాంధీ బీసీలకు ఇచ్చే హామీలు, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలవుతున్నాయా అన్నది ప్రజలు పరిశీలిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు ఇరువై నెలలు పూర్తయ్యాయి. ఈ కాలంలో బీసీల కోసం ఏం జరిగిందని అడిగితే స్పష్టమైన సమాధానం లేదు. బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించామని చెప్పారు కానీ అవి పూర్తిగా ఖర్చయ్యాయా అన్న సందేహం ఉంది. కార్పొరేషన్లలో పదవులు అన్నీభర్తీ అయ్యాయా? సేవాకులాలు, ఉత్పత్తి కులాలకు సరైన సహాయం అందిందా? ఇవన్నీ ఇంకా సమాధానం లేని ప్రశ్నలుగానే ఉన్నాయి. ఇంత కాలం పాలన సాగినా బీసీల జీవన ప్రమాణాల్లో గణనీయమైన మార్పు కనబడకపోవడంతో కాంగ్రెస్ నిజంగా బీసీలను గుర్తిస్తున్నదా అనే అనుమానం కలుగుతోంది. బీసీలు ఒక పెద్ద ఆశతో కాంగ్రెస్ వైపు చూశారు. రాహుల్ గాంధీ చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలు నెరవేరతాయని వారు నమ్మారు. కానీ ఇప్పుడు ఆ నమ్మకం కుంగిపోతోంది. కార్పొరేషన్ల నిధులు అరకొరకగా ఖర్చు చేయడం, పదవులు అరకొరకగాఇవ్వడం, ఉపాధి రుణాలు, పరిశ్రమల విధానాల్లో బీసీలకు ప్రాధాన్యం లేకపోవడం ఇవన్నీ బీసీలను నిరాశలో ముంచుతున్నాయి. ఒకవేళ నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికీ కొంత ఫలితం కనబడేది. ఇంకో ప్రధాన అంశం ఏమిటంటే, రాహుల్ గాంధీకి జాతీయ నాయకుడిగా ఒక బాధ్యత ఉంది. ఆయన కేవలం రోడ్ల మీద పాదయాత్రలు చేయడం, సభల్లో ప్రసంగాలు ఇవ్వడం మాత్రమే కాదు. కాంగ్రెస్ పార్టీ పాలిస్తున్న రాష్ట్రాల్లో బీసీలకు ఇచ్చిన హామీలు అమలవుతున్నాయా లేదా అన్నది ఆయన గమనించాలి. తెలంగాణలో రిజర్వేషన్ బిల్లు కేంద్రంలో అగ్నిపరీక్ష ఎదుర్కొంటున్నప్పుడు ఆ బిల్లును అమలు చేయించే వరకు ఆయన కృషి చేయాలి. రాష్ట్రాల్లో బీసీ బడ్జెట్ నిజంగా ఖర్చువుతోందా లేదా అని ఆయన ప్రశ్నించాలి. కానీ ఆయన ఆ పాత్రలో కనబడకపోవడం మరోసారి బీసీలలో అనుమానం పెంచుతోంది. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ తరచుగా "రాజ్యాంగాన్ని కాపాడాలి" అని చెబుతున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 నుండి 21 వరకు సమానత్వ హక్కులు, స్వేచ్ఛ హక్కులు, జీవన హక్కులు ఉన్నప్పటికీ బీసీలకు అవి పూర్తిగా దక్కుతున్నాయా అన్నది పరిశీలించాలి. సమానత్వం అన్న పదం పుస్తకాలలో ఉండటం సరిపోదు. అది రాజకీయాల్లో, అధికార పదవుల్లో, నిర్ణయాలలో ప్రతిబింబించాలి. కానీ ఇప్పటి వరకు బీసీలు ఆ అనుభవం పొందలేకపోయారు. ప్రజాస్వామ్యం కాపాడాలంటే రాహుల్ గాంధీ నిజంగా పార్లమెంట్‌లో బీసీల కోసం నిలదీయాలి. ఒకరోజు అయినా బీసీలకు మద్దతుగా స్పష్టమైన బిల్లు ప్రవేశపెట్టాలి. లేకుంటే ఆయన నినాదాలు ఎన్నికల మసాలాగా మారిపోతాయి. తెలంగాణ బీసీలు కూడా ఇప్పుడు అదే ప్రశ్నిస్తున్నారు. మీరు కామారెడ్డిలో రిజర్వేషన్లు ఇస్తామని చెప్పారు, అసెంబ్లీలో బిల్లు పెట్టారు, కానీ ఢిల్లీలో ఒత్తిడి ఎందుకు చేయలేకపోతున్నారు? రేవంత్ రెడ్డి దీక్షలో ఎందుకు పాల్గొనలేదు? కాంగ్రెస్ పార్టీ ఇరువై నెలల పాలనలో బీసీల కోసం ఒక పెద్ద అడుగు ఎందుకువేయలేదు? మొత్తానికి రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ బీసీలపట్ల చూపుతున్న వైఖరి ఎన్నికల నినాదాల వరకే పరిమితమైందన్న భావన బలపడుతోంది. బీసీ సమాజం ఇన్ని ప్రశ్నలు అడుగుతోంది. నిజంగా బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికీ ఆలస్యం చేయకుండా పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలి. రాష్ట్రాల్లో హామీల అమలును నిర్ధారించాలి. లేకపోతే కాంగ్రెస్ మాటలను కేవలం ఓట్ల కోసం వేసిన జాలరుగా భావించి దూరమవుతారు. •

# గుంటూరు వార్త





## జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వకుల్ జిందాల్

గుంటూరు క్రైమ్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త : గుంటూరు జిల్లా ఎస్పీగా వకుల్ జిందాల్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో రౌడీయిజం పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో శాంతిభద్రతలకు తొలి ప్రాధాన్యం కల్పించి మహిళల మీద నేరాలకు పాల్పడే వారిపై డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. రాజధాని ప్రాంతంలో ప్రభుత్వ, అధికార కార్యక్రమాలు సజావుగా సాగేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని ప్రజలకు నిరంతరం అన్ని వేళల్లో ఏ పరిస్థితుల్లోనైనా అందుబాటులో ఉంటామన్నారు. గుంటూరు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉంది, నేను 2016ఐపిఎస్ అధికారిని, ప్రాముఖ్యమైన రాజధాని ప్రాంతం కలగిన గుంటూరు జిల్లాకు నా మీద నమ్మకం ఉంచి నన్ను ఎస్పీగా నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ధన్యవాదాలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో రౌడీయిజాన్ని రూపుమాపటం, మహిళలపై జరిగే నేరాలను కట్టడి చేసి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. మేము చేపట్టే పనులను మరియు ప్రజా ప్రాయోజిత కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు మీడియా సహకారం కోరుకుంటున్నాము. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులు, మీడియా ప్రతినిధులు పలువురు ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు.



## పి4 అంటే సామాజిక బాధ్యత

గుంటూరు క్రైమ్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త : సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 కార్యక్రమం కేవలం డబ్బులు ఇవ్వడం కాదని, అదొక సామాజిక బాధ్యత అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పి-4అమల్లో సవాళ్ళు పరిష్కారాలు అనే అంశంపై స్థానిక గుంటూరు క్లబ్‌లో



ఆదివారం చేపట్టిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, స్వర్ణాంధ్ర సాధన కమిటి చైర్మన్ కుటుంబరావు లతో కలసి ఎమ్మెల్యేల నసీర్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పి-4కార్యక్రమం ఒక దార్శనికుని ఆలోచనలకు ప్రతిరూపమన్నారు. అన్నీ రంగాల్లోని ప్రజలకు తమకు చేతనైనంతలో ఏదొక రూపంలో సాయమందించాలని పిలుపునిచ్చారు. న్యాయవాదులు న్యాయపరంగా, వైద్యులు వైద్యపరంగా, టీచర్ల విద్యాపరంగా పేదలకు తోడుగా నిలవడమే పి-4 ముఖ్యఉద్దేశ్యమని స్పష్టంచేశారు. సీఎం చంద్రబాబు నాయుడు విజనరీతో చేపట్టిన కార్యక్రమాలు భావితరాలకు అద్భుతమైన అవకాశాలను అందించామని చెప్పారు. 1995లోనే 2020 విజన్‌కు శ్రీకారం చుట్టారని, హైటెక్ సిటీ ఏర్పాటుకు ముందుకొచ్చారని, దీంతో యువతకు లక్షల్లో ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఇప్పుడు స్వర్ణాంధ్రప్రదేశ్-2047కు నాంది పలికారని ఇది దేశంలోనే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రధమస్థానంలో నిలిపేందుకు దోహదం చేస్తుందన్నారు. ఈ మహాత్తర కార్యక్రమంలో అందరూ బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## శాంతి భద్రతల పరిరక్షణే కర్తవ్యంగా విధులు నిర్వర్తించాలి : ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు క్రైమ్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త : జిల్లా పోలీసు కార్యాలయంలో గుంటూరు జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ పాల్గొని పలు సూచనలు చేశారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే స్పందించి ఎటువంటి అవాంచనీయ సంఘటన జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో సూన్య సహన విధానాన్ని అవలంబించి అసాంఘీక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. రౌడీషీటర్లు, సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే వారిపై తరచూ ప్రత్యేక డ్రైవ్





నిర్వహించాలన్నారు. ప్రతి పోలీస్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలి, జనరల్ డైరీ, రఫ్ డ్యూటీ రోస్టర్, ప్రాపర్టీ రిజిస్టర్, కేసు డైరీ మరియు ఇతర రికార్డులను సక్రమంగా నిర్వహించాలి. ఏదైనా కేసుకు సంబంధించి ఆధారాలను జాగ్రత్తగా భద్రపరచాలి, అదే విధంగా కేసుల దర్యాప్తు సక్రమంగా సమగ్రంగా ఉండేలా చుసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే మా దృష్టికీ తీసుకువచ్చి తగిన పరిష్కారాన్ని పొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు బివి రమణమూర్తి, ఏటివి రవికుమార్, ఏ. హనుమంతు, ఎస్బీ సిఐ అలహరీ శ్రీనివాస్, డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## వర్షపు నీరు బెయిల్ అవుటుకు యుద్ధ ప్రాతిపదిక చర్యలు

### నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు నగరపాలక సంస్థ ప్రభాతవార్త: గుంటూరు నగరంలో వర్షం వల్ల నిలబడిన నీటిని బెయిల్ అవుట్ చేయడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జెసిబి లు మరియు ప్రోక్లైన్లను అవసరమైతే అద్దె ప్రాతిపదికనైనా తీసుకొని నగరంలో నీరు నిలబడిన ప్రాంతాలని బెయిల్ అవుట్ చేయటానికి ప్రణాళిక బద్ధంగా వేగవంతమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు వార్డుల వారీగా నీటిని బెయిల్ అవుట్ చేయటం ముంపు ప్రాంతాల ప్రజలను రక్షణ ప్రాంతాలకు తరలించడంలో సచివాలయ కార్యదర్శులు మరియు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఇప్పటికే వాతావరణ శాఖ సూచనలతో వర్షం మరో రెండు రోజులు కురిసే అవకాశం ఉన్నందున సచివాలయ కార్యదర్శి లు మరియు ఉద్యోగులు, అధికారులందరూ సెలవులు తీసుకోవడానికి వీలులేదని అందుబాటులోనే ఉండాలని ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు . వర్షాభావ ప్రభావాల రీత్యా ఏమైనా సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చేయటానికి 24 గంటలు పని చేసేలా జీఎంసి ప్రధాన కార్యాలయంలో 08632345103 కాల్ సెంటర్ను ఏర్పాటు చేశామన్నారు. కాల్ సెంటర్ ని డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. ప్రజలు కూడా వర్షాలు తగ్గేవరకు లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారు తక్షణం నగరపాలక సంస్థ స్కూల్స్ లేదా రక్షణ ప్రాంతాల్లో ఉండాలని కమిషనర్ సూచించారు.



## తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

### --ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న ఏకైక మహిళా ఎమ్మెల్యే

గుంటూరు క్రైమ్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త : తిరుపతిలో రెండురోజుల పాటు జరగనున్న తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సులో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న ఏకైక మహిళా ఎమ్మెల్యే గళ్ళా మాధవి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సదస్సుకి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి మహిళా



ప్రజాప్రతినిధులు, పార్లమెంటరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారని మహిళా హక్కులు, చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం, గ్రామీణ స్థాయిలో మహిళా సాధికారతను ప్రోత్సహించడం వంటి అనేక అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సమావేశం ద్వారా మహిళా ప్రజాప్రతినిధులు తమ అనుభవాలను, ఆలోచనలను పంచుకోవడానికి ఒక వేదిక లభించిందని, ఇది భవిష్యత్తులో మహిళా సాధికారతకు బలమైన పునాది వేస్తుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న ఏకైక మహిళా ఎమ్మెల్యే గా సదస్సులో పాల్గొటనడం గర్వంగా ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మహిళా సాధికారత, శాసన వ్యవస్థలో మహిళల పాత్ర వంటి కీలక అంశాలపై చర్చించేందుకు ఈ సమావేశం దోహదం చేస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## పిజిఆర్ఎస్ అర్జీల వివరాలు మీ కోసం వెబ్ సైట్‌లో నమోదు చేయవచ్చు

గుంటూరు క్రైమ్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల వివరాలు మీకోసం వెబ్ సైట్‌లో నమోదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. సమర్పించిన అర్జీల స్థాయిని 1100టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ చెప్పారు. అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యలను సోమవారం స్వీకరించడం జరుగుతుందని ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతిరోజూ ప్రజలనుండి వినతులు స్వీకరించడానికి ప్రత్యేకంగా సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. అర్జీదారులు మీకోసం డాట్ ఏపి డాట్‌జీవో వి డాట్ ఇన్ వైబ్‌సైట్ లోనూ అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితి, దానికి సంబంధించి సమాచారం తెలుసుకొనుటకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.



## గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు క్రైమ్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త : స్థానిక కొత్తపేట పోలీస్టేషన్ పరిధిలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన. పోలీసులు తెలిపిన వివరణ మేరకు ఊరు పేరు తెలియని సుమారు 65నుంచి 70సంవత్సరాల వయస్సు కల్గిన మగ వ్యక్తి నెహ్రూనగర్ 1వ లైన్‌లో చనిపోయి ఉండగా అక్కడివారు కొత్తపేట పోలీసులకు సమాచారం అందించడంతో కొత్తపేట పోలీసులు సంఘటనా స్థలంలోని మృతదేహాన్ని పరిశీలించి శవాన్ని జిజిహెచ్‌లోని శవాగారంలో భద్రపరిచారు. సదరు మృతుని గుర్తించిన వారు కొత్తపేట పోలీస్టేషన్ నెంబర్‌కు 86888 31320 తెలియజేయాలని కోరుతున్నారు.

## అవగాహన లో...ప్రకృతి వైద్యం సదస్సు

గుంటూరు కల్చరల్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త : ప్రకృతి వైద్యం అనేది శరీరాన్ని సహజపరంగా సమతుల్యంగా ఉంచేలా పనిచేస్తుందని, వ్యాధి నిరోధకశక్తిని పెంపొందిస్తుందని జీవనశైలి మార్పులను సూచిస్తుందని అవగాహన సంస్థ ఆరోగ్యసభలో ప్రముఖ ప్రకృతి వైద్యురాలు డాక్టర్ ఎం. ఉమాసుందరి అన్నారు. ఆరోగ్యసభకు ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ అధ్యక్షత వహించారు. ప్రకృతి వైద్య విధానం అనేది ప్రకృతి శక్తులను ఆధారంగా తీసుకొని ఆరోగ్య సంరక్షణ, వ్యాధి నివారణ, శరీరశక్తి పెంపు మరియు స్వస్థత సాధించడానికి ఉపయోగపడే వైద్య విధానమన్నారు. మరో ప్రకృతి వైద్యులు డాక్టర్ చంద్రమౌళిక, ప్రకృతి వైద్య ప్రచారకులు డాక్టర్ ఎం. ప్రసన్న కుమార్ లు మాట్లాడుతూ శరీర లక్షణాల మీద మాత్రమే దృష్టి పెట్టకుండా మొత్తం వ్యక్తిత్వాన్ని ఆరోగ్యవంతంగా ఉంచడమే ప్రకృతి వైద్యం లక్ష్యమన్నారు. ఆరోగ్యసభానంతరం డాక్టర్ ఎం. ఉమాసుందరిని సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కార్యక్రమాన్ని కో ఆర్డినేట్ చేశారు.



## సిల్ట్ తీత పనుల్లో నిర్లక్ష్యంతోనే ముంపు

గుంటూరు క్రైమ్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త : భారీ వర్షాలకు నగరం నీట మునిగిపోవడానికి ప్రధానం సిల్ట్‌తీత పనుల్లో నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం సాయంత్రం నగరంలో కురిసిన భారీ వర్షానికి నీట మునిగిన పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. వర్షపు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి



వెంటనే మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. గతంలో సీల్ట్‌తీత పనులు సక్రమంగా చేపట్టలేదని, దీంతో ముంపు సమస్య ఏర్పడుతున్నట్లు గుర్తించామన్నారు. గతంలో పనిచేసిన వారితోనే మళ్ళీ సిల్ట్ తీత పనులు మరోసారి చేయించాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, వంతెనలపై ఆక్రమణలు తొలగించాలని సూచించారు. మూడు వంతెనల వద్ద నీటిని వెంటనే బయటకు పంపించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షపు నీటిని ప్రవాహానికి ఎక్కడ అడ్డంగా ఉంటుందో గుర్తించాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. వర్షపు నీరు బయటకు వెళ్ళేందుకు శాశ్వత పరిష్కారం దిశగా పనులుచేస్తామని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తాము 24గంటలూ అందుబాటులో ఉంటామని తెలిపారు.

## ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్ గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్ అందుకున్న నారా దేవాన్ష్

### లండన్ లోని వెస్ట్ మినిస్టర్ హాల్ లో అవార్డ్ అందుకున్న దేవాన్ష్ అవార్డ్ ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 14:అమరావతిః విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తనయుడు, పదేళ్ల యువ చెస్ ప్రాడిజీ నారా దేవాన్ష్ చదరంగంలో అత్యంత క్లిష్టమైన 175 పజిల్స్ ను వేగంగా పరిష్కరించడం ద్వారా ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్ గా ప్రపంచ రికార్డ్ సాధించినందుకు గాను వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్స్ 2025 అందుకున్నాడు. లండన్ లోని వెస్ట్ మినిస్టర్ హాల్ లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని "ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్175 పజిల్స్" అవార్డ్ అందుకున్నాడు. ఈ కార్యక్రమానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఈ ఘనతను సాధించేందుకు నారా దేవాన్ష్ గతేడాది చెక్ మేట్ మారథాన్ లో లాస్లో పోల్గార్ ప్రసిద్ధ చెస్ సంకలనం "5334 ప్రాబ్లమ్స్ అండ్ గేమ్స్" పుస్తకం నుంచి తీసుకున్న 175 సంక్లిష్టమైన చెక్ మేట్ పజిల్స్ ను వేగవంతంగా పరిష్కరించాడు. ఈ పజిల్స్ ఒకటి తర్వాత ఒకటి కష్టంగా మారుతూ



వేగం, కచ్చితత్వం, ఆలోచనా నైపుణ్యాలను పరీక్షిస్తుంది. దేవాన్ష్ వీటన్నిటినీ అత్యంత తక్కువ సమయంలో పరిష్కరించడం ద్వారా రికార్డు సృష్టించారు. ప్రపంచ చెస్ రంగంలో అత్యుత్తమ యువ ప్రతిభావంతుల్లో ఒకరుగా దేవాన్ష్ కు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం లభించింది. ఈ విజయానికి దేవాన్ష్ అకుంఠిత శ్రమతో పాటు, తల్లి నారా బ్రాహ్మణి, తండ్రి నారా లోకేష్, కోచ్ కే. రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహం అందించారు. ఈ విజయం గురించి మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ "ఈ రోజు వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో దేవాన్ష్ ఈ గౌరవాన్ని అందుకోవడం ప్రత్యేకమైంది. అతని ముందుచూపు, ఆలోచనాశక్తి, ఒత్తిడిలో ప్రదర్శించిన సమయస్ఫూర్తి, చిన్న వయస్సులోనే పూర్తిగా ఆటకు అంకితం కావడం వంటి విభిన్న శైలి వల్ల ఈ విజయం సాధ్యమైంది. తండ్రిగా దేవాన్ష్ అవిశ్రాంత శ్రమని నేను దగ్గరగా చూశాను. ఈ గుర్తింపు అతని కృషికి నిజమైన బహుమతి. మేమంతా అతను సాధించిన ఈ ఘనతకు ఎంతో గర్వపడుతున్నాం" అని అన్నారు. దీంతోపాటు దేవాన్ష్ మరో రెండు ప్రపంచ రికార్డులను కూడా గతంలో సొంతం చేసుకున్నాడు. 7డిస్క్ టవర్ ఆఫ్ హనోయ్‌ను కేవలం 1 నిమిషం 43 సెకన్లలో పూర్తి చేయడం, 9 చెస్ బోర్డ్స్ పై 32 పావులను సరైన పద్ధతి ద్వారా 5 నిమిషాల్లో అమర్చడంలో ప్రపంచ రికార్డులు సాధించాడు. ఈ రోజు లండన్‌లో జరిగిన అవార్డ్స్ కార్యక్రమంలో ఆయనకు లభించిన గుర్తింపు ఆయన కుటుంబానికి, అలాగే ప్రపంచ చెస్ రంగంలో భారత్ తరపున పెరుగుతున్న ఖ్యాతికి గర్వకారణంగా నిలిచిందని పేర్కొన్నారు.

## గణపతి స్వామి వారికి 99 కిలోల లడ్డు సమర్పణ

గుంటూరు విద్య, ప్రభాతవార్త: గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు శ్రీ చైతన్య కళాశాల గ్రౌండ్లో ఏర్పాటుచేసిన 99 అడుగుల మట్టి మహాగణపతి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నేడు స్వామివారికి 99 కిలోల లడ్డుని యడ్ల నాగమల్లేశ్వరరావు



స్వామివారికి బహుకరణ చేశారు. ఈ సందర్భంగా 99 కిలోమీటర్ల లడ్డును గోరంట్ల సెంటర్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్ లోని 99 అడుగుల మట్టి మహాగణపతి విగ్రహం వరకు భారీ ర్యాలీగా స్వామి వారి లడ్డును ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ ర్యాలీలో సుమారు 500 మంది నడకతో పాల్గొని ఈ ర్యాలీని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అమరావతి మట్టి మహాగణపతి ఉత్సవ కమిటీ సభ్యులు స్వామివారి లడ్డును 99 అడుగుల మట్టి మహాగణపతి వద్ద పూజరులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికీ నైవేద్యముగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో లడ్డు దాత యడ్ల నాగమల్లేశ్వరరావు వారి కుటుంబ సభ్యులు అత్యధికంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. అనంతరం ఆర్ట్ ఆఫ్ నటరాజ్ గురువు విజయగౌరి ఆధ్వర్యంలో భక్త ప్రహ్లాద బ్యాలెట్ అనే సాంస్కృతిక కార్యక్రమంని నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో అమరావతి మట్టి మహాగణతోత్సవ కమిటీ చైర్మన్ నరేంద్ర, వైస్ చైర్మన్ రాజా నాయుడు, సెక్రటరీ లక్ష్మీనారాయణ రెడ్డి, రాజేష్, హేమంత్, జాకీర్, గణేష్, రామాంజనేయరెడ్డి కమిటీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## గాడిచర్ల హరి సర్వోత్తమ రావు చిరస్మరణీయులు

పెదనందిపాడు సెప్టెంబర్ 14 (ప్రభాతవార్త). ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, రచయిత, సంపాదకుడు, గ్రంధాలయోద్యమ నాయకుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతి సందర్భంగా ఆదివారం పెదనందిపాడుశాఖా గ్రంధాలయం లో వారి చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంధాలయ నిర్వహకులు డి శివ నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్టియు రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు మాట్లాడుతూ ఆంధ్రుల లో మొట్టమొదటి రాజకీయ ఖైదీగా పేరుగాంచిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు స్వాతంత్ర్య సమర యోధుడిగా, పత్రికా రచయితగా, సాహితీ కారుడిగా, సంపాదకునిగా, గ్రంథాలయ ఉద్యమ నాయకులుగా తెలుగు జాతికి బహుముఖ సేవలు అందించిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రజలందరి హృదయాల లో వారు చిరస్మరణీయులుగా నిలిచి ఉన్నారన్నారు. నేటి తరం యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహకులు డి శివనాగేశ్వరరావు, వార్డ్ సభ్యులు వెలినేని శివయ్య, మంజుల, కొలగాని అంకారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సాయి మందిర్ అన్నద్నాన నిర్వహణ కు పూర్తి సహకారం అందజేస్తాం

పెదనందిపాడు సెప్టెంబర్ 14 (ప్రభాతవార్త). పెదనందిపాడు సాయి మందిర్ లో పండుగ రోజులలో ప్రత్యేక కార్యక్రమాలతో పాటు ప్రతి గురువారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తమ పూర్తి సహకారం అందజేయడమే కాకుండా .వందమంది ఎన్నారై లతో సంఘం ఏర్పాటు చేసి వారు కూడా ఈ అన్నదాన నిర్వహణకు ప్రతి ఏటా ఫండ్ అందజేయటమే కాకుండా వారు కూడా స్వయంగా పాల్గొనేటట్లు చేస్తామని సాయి మందిర్ నిర్వహణ కమిటీ సభ్యులు దాతలు పేర్కొన్నారు. ఆదివారం పెదనందిపాడు సాయి మందిర్ నిర్వహణ కమిటీ వారు అన్నపూర్ణాలయంలో అరవపల్లి కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రముఖులు సభ్యులు దాతలు అధిక సంఖ్యలో పాల్గొని సాయి మందిర్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లేందుకు తమ పూర్తి సహకారం అందజేస్తామని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్త దాత దాసరి శేషగిరిరావు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలు పైగా సాయి మందిర్ అభివృద్ధికి కమిటీ సభ్యులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. కమిటీ లోకి కొత్త సభ్యులను కూడా తీసుకోవాలని సూచించారు. అన్నదాన కార్యక్రమం క్రమం తప్పకుండా నిర్వహించేందుకు సుమారు రెండు కోట్ల రూపాయలు పైగా బ్యాంకులో డిపాజిట్ చేయాలనేది లక్ష్యంగా సమావేశం తీర్మానం చేసింది. ఈ కార్యక్రమం విజయవంతమైన ఎందుకు సహకరిస్తామని సభ్యులు దాతలు హామీ ఇచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమానికి విశిష్ట సేవలు అందిస్తున్న పెద్ది శ్రీనివాసరావు. సకల వీరేంద్ర గుప్తా. కొత్త శేషగిరిరావు. నూకల ప్రసాద్ లను సాయి మందిర్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం సాయి మందిర్ నిర్వహణ కమిటీ నూతన అధ్యక్షులుగా దాసరి లక్ష్మీశివరాం ప్రసాద్. సెక్రటరీగా అరవపల్లి రామసుబ్బారావు. కోశాధికారిగా తడవర్తి సురేష్ బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్వరలో తమ కమిటీలోకి సేవాభావం తోటివచ్చే నూతన సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందని నూతన అధ్యక్ష కార్యదర్శులు ప్రకటించారు. ఈ కార్యక్రమం లో ఆడిటర్ బాలాజీ.ముద్దన రాఘవయ్య. వెలినేని కృష్ణారావు. బి రామకృష్ణ. వి పాపాచారి. ఎస్ రామసుబ్బారావు. అర్జున్ రావు. నాగేశ్వర స్వామి. రమాదేవి. నాగలక్ష్మి. కళావతి. విజయలక్ష్మి మ్మ. ధనలక్ష్మి మ్మ. పద్మ. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన కమిటీ సభ్యులు దాతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు





# తల్లిదండ్రులందరు చూడాల్సిన సినిమా ‘బ్యూటీ’

అంకిత్ కొయ్య, నీలఖి హీరో హీరోయిన్లుగా విజయ్ పాల్ రెడ్డి అడిదల, ఉమేష్ కుమార్ భన్సల్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం బ్యూటీ. జీ స్టూడియోస్, మారుతీ టీం ప్రొడక్ట్స్, వానర సెల్యూలాయిడ్ సంయుక్తంగా బ్యూటీమూవీని నిర్మించారు. ఈ సినిమాకు గీతా సుబ్రమణ్యం, హలో వరల్డ్, భలే ఉన్నాడే ఫేమ్ జె.ఎస్.ఎస్. వర్ధన్ మాటలు, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వహించారు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లేని ఆర్.వి. సుబ్రహ్మణ్యం అందించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న విడుదల కాబోతోంది. ఈ క్రమంలో రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్, పాటలు అన్నీ కూడా అందరినీ ఆకట్టుకున్నాయి. విడుదల తేదీ దగ్గర పడుతున్న క్రమంలో ఆదివారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టార్ డైరెక్టర్ మారుతి, ఎస్ కే ఎన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలోస్టార్ డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ,మా ప్రతీ సినిమా ఆడిందంటే దానికి కారణం ఎస్ కే ఎన్. ఈరోజులలో మూవీకి ఎస్ కే ఎన్, శ్రేయాస్ శ్రీనివాస్ సపోర్ట్ చేశారు. ఆ రోజు వాళ్లిద్దరూ లేకుంటే నేను ఈ రోజు ఇక్కడ ఇలా ఉండేవాడ్ని కాదు. సుబ్బు మాకు ఎప్పుడూ క్రైమ్ కథలు చెబుతుండేవారు. కానీ ఓ పాయింట్‌ను సుబ్బు చెప్పాడు. ఆ కథ నాకు నచ్చింది. అంకిత్ మంచి యాక్టర్ అని మరోసారి రుజువు అవుతుంది. ప్రతీ తల్లిదండ్రులు చూడాల్సిన సినిమా. సెప్టెంబర్ నెల బాగా కలిసి వస్తోంది. ప్రస్తుతం ‘లిటిల్ హార్ట్స్’ బాగా ఆడుతోంది.,‘మిరాయ్’హిట్ అయింది సెప్టెంబర్ 19న థియేటర్లోకి రాబోతోంది. అందరూ చూడండి అని అన్నారు.హీరో అంకిత్ కొయ్య మాట్లాడుతూ,వర్ధన్‌కి మారుతి రెండో అవకాశం ఇచ్చారు. సక్సెస్ లేనప్పుడు కూడా మారుతిలాంటి వారు వెన్నంటే ఉండి ప్రోత్సహిస్తుంటారు. నన్ను నమ్మి నాకు ఇంత మంచి సినిమాను ఇచ్చిన మారుతికి థాంక్స్‘ వచ్చి సినిమా చూడండి.. నచ్చకపోతే సున్నా రేటింగ్ ఇవ్వండి. నచ్చితే మాత్రం ప్రమోట్ చేస్తూ ముందుకు తీసుకెళ్లండి అని అన్నారు. డైరెక్టర్ జె.ఎస్.ఎస్. వర్ధన్ మాట్లాడుతూ.బ్యూటీ సినిమా ప్రతీ ఒక్కరినీ సీటులో కూర్చోబెడుతుంది. నీలఖి చాలా బాగా నటించారు. బ్యూటీ చిత్రం అందరికీ నచ్చుతుంది అని అన్నారు.నిర్మాత విజయ్ పాల్ రెడ్డి అడిదల మాట్లాడుతూ మంచి చిత్రాల్ని నిర్మించాలని ఇండస్ట్రీలోకి వచ్చాను.మా కోసం వచ్చిన మారుతి, ఎస్.కే.ఎన్‌కి థాంక్స్. నరేష్, వాసుకి, అంకిత్ ఇలా అందరూ అద్భుతంగా నటించారు. సెప్టెంబర్ 19న ‘బ్యూటీ’చిత్రం రాబోతోంది. అందరూ చూడండి అని అన్నారు.హీరోయిన్ నీలఖి మాట్లాడుతూ,. నాకు బ్యూటీ మొదటి చిత్రం .19న అందరూ తప్పక చూడండిఅనిఅన్నారు.

# మంచు మనోజ్ అతిథిగా ‘దక్ష’ మూవీ రిలీజ్ ప్రెస్ మీట్



మంచు లక్ష్మీ ప్రసన్న ప్రధాన పాత్రలో శ్రీలక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ అండ్ మంచు ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై రూపుదిద్దుకుంటున్న చిత్రం ‘దక్ష’ ది డెడ్‌లీ కాన్స్పిరసీ (ఈ సినిమాలో డాక్టర్ మంచు మోహన్ బాబు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు.తండ్రీ కూతుళ్లు కలిసి మొదటి సారిగా ఈ చిత్రంలో నటించడం విశేషం. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వంశీ కృష్ణ మల్లా అందించారు. ఈ నెల 19న ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా రిలీజ్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాకింగ్ స్టార్ మంచు మనోజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటుడు రంగస్థలం మహేశ్ మాట్లాడుతూ ‘దక్ష” చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన మంచు లక్ష్మీకి థ్యాంక్స్. ఈ సినిమాలో ఆమెతో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. ఈ సినిమా ఆమెకు మరింత మంచి పేరు తీసుకొస్తుందని నమ్ముతున్నానని అన్నారు. డైరెక్టర్ వంశీకృష్ణ మల్లా మాట్లాడుతూ ,“దక్ష” ఒక డిఫరెంట్ థ్రిల్లర్ మూవీ. మీ అందరికీ నచ్చుతుంది. ప్రస్తుతం ఇలాంటి తరహా మూవీస్ నే ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేసే అవకాశం ఇచ్చినందుకు లక్ష్మీ అక్కకు థ్యాంక్స్. ఈ సినిమాలో మోహన్ బాబు సహా ఎంతోమంది పెద్దవాళ్లను డైరెక్ట్ చేశాను. వాళ్లు నటనపట్ల అంకితభావం ఉన్నవాళ్లు కాబట్టే అంత పై స్థాయికి వచ్చారు. ఈ నెల 19న మా “దక్ష” మూవీ చూసి సక్సెస్ చేస్తారని కోరుకుంటున్నానని అన్నారు.మంచు లక్ష్మీ మాట్లాడుతూ “దక్ష” కథను నా దగ్గరకు నాన్న తీసుకొచ్చారు. ఆయనే ఈ కథను తీసుకొచ్చారా అనేది మొదట్లో నమ్మలేకపోయాను. ప్రతి చిత్రంతో మనకొక సొంత టీమ్ తయారవుతుంది. మహేశ్, జెమినీ సురేష్ వంటి కో ఆర్టిస్టులతో మాకొక కొత్త టీమ్ ఫార్మ్ అయ్యింది. “దక్ష” సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరూ ఇది తమ సినిమా అనుకునే నటించారు. మహేశ్ అయితే ప్రమోషన్స్ గురించి ఎలా చేయాలో చెప్పేవాడు. ఈ చిత్రంలో నాన్న ఇమేజ్ కు తగినట్లు పర్ఫెక్ట్ క్యారెక్టర్ ఉంది. అందుకే ఆయనను అడిగాం. సముద్రఖని, సిద్దిక్, విశ్వంత్, చిత్రా శుక్లా..ఇలా పాన్ ఇండియా వైజ్ చూస్తే ప్రతి భాష నుంచి పేరున్న ఆర్టిస్టులు మా చిత్రంలో నటించారు. నాన్న తర్వాత నన్ను అంత బాగా చూసుకునేది మనోజ్. అతను సినిమా చేయనప్పుడు ఇలాంటి మంచి ఆర్టిస్ట్ స్క్రీన్ మీద మళ్లీ ఎప్పుడు కనిపిస్తాడు అని ఒంటరిగా బాధపడ్డాను. మనోజ్ హీరోగానే కాదు విలన్ గానూ మెప్పించగలడు, కామెడీ చేయగలడు. వర్సటైల్ యాక్టర్‌గా ప్రూవ్ చేసుకున్నాడు. “దక్ష” సినిమాకు మనోజ్ ఇచ్చిన సజెషన్స్‌ను తీసుకున్నాను. ఎందుకంటే మనోజ్‌కు ఫిలిం మేకింగ్ మీద, ప్రతి క్రాఫ్ట్ మీద పట్టుంది. నాన్నతో అమితాబ్ పీకూ లాంటి మూవీ చేయాలని ఉంది. నటిగా నా ప్రయాణాన్ని ఆపను. తమిళం, మలయాళంలో కూడా నటించాను. నా దగ్గరకు వచ్చే ప్రాజెక్ట్స్ ముందు నటిగా వచ్చి, ఆ తర్వాత ప్రొడ్యూస్ చేయమని అడుగుతున్నారు. ప్రొడక్షన్ అంత ఈజీ కాదు. మా “దక్ష” చిత్రాన్ని నైజాంలో మైత్రీ మూవీ వాళ్లు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. కన్నప్ప, మిరాయ్ తర్వాత వాళ్లకు మా సినిమా హ్యాట్రిక్ అవ్వాలి. అన్నారు. రాకింగ్ స్టార్ మంచు మనోజ్ మాట్లాడుతూ నా మిరాయ్ మూవీని సక్సెస్ చేసినందుకు ప్రేక్షకులకు థ్యాంక్స్. నెక్ట్స్ వీక్ అక్క, నాన్న కలిసి నటించిన “దక్ష” సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమాను కూడా మీరు పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా. ఈ సినిమా కోసం అక్క చాలా కష్టపడింది. “దక్ష” టీమ్ అందరికీ నా బెస్ట్ విశెస్ చెబుతున్నా. ప్రస్తుతం ప్రేక్షకులతో థియేటర్స్ కళకళలాడుతున్నాయి. లిటిల్ హార్ట్స్ హిట్ అయ్యింది, బెల్లంకొండ సాయి కిష్కిందపురి మంచి విజయాన్ని అందుకుంది. అలాగే మా మిరాయ్ ని ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. ఒకే రోజు రెండు చిత్రాలు రిలీజై మంచి విజయం సాధించాయి. అందుకు బెల్లంకొండ సాయిబ్రదర్‌కు కంగ్రాట్స్ చెబుతున్నా. నెక్ట్స్ “దక్ష” రాబోతోంది, ఆ తర్వాత ఓజీ వస్తోంది. ఈ నెల మూవీ లవర్స్‌కు ఫీస్ట్‌లా ఉంటుంది. అన్ని సినిమాలు బాగుంటేనే ఇండస్ట్రీ బాగుంటుంది. మన తెలుగు సినిమా అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు పొందాలని కోరుకుంటున్నాని అన్నారు.

# ఘనంగా “లిటిల్ హార్ట్స్” సక్సెస్ సెలబ్రేషన్స్



**“లిటిల్ హార్ట్స్”నా ఫేవరేట్ ఫిలిం, డైరెక్టర్ సాయి మార్తాండ్ తో సినిమా చేస్తా హీరో అడివి శేష్ “లిటిల్ హార్ట్స్” విజయం చిన్న చిత్రాలకు కొత్త దారి చూపించింది డైరెక్టర్ మారుతి,**

మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా నటించిన ““లిటిల్ హార్ట్స్” సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. ఆదిత్య హాసన్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాను అద్భుతంగా ప్రమోట్ చేసి నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ బన్నీ వాస్ తన బీవీ వర్క్స్, వంశీ నందిపాటి తన వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా థియేట్రికల్ గా రిలీజ్ చేశారు. ఈ సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్ ఈవెంట్ తాజాగా హైదరాబాద్ లో గ్రాండ్‌గా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హీరో అడివి శేష్, డైరెక్టర్ మారుతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ,“లిటిల్ హార్ట్స్” సినిమా చూస్తూ నేనూ మీలాగే పడీ పడీ నవ్వుకున్నాను. ఈ సినిమా కామెడీ ఒక్కటే కాదు మంచి స్క్రిప్ట్ తో రూపొందించారు. మౌళి నటనకు ఫ్యాన్ అయ్యాను. మౌళి కంపోజ్ చేసిన సాంగ్ కు థియేటర్స్ లో వస్తున్న రెస్పాన్స్ మామూలుగా లేదు. ఈ యంగ్, ఎనర్జిటిక్ టీమ్ మరెన్నో క్లాసిక్ మూవీస్ చేయాలి. అన్నారు.డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ, “లిటిల్ హార్ట్స్” సినిమా సక్సెస్ చిన్న చిత్రాలకు మరోసారి దారి చూపించింది. ఒక చిన్న సినిమా హిట్ అయితే వంద సినిమాలు తీసే ధైర్యాన్ని ఇస్తుంది. “లిటిల్ హార్ట్స్” టీమ్‌ను మనస్ఫూర్తిగా అభినందించారు. వారి సక్సెస్ చూస్తుంటే నాకూ హ్యాపీగా ఉందనిఅన్నారు.. డైరెక్టర్ కేవీ అనుదీప్ మాట్లాడుతూ “లిటిల్ హార్ట్స్” సినిమా మనందరినీ బాగా ఎంటర్ టైన్ చేస్తోంది. ఈ సినిమా పెద్ద సక్సెస్ సాధించడం ఆనందంగా ఉంది. మౌళి సోషల్ మీడియాను నేను ఫాలో అవుతుంటాను. మౌళి టాక్స్‌లో ఫన్ కంటెంట్ ఉంటుంది. ఈ టీమ్ మరిన్ని మంచి చిత్రాలు చేయాలని కోరుకుంటున్నా. అన్నారు. ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్ మాట్లాడుతూ “లిటిల్ హార్ట్స్” సక్సెస్ సెలబ్రేషన్స్‌కు గెస్ట్ లుగా వచ్చి సపోర్ట్ చేసిన అడివి శేష్‌కి, మారుతికి, మిగతా అందరికీ థ్యాంక్స్. ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ ఈ సినిమాను థియేటర్ లో చూశాను. ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. మౌళి తమ్ముడిని మీమ్స్‌లో చూశాను. ఇప్పుడు సక్సెస్‌ఫుల్ సినిమాటీమ్‌లో చూస్తు నాను.శివానీ, ఇతర కాస్ట్ అంతా బాగా నటించారు. సాయి మార్తాండ్ తను చూసిన లవ్ స్టోరీస్ ఇన్స్పిరేషన్‌తో మంచి స్క్రిప్ట్ చేశాడు. మాబన్నీవాస్, వంశీ నందపాటి ఈచిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేసి మంచి సక్సెస్ అందుకోవడం హ్యాపీగా ఉంది. ఒక సినిమా సక్సెస్ అయితే ఆ పేరు ఆర్టిస్టులకో, డైరెక్టర్ కో వస్తుంది కానీ ప్రొడ్యూసర్ కు రావడం లేదు.“లిటిల్ హార్ట్స్” ఇప్పుడప్పుడే ఓటీటీలోకి రావడం లేదు. మన పవర్ స్టార్ ఓజీ వచ్చేవరకు థియేటర్స్ లో ఈ సినిమా చూస్తూనే ఉండండి. అన్నారు. హీరో అడివిశేష్ మాట్లాడుతూ, నా సినిమా షూటింగ్ కాస్తఎర్లీగా ఫినిష్ చేసి “లిటిల్ హార్ట్స్” మూవీ చూశాను. మీ అందరిలాగే ఎంజాయ్ చేశాను. ఈ సినిమాలో కామెడీతో పాటు ఒక ఇన్నోసెన్స్ ఉంది. కామెడీ పంచ్ వేసినవారు తీసుకున్నవారు ఇద్దరూ హ్యాపీగా ఫీలవుతారు. ఆర్టిస్టులంతా బాగా పర్ ఫార్మ్ చేశారు. శివానీని మౌళికి జోడీగా చూశాక ఈ అమ్మాయి వయసులో కాస్త పెద్దగా ఉన్నట్లుంది అనిపించింది. కానీ కాత్యాయని క్యారెక్టర్ కు ఆమెనే ఎందుకు తీసుకున్నారో సినిమా పూర్తిగా చూశాక అర్థమైంది. కాత్యాయనిగా శివానీ బాగానటించింది. డైరెక్టర్‌సాయి మార్తాండ్ రోజుకు 16 గంటలు నెలరోజులకు పైగా ఈ సినిమా కోసం కష్టపడ్డాడు. ఈ సినిమా కోసం ఆయన ఎంత హార్డ్ వర్క్ చేసి ఉంటాడో ఊహించగలను. సినిమా రిలీజ్ అయ్యి సక్సెస్ అయ్యాక ఎంతోమంది ఎన్నో చెబుతుంటారు. కానీ సాయి మార్తాండ్ చాలా హంబుల్ గా ఉన్నాడు. “లిటిల్ హార్ట్స్” సెకండ్ హాఫ్‌లో హార్ట్ టచింగ్ సీన్స్ ఉంటాయి. అది దర్శకుడిగా సాయి మార్తాండ్ క్రాఫ్ట్. ఇతని డైరెక్షన్ లో మూవీ చేయాలని ఉంది. మౌళి మరింత పెద్ద స్టార్ కావాలి. బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ చిత్రానికి పర్ఫెక్ట్ రిలీజ్ ఇచ్చారు. అన్నారు.నటీనటులు: మౌళి తనూజ్, శివానీనాగరం, రాజీవ్ కనకాల, ఎస్ ఎస్ కాంచి, అనిత చౌదరి, సత్య కృష్ణన్, తదితరులు.

# ఇలాంటి పొలిటికల్ థ్రిల్లర్ ఇప్పటివరకూ రాలేదు



రామాంజనేయులు జవ్వాజి

హీరో విజయ్ ఆంటోనీ ‘మార్గన్’ విజయం తర్వాత మరో పవర్ ఫుల్ ప్రాజెక్ట్ ‘భద్రకాళి’తో వస్తున్నారు. విజయ్ ఆంటోనీకి ల్యాండ్‌మార్క్ మూవీగా నిలిచే ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కనెక్ట్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ‘భద్రకాళి’ సెప్టెంబర్ 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత రామాంజనేయులు జవ్వాజీ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**భద్రకాళి ఎలా మొదలైంది?**

డైరెక్టర్ అరుణ్ ప్రభు కథ చెప్పారు. చాలా బాగుంది. భద్రకాళి సినిమాకి అరుణ్ బాబు ఒక బ్యాక్ బోన్. ఈ సినిమాలో మంచి ఎంటర్టైన్మెంట్‌తో పాటు ప్రేక్షకులను ఆలోచింపచేసే అంశాలు కూడా ఉన్నాయి.

**ట్రైలర్ చూస్తే ఇదొక పొలిటికల్ థ్రిల్లర్ అనిపిస్తుంది? కథ ఎంత డిఫరెంట్‌గాఉంటుంది?**

పొలిటికల్ బ్యాక్ డ్రాప్ లో చాలా సినిమాలు వచ్చాయి కానీ ఈ సినిమాలో హీరోచేసిన క్యారెక్టర్ తో ఇప్పటివరకు ఎలాంటి సినిమా రాలేదు. చాలా డిఫరెంట్ క్యారెక్టర్. ఇలాంటి హీరో క్యారెక్టర్ తో ఇప్పటివరకు సినిమా రాలేదు. సినిమాలో చాలా మంచి స్ట్రాంగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ఆడియన్స్ కి డెఫినెట్గా కనెక్ట్ అవుతాయి.

**భద్రకాళిలో హైలెట్స్‌గా ఉండే ఎలిమెంట్స్ ఏమిటి?**

చాలా గ్రిప్ ఉన్న స్టోరీ ఇది. ఇందులో ప్రతి సీన్ ఆడియన్స్ ని హత్తుకుంటుంది.

**వరుసగా సినిమాలు చేయడానికి మార్గన్ విజయం మీకు జోష్ ఇచ్చిందా?**

మార్గాన్‌కి ముందు దాదాపు 11 సినిమాలు చేశాను. తమిళ్లో చాలా పెద్ద లెవెల్లో డిస్ట్రిబ్యూషన్ చేశాం.

**తెలుగులో చేస్తున్న సినిమాలు ఉన్నాయా?**

తెలుగులో సత్యదేవ్‌తో ఫుల్ బాటిల్ అనే సినిమా చేస్తున్నాం. అది కంప్లీట్ అయి రెడీగా ఉంది. నవంబర్లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం.

ఆల్ ది బెస్ట్

థాంక్ యూ.



గోపాలకృష్ణ దర్శకత్వంలో మురళీమోహన్ జయసుధ జంటగా నటించిన “లక్ష్మణ రేఖ” చిత్రం విడుదలై 50 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుక నిర్వహించారు. చిత్ర దర్శకుడు గోపాలకృష్ణ, మురళీమోహన్, జయసుధలతోపాటు ఈ చిత్రానికికో డైరెక్టర్‌గా పని చేసిన రాజేంద్రప్రసాద్‌లను ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీరంతా 50 ఏళ్ళు వెనక్కి వెళ్ళి, అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. క్రమశిక్షణ, అంకితభావాలను లక్ష్మణరేఖలుగా మలచుకుని ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు రామ సత్య నారాయణను అభినందించారు. సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ వేడుకలో సీనియర్ దర్శకులు ధవళ సత్యం, పి.ఎన్. రామచంద్రరావు, తెలుగు నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్, ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ఫిలిం నగర్‌కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కాజా సూర్యనారాయణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టులు సురేష్‌కొండేటి, ధీరజ అప్పాజీ పాల్గొన్నారు.

# ‘లక్ష్మణరేఖ’ గోల్డెన్ జూబిలీ వేడుకలో మురళీమోహన్,జయసుధ

# పేరెంట్స్ అన్ని విషయాల్ని పంచుకునేలా పిల్లలకు స్వేచ్ఛను ఇవ్వాలి:సాయి దుర్గాతేజ్

ప్రపంచ వ్యాప్తంగా 70 నగరాలు, వేల మంది యంగ్ ప్రొఫెషనల్స్ కలిసి కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ)లో భాగంగా యంగ్ ఇండియన్స్ ఆధ్వర్యంలో పిల్లలపై లైంగిక దాడికి వ్యతిరేక నినాదంతో అభయమ్ మసూమ్ సమ్మిట్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. భారత్ రైజింగ్, యంగ్ ఇండియన్స్, కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుప్రీమ్ హీరో సాయి దుర్గతేజ్, మంత్రి సీతక్క, యంగ్ ఇండియన్స్ కో చైర్మన్ భవిన్ పాండ్య, యంగ్ ఇండియన్స్ నేషనల్ చైర్మన్ తరంగ్ ఖురానా, సీఐఐ తెలంగాణ చైర్మన్ శివ ప్రసాద్ రెడ్డి, జోత్స్న సింగ్ వంటివారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ,మన పిల్లల్ని మనమే కాపాడుకోవాలి. సోషల్ మీడియాలో పిల్లల మీద అబ్యూజ్ చేస్తున్నారు. అలాంటి కామెంట్లు చేస్తే కూడా లైక్స్ చేస్తున్నారు నవ్వుతున్నారు..



అవన్నీ చూస్తే నాకు చాలా బాధగా అనిపిస్తుంది. మనం ఇలాంటి సమాజాన్ని కోరుకుంటున్నామా? చిన్న పిల్లల మీద అలాంటి పిచ్చి కామెంట్లు చేయడం ఏంటి? నేను ఆ టాపిక్ మీద ఎవరైనా మాట్లాడాతారా? మీడియా స్పందిస్తుందా? అని చూశాను. కానీ ఎవ్వరూ రియాక్ట్ అవ్వలేదు. ఇక ఆ బాధ్యతను నేను తీసుకున్నాను. అందుకే నేను ఆ సమయంలో అలా రియాక్ట్ అయ్యాను. డార్క్ కామెడీ అంటూ పిచ్చి పిచ్చి కామెంట్లు చేస్తున్నారు. వాక్ స్వాతంత్రం ఉంది.. కానీ ఎదుటి వాళ్లని బాధ పెట్టే వరకు ఉండకూడదు. 2015లో థింక్ పీస్ అనే సంస్థతో పని చేశాను. అరకులో చైల్డ్ ఎడ్యుకేషన్ గురించి పోరాడాను. నేను అక్కడ స్కూల్ నిర్మించాను. తెలంగాణలో నేను కొంత మంది పిల్లల్ని కూడా దత్తత తీసుకున్నాను. పిల్లల చదువు, పోషణ ఇలా అన్నింటినీ చూసుకుంటాను. ఇప్పుడు పిల్లలతో తల్లిదండ్రులు ఎక్కువ సమయాన్ని గడపడం లేదు. ఇప్పుడంటే చాట్ జీటీపీ, ఏఐ అంటున్నారు. కానీ నాకు మాత్రం మా అమ్మే ప్రపంచం. అమ్మ, మామయ్యలు, స్నేహితులు ఇలా అందరితో నేను సమయాన్ని ఎక్కువగా గడిపేవాడ్ని. పిల్లలతో పేరెంట్స్ ఎక్కువగా ఇంటరాక్ట్ అవ్వాలి. నేను నా సెకండ్ క్లాస్‌లోని లవ్ స్టోరీని మా అమ్మతో చెప్పాను. అలా చెప్పే స్వతంత్రాన్ని నాకు ఆమె ఇచ్చారు. పేరెంట్స్‌తో అన్ని విషయాల్ని పంచుకునేలా పిల్లలకు స్వేచ్ఛను ఇవ్వాలి. పిల్లలకు ప్రతీ విషయాన్ని ప్రేమతో చెప్పే ప్రయత్నం చేయాలి. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ విషయాల్ని స్కూల్లో టీచర్స్, ఇంట్లో పేరెంట్స్ చెప్పే ప్రయత్నం చేయాలి.

# ‘డొక్కా సీతమ్మ’ మూవీ నిర్మాతపై చర్యలు తీసుకుంటాం : వీఎన్ఆంఫిలింస్



“అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ” బయోపిక్ టైటిల్ హక్కులు మాకే సొంతం,“అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ” మూవీ నిర్మాతపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం వీఎన్ఆర్ ఫిలింస్

అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ బయోపిక్ టైటిల్ తో వీఎన్ఆర్ ఫిలింస్ సంస్థ సినిమాను నిర్మిస్తోంది. ఈ సినిమా త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించుకోనుంది. ప్రస్తుతం నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంది. అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ బయోపిక్ చిత్రానికి ఎ.ఆర్.బి. నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అచ్చర్ల రాజుబాబు దర్శకత్వం వహిస్తున్నారు. అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ బయోపిక్ టైటిల్ హక్కులు తమకే సొంతమని, ఈ టైటిల్ ను ఫిలింఛాంబర్ లో రిజిస్టర్ చేయించామని వీఎన్ఆర్ ఫిలింస్ వెల్లడించింది. అయితే ఎలాంటి టైటిల్ రిజిస్ట్రేషన్ లేకుండా ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ టైటిల్ తో ఉషారాణి మూవీస్ బ్యానర్ లో వల్లూరి రాంబాబు నిర్మాతగా, రవి నారాయణ్ దర్శకుడిగా సినిమా రూపొందిస్తున్నారు. ..ఈ విషయంపై వీఎన్ఆర్ ఫిలింస్ స్పందిస్తూ “అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ” బయోపిక్ టైటిల్ ను మేము ఫిలింఛాంబర్ లో రిజిస్టర్ చేయించాం. అయితే ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ టైటిల్ తో ఉషారాణి మూవీస్ సినిమా రూపొందిస్తోంది. ఈ చిత్ర దర్శకుడు రవి నారాయణ్ మమ్మల్ని గతేడాది టైటిల్ ఇవ్వమని అడిగారు. మేము సినిమా చేస్తున్నాం కాబట్టి టైటిల్ ఇవ్వడం కుదరదు అని తేల్చిచెప్పాం. అయినా కూడా మా అనుమతి లేకుండానే ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ టైటిల్‌తో సినిమా షూటింగ్ చేస్తున్నారు. మాకు చెందిన టైటిల్ తో మరే దర్శక నిర్మాత సినిమా రూపొందించినా చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ఉషారాణి మూవీస్ పై చర్యలకు ఉపక్రమిస్తున్నాం. అని తెలిపింది.

## బాపట్ల జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బి.ఉమామహేశ్వర్

బాపట్ల,సెప్టెంబర్14,ప్రభాతవార్త: గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను కట్టడి, మహిళలు మరియు చిన్నపిల్లలపై జరుగుతున్న నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని బాపట్ల జిల్లా ఎస్పీ శ్రీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వేద మంత్రోచ్చారణల మధ్య జిల్లా 3వ నూతన ఎస్పీగా ఉమామహేశ్వర్ అదివారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, రేపల్లె డీఎస్పీ ఏ. శ్రీనివాసరావు, బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు, చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్, ఏ.ఆర్ డీఎస్పీ పి. విజయసారథి, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు తదితరులు ఎస్పీ గారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ సాధారణ బదిలీలలో భాగంగా బాపట్ల జిల్లాకు ఎస్పీగా నియమించినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, డీజీపీ శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఐ.పి.ఎస్. గారికి కృతజ్ఞతలు తెలిపారు.



గంజాయి అక్రమ రవాణా, విక్రయాల నియంత్రణ, మహిళలపై జరుగుతున్న నేరాల అరికట్టడం, సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని కేసుల దర్యాప్తును వేగవంతం చేయడం జరుగుతుందన్నారు.సముద్రతీర ప్రాంతాలలో భద్రత చర్యలపై మరింత దృష్టి పెడతామన్నారు. జిల్లాలోని ప్రధాన అంశాల పై దృష్టి సారించి శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు.అనంతరరం జిల్లా పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని శాంతి భద్రతల పరిస్థితులు, స్థానికంగా ఉన్న సమస్యలపై సమగ్ర చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతను అనుసరించి, జిల్లా పరిస్థితులకు అనుగుణంగా నేర నియంత్రణపై పోలీస్ అధికారులు దృష్టి సారించాలని పోలీస్ అదికారులకు సూచించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను పూర్తి స్థాయిలో అరికట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. దీనికోసం తగిన కార్యాచరణను వెంటనే ప్రారంభించాలన్నారు. మహిళలు మరియు చిన్నపిల్లలపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నేరస్తులు తమ తీరును మార్చుకొని సైబర్ నేరాలు, వైట్ కాలర్ నేరాలకు పాల్పడుతున్న సందర్భాలను ఎస్పీ గారు ప్రస్తావించారు. ఈ తరహా నేరాలను అధిగమించేందుకు పోలీస్ అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కానిస్టేబుల్ స్థాయి నుండీ ఉన్నతస్థాయి అధికారుల వరకు ప్రతీ ఒక్కరు సాంకేతికతలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా, సైబర్ నేరాల ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపటాలన్నారు. ప్రతీరోజు సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు "విజిబుల్ పోలీసింగ్" మరియు "ఎన్‌ఫోర్స్మెంట్" విధులను నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. ఈ సమయంలో పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తే, అధిక శాతం నేరాలను తొలిదశలోనే అరికట్టవచ్చని అభిప్రాయపడ్డారు. బాపట్ల జిల్లాలో విశాలమైన సముద్ర తీర ప్రాంతం ఉండటంతో యాత్రికులు అధిక సంఖ్యలో పర్యటిస్తుంటారని వారి భద్రత దృష్టిలో ఉంచుకుని, తీర ప్రాంతాల్లో పోలీస్ గస్తీని మరింతగా పెంచాలన్నారు. ఎవరైనా పోలీస్ స్టేషన్ కు వస్తే తక్షణమే స్పందిస్తూ బాధితులకు సహాయం చేయాలని తెలిపారు. ఎవరైనా పోలీస్ స్టేషన్‌కు వస్తే, తక్షణమే స్పందించి బాధితులకు అవసరమైన సహాయం అందించాలన్నారు. పోలీసులు తక్షణం స్పందించి తీసుకునే చర్యల వలన నేరాలను ఆదిలోనే అరికట్టేందుకు అవకాశం ఉంటుందని అధికారులకు సూచించారు.

## కెఎల్‌యులో ఘనంగా ముగిసిన స్కిల్ పలావర్

తాడేపల్లి,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త : కెఎల్‌యు యూనివర్సిటిలోని స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో బి.టెక్ విద్యార్థుల్లో పరిశ్రమ గురించి పూర్తి అవగాహన కల్పించి,వారిని పరిశ్రమలో ఉద్యోగులుగా పనిచేయడానికి సంసిద్ధ పరిచేందుకు రూపకల్పన చేసిన స్కిల్ పలావర్ అనే ప్రాజెక్టు బెస్ట్ లెర్నింగ్ హ్యాకథాన్ మూడవ దశలు ఆదివారం విజయవంతంగా పూర్తిచేశారు.ప్రతి దశలో మూడు ముఖ్యమైన భాగాలు ఉంటాయి లెర్నథాన్,ఆన్‌లైన్ రివ్యూ,హ్యాకథాన్.మూడు దశలలోని లెర్నథాన్లు విజయవంతంగా పూర్తయాయి.రెండు ఆగస్టులో,చివరిది సెప్టెంబర్ దీని ద్వారా కార్యక్రమం ముఖ్యమైన మైలురాయిని



చేరుకుంది.స్కిల్ ప్యాలవర్ మూడవ దశ సెప్టెంబర్ 13సాయంత్రం ప్రారంభమై,సెప్టెంబర్ 14న ముగిసింది.ఇందులో విద్యార్థులు 10ప్రధాన సవాల్ రంగాల్లో ఉత్సాహభరితంగా పాల్గొన్నారు.జనరేటివ్ హాక్‌థాన్ లో 606మంది విద్యార్థులు,ఎన్ఎల్‌పి ఇన్నోవేటర్స్ హ్యాక్‌థాన్ లో 346మంది,బైట్ బిల్డర్స్ చాలెంజ్ లో 335మంది,డి బిగ్ డ్రైవ్ షో డోన్‌లో 309మంది విద్యార్థులు,ఇంటిగ్రేటెక్ బిల్డ్‌థాన్ 251మంది విద్యార్థులు,మొబిటి ఎక్స్ హ్యాక్ ఫెస్ట్ లో 133 మంది విద్యార్థులు,సైబర్ స్కోప్ ఎనాలిటిక్ ఫర్ డిఫెన్స్‌లో 109మంది విద్యార్థులు,డీప్ హ్యాక్‌లో2025లో 81మంది విద్యార్ధులు,క్రిప్టో జెనెసిస్ హ్యాక్ థాన్ లో 39మంది,ఎకో స్ట్రట్ హ్యాక్ థాన్ 25మంది విద్యార్థులు మొత్తం 2,250మంది ప్రీఫైనల్ ఇయర్ విద్యార్థులు ఈ దశలో పాల్గొని ఆవిష్కరణ,ప్రతిఘటన,జట్టు సహకారాన్ని ప్రదర్శించారు.ఆదివారం ముగిసిన లెర్న్‌థాన్ లో కేర్ లోన్ గ్లోబల్ సొల్యూషన్స్ నుండి వెంకట్ కృష్ణారెడ్డి అమ్మిరెడ్డి,ఎల్‌టిఐ మైండ్ ట్రి నుండి రామ్‌సాగర్,మొజిల్లా ఇండియా నుండి కళ్యాణ్ దీక్షిత్‌లతో పాటు పలు కంపెనీల ఉండి పెద్ద సంఖ్యలో ఐటి నిపుణులు పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పి.ఎస్.వర్మ,నిరంతర మార్గనిర్దేశంతో పాటు ప్రొవైస్ చాన్సలర్లు డాక్టర్ ఎన్.వెంకట్రామ్,డాక్టర్ కె.రాజశేఖరరావు పర్యవేక్షణలో నిర్వహించబడిందన్నారు.

## తెలుగుదేశం పార్టీలో ఇబ్రహీం సేవలకు గుర్తింపు..

మంగళగిరి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త: మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్ గుడ్ విల్ ముస్లిం సంక్షేమ కార్యాలయం వద్ద ఇటీవల రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన మహమ్మద్ ఇబ్రహీం ను ఆదివారం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ ఆధ్వర్యంలో దేశం నాయకులు సత్కరించారు. దానబోయిన, నాయకులు ఇబ్రహీం ను శాలువాలతో సత్కరించి బొకేలు అందజేశారు. అనంతరం దానబోయిన మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీలో వివిధ పదవులు నిర్వహించి ఇబ్రహీం పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ ఆయన సేవలను గుర్తించి డైరెక్టర్ పదవితో గౌరవించడం అభినందనీయమన్నారు. ఇబ్రహీం కు పదవి ఇవ్వడం పార్టీలో



సీనియర్లకు ఇస్తున్న గుర్తింపుకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రుద్రు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, మురళి, తోట శ్రీను బాబు, కొల్లి వెంకట్రావు, రుద్రు నాగరాజు, కొత్త శ్రీనివాసరావు, చింకా కోటేశ్వరరావు, పేరుబోయిన వెంకటేశ్వరరావు, తోట రమేష్, శ్రీను, సురేష్, పణిదపు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వరదలు వస్తే ఎదుర్కోటానికి జిల్లా యంత్రంగా సిద్ధంగా ఉంది

కొల్లూరు, సెప్టెంబర్ 14 (ప్రభాతవార్త) : వరదలు వస్తే ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కొల్లూరు మండల కేంద్రం ఎంపిడివో కార్యాలయం నందు రేపల్లె డివిజన్ రెవెన్యూ అధికారి యన్.రామలక్ష్మి, డిపిఓ ప్రభాకర్‌లతో కలిసి కృష్ణానది వరదల సుచ్చివేశానపై జిల్లా మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంలో



కృష్ణానది వరదలు వచ్చినపుడు ఎలాంటి చర్యలు తీసుకొన్నారు, వరదలు వస్తే ఎలాంటి సమస్యలు వస్తాయని వాటిని ముందుగానే అంచనాలు వేసుకు దానికి తగినట్టుగా జిల్లా మండల స్థాయి అధికారులు పని చేయాలన్నారు. కృష్ణానది పరివాహ ప్రాంతము ఉన్న లంక గ్రామాలలో బోట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి బొట్లు అందుబాటులో ఉంటాయని, త్రాగునీరు, భోజనాలు అన్ని ఏర్పాట్లు కూడా సకాలంలో అందజేయడానికి అధికారులు సిద్దంగా ఉండాలన్నారు. ప్రజలు ఎవరు అధైర్య పడవలసిన అవసరం లేదని, జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. జిల్లా స్థాయి అధికారుల నుంచి గ్రామస్థాయి అధికారి వరకు వరదలు సూచ్చివేషన్‌కు సంబంధించి సమాచారాన్ని వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అంతకు ముందు కృష్ణానది వారధిపై నుంచి కృష్ణ నది నీటి ప్రవాహాన్ని అధికారులతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. సమావేశంలో విద్యుత్, పోలీసు, పంచాయితీరాజ్, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

కర్లపాలెం,సెప్టెంబర్14,ప్రభాతవార్త: రైతుల కు అవసరమైన మేరకు యూరియా సకాలంలో పంపిణి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను అదేశించారు. కర్లపాలెం మండలం,పెద్దగొల్లపాలెం పంచాయతీ మార్పు చెన్నయ వారి పాలెం కమ్యూనిటీ హాల్ నందు వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న యూరియా పంపిణీ కేంద్రాన్ని అదివారం కలెక్టర్ పరిశీలించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన మేరకు యూరియా అందజేయాలని మండల వ్యవసాయ అధికారిని ఆదేశించారు. యూరియా ఎక్కడ పంపిణీ చేసేది ముందుగానే రైతులకు సమాచారాన్ని తెలియజేయాలన్నారు.



రైతు సేవ కేంద్రాలకు వచ్చే రైతులకు టోకెన్లను పంపిణీ చేయాలన్నారు. రైతు ఎన్ని ఎకరాలలో పంటలు వేశారు దానికి సరిపడా యూరియాను సకాలంలో అందజేసినచో రైతుకు అధిక దిగుబడి వస్తుందన్నారు.ఎన్ని ఎకరాలు భూములు ఉన్నాయి అ భూముల్లో ఏ పంటలు వేశారు,ఎంత యూరియా అవసరము అవుతుందని,నీటి సౌకర్యం ఉందని రైతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎరువుల కొరత, అధిక ధరలు ఉంటే కంట్రోల్ రూమ్ 82470 40131 నెంబర్ కు ఫోన్ చేసి పిర్యాదు చేయాలని రైతులకు చూచించారు. గత సంవత్సరం లో ఈ మండలంలో ఈరోజు నాటికి ఎన్ని ఎకరాలలో పంటలు వేశారు,ఇప్పుడు ఎన్ని ఎకరాలలో పంటలు వేశారని నిర్ధారణ చేసి యూరియా ఎంత వచ్చింది, ఇంకా ఎంత అవసరము ఉందని మండల వ్యవసాయ అధికారి ని అడిగి తెలుసుకున్నారు. యూరియా పంపిణీ చేసిన వివరాలను ప్రతి రోజు రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు.ఎ మండలానికి చెందిన రైతులకు అ మండలంలోనే యూరియా పంపిణీ చేయాలని మండల వ్యవసాయ అధికారులకు చూచించారు. మండలంలో ఎన్ని ఎకరాలు పంటలు వేశారో అన్ని ఎకరాలకు మాత్రమే యూరియా పంపిణీ చేయాలని,మండలాలలో ఇప్పటి వరకు ఎంత యూరియా పంపిణి చేశారు, ఇంకా ఎంత అవసరము అవుతుందని అంచనాలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్ డిఓ. పి.గ్లోరియా, వ్యవసాయ శాఖ ఏ డి అన్నపూర్ణ,ఏ డి ధనరాజ్, యం పి డి ఓ.ఏ.శ్రీనివాస్ రావు, మండల వ్యవసాయ అధికారి యం.సుమంత్ కుమార్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బీచ్ ఫెస్టివల్ ను రాష్ట్రీయ పండుగలా అత్యంత ఘనంగా నిర్వహించాలి

బాపట్ల,సెప్టెంబర్14,ప్రభాతవార్త: బీచ్ ఫెస్టివల్ ను రాష్ట్రీయ పండుగలా అత్యంత ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై పర్యాటక శాఖ రాష్ట్ర స్థాయి అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో స్థానిక కలెక్టరేట్ నుంచి ఆదివారం హైబ్రిడ్ మోడ్ లో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు సూర్యలంక బీచ్ ని ఈనెల 25వ తేదీ నాటికి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు.



వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 26, 27, 28 తేదీలలో సూర్యలంక తీరం వద్ద వేడుకలు జరపాలన్నారు. సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 8 గంటల వరకు వేడుకలు జయప్రదంగా నిర్వహించాలన్నారు. ఈనెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం ఉన్నందున రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వేడుకల్లో పాల్గొంటారన్నారు. భారీ స్థాయిలో 100 ఫుడ్ కోర్టులు, 350 మరుగుదొడ్లు, పర్యాటకులకు చాలినంత బాతింగ్ షవర్లు, 200 డ్రెస్ చేంజింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఇతర జిల్లాలో నుండి ముఖ్యమైన అతిథులు వచ్చే అవకాశం ఉన్నందున అతిథులకు ప్రత్యేకంగా వసతులు కల్పించాలని సూచించారు. వేడుకలకు సంబంధించి తేదీలవారీగా షెడ్యూల్ విడుదల చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. సినీ రంగ ప్రముఖులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆ మూడు రోజులు తీర ప్రాంతమంతా కోలాహలంగా ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పర్యాటకుల భద్రత, సంరక్షణ బాధ్యత పోలీసు, మత్స్య, అటవీశాఖ అధికారులపై ఉందన్నారు. సాధారణంగా వచ్చేవారికంటే వేడుకలలో పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రజలు విలాసంగా, సరదాతో పర్యటించడానికి హెలికాప్టర్ ఏర్పాటు చేస్తున్నామని ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. బీచ్ ఫెస్టివల్ ఉమ్మడి కృష్ణాజిల్లా, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలలోనూ హోర్డింగ్ లు ఏర్పాటు చేయాలన్నారు. టీవీ చానల్స్, ఆల్ ఇండియా రేడియో, సోషల్ మీడియాలలో విస్తృతమైన ప్రచారం చేయాలన్నారు. భారీ స్థాయిలో బీచ్ ఫెస్టివల్ జరుగుతుందనే విషయాన్ని ప్రజలకు చేరవేయాలన్నారు. వేడుకలకు వచ్చే ప్రజలే సరదాగా వాలీబాల్, కబాడీ వంటి ఆటలు ఆడుకోడానికి క్రీడా సామాగ్రి సిద్ధంగా ఉంచాలన్నారు. పిల్లలు, పెద్దవారు ఆడుకోటానికి సౌకర్యం ఉండాలన్నారు. బాపట్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వేడుకల నేపథ్యంలో విక్రయదారులు ఎమ్మార్పీ ధరలకు మించి అధనంగా విక్రయాలు చేస్తే చర్యలు ఉంటాయన్నారు. వేడుకలకు హాజరయ్యే రాష్ట్ర, జిల్లా ప్రజలకు ఇక్కడి జ్ఞాపకాలు మధురానుభూతిని కల్పించేలా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్ డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, పర్యాటక కార్పొరేషన్ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, ప్రమోద్, ఆర్డీవోలు, జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సూర్యలంక బీచ్ లో జరగనున్న బీచ్ ఫెస్టివల్స్ పనులను వేగవంతంగా చేపట్టాలి

బాపట్ల,సెప్టెంబర్14,ప్రభాతవార్త: సూర్యలంక బీచ్ లో జరగనున్న బీచ్ ఫెస్టివల్స్ పనులను వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారు లను ఆదేశించారు. ఆదివారం సూర్యలంక లో బీచ్ ఫెస్టివల్స్ నిర్వహించడానికి అవసరమైన పనులను జిల్లాకలెక్టర్ వి.వినోద్ కుమార్ ,బాపట్ల శాసనసభ్యులు నరేంద్ర వర్మ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బీచ్ ఫెస్టివల్ నిర్వహించడానికి అధికారులకు కేటాయించిన పనులను వేగవంతంగా చెపట్టాలన్నారు.. బీచ్ ఫెస్టివల్ సందర్భంగా వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సూర్యలంక బీచ్ ప్రాంతంలో పారిశుద్ధ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని ఆయన



చెప్పారు. బీచ్ ఫెస్టివల్ నిర్వహించడానికి అవసరమైన సభా ప్రాంగణాన్ని, పార్కింగ్ ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్ చార్జ్ జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, జిల్లాపంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా రవాణా శాఖ అధికారి పరంధామ రెడ్డి, పౌరు సరఫరాల శాఖ డిఎం శివ పార్వతి, డీఎస్ఓ జలీల్ భాషా, జిల్లా టూరిజం అధికారి నాగిరెడ్డి, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లాలో వరదలు వస్తే ఎదుర్కొనటానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది..

బాపట్ల,సెప్టెంబర్14,ప్రభాతవార్త: బాపట్ల జిల్లాలో అనుకొని పరిస్థితిలో వరదలు వస్తే ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి కొల్లూరు మండల కేంద్రం యం పి డి ఓ ఆఫీసు నందు రేపల్లె డివిజన్ రెవిన్యూ అధికారి యన్. రామలక్ష్మి డిపిఓ ప్రభాకర్ లతో కలసి కృష్ణ నది వరద తీరుపై తీసుకోవల్సిన చర్యలపై జిల్లా మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో అనుకొని పరిస్థితిలో కృష్ణ నది వరదలు వస్తే ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.గత సంవత్సరం లో కృష్ణ నది వరదలు వచ్చినపుడు ఎలాంటి చర్యలు చర్యలు తీసుకొన్నారు. వరదలు వస్తే ఎలాంటి సమస్యలు వస్తాయని వాటిని ముందుగానే అంచనా లు వేసుకు దానికి తగినట్టుగా జిల్లా మండల స్థాయి అధికారులు పనిచేయాలన్నారు. కృష్ణానది పరివాహ ప్రాంతము ఉన్న లంక గ్రామాలలో బొట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులు ఆదేశించారు.పరివాక ప్రాంతంలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి బొట్లు అందుబాటులో ఉంటాయని, త్రాగునీరు భోజనాలు అన్ని ఏర్పాట్లు కూడా సకాలంలో అందజేయడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలు ఎవరు అధైర్య పడవలసిన అవసరం లేదని జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. జిల్లాస్థాయి అధికారుల నుంచి గ్రామస్థాయి అధికారి వరకు వరదలకు సంబంధించి సమాచారాన్ని వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. గత సంవత్సరంలో వచ్చిన వరదలను అంచనా వేసుకొని ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ కొల్లూరు మండల కేంద్రం ఎంపీడీవో ఆఫీస్ నందు జిల్లాలో అనుకోని పరిస్థితులో కృష్ణ నది వరదలు వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలని కీలకమైన శాఖల జిల్లా అధికారులు, డివిజన్,మండల స్థాయి అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు.

## రోడ్డు ప్రమాద మృతురాలి కుటుంబానికి రూ.5లక్షల సాయం

తెనాలి, సెప్టెంబర్ 14 (ప్రభాతవార్త) : ఇటీవల కారు ప్రమాదంలో మృతి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యురాలు కన్నెగంటి ఝాన్సీరాణి కుటుంబ సభ్యులను మంత్రి నాదెండ్ల మనోహర్



ఆదివారం పరామర్శించారు. తెనాలిలోని సుల్తానాబాద్, ఆలపాటి నగర్‌లోని ఆమె నివాసానికి వెళ్ళి ఝాన్సీరాణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారుడు కన్నెగంటి నాగార్జునకు రూ.5లక్షల ప్రమాదబీమా చెక్కును మంత్రి అందజేశారు.

## జనసేన పార్టీని వైసీపీ టార్గెట్ చేస్తోంది:మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి టౌన్ సెప్టెంబర్ 14 (ప్రభాతవార్త): కులాల మధ్య చిచ్చు పెడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వైసీపీ కుట్రలు చేస్తోందని,జనసేన పార్టీ పిఏసీ చైర్మన్,రాష్ట్రఆహార పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.ఆదివారం పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,సోషల్ మీడియాను ఉపయోగించి పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగతంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు.ఓట్ల కోసం రాజకీయాలు చేసే పార్టీ వైసీపీ అని మండిపడ్డారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబానికి ఎందుకు ఫోన్ చెయ్యలేదు?,డాక్టర్ సుధాకర్ కుటుంబానికి ఫోన్ చేసి ఎందుకు పరామర్శించలేదని ఆయన విమర్శించారు.ఈ రోజు మీరు వెనక ఉండి చేయించిన కుట్రలో పాత్రధారి అయినవారికే మీ పరామర్శ, కావాలని సమాజంలో చిచ్చులు పెడుతున్న వారిపై, పరోక్షంగా వెనక ఉండి ప్రేరేపిస్తున్న వారిపై కచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని,మంత్రి మనోహర్ హెచ్చరించారు. గత ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును గుర్తుపెట్టుకోవాలని కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారని వీరి ప్రవర్తన ఇలాగే ఉంటే రాబోయే రోజుల్లో ఇప్పుడు వచ్చిన అన్ని స్థానాలు కూడా రావని ఆయన విమర్శించారు. కూటమి




ప్రభుత్వం విధానాలు పథకాలు ప్రజలకు ఆమోదం పొందాయని ప్రజల మద్దతు తెలుపుతున్నారని అభివృద్ధిని చూడలేక వైసీపీ ఇలాంటి చిల్లర ఆరోపణలకు దిగుతుందని వారికి ప్రజలే బుద్ధి చెబుతారని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని మంత్రి మనోహర్ విమర్శించారు.విలువలతో కూడిన రాజకీయాలు చేయాలనే ఉద్దేశంతోనే జనసేన పార్టీని పవన్ కళ్యాణ్ స్థాపించారు. పార్టీ స్థాపించిన దశాబ్ద కాలంలో ఏనాడు రాజ్యాంగానికి విరుద్ధంగా కార్యక్రమాలు చేపట్టలేదు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఉపయోగపడే విధంగానే పార్టీ కార్యక్రమాలు చేస్తున్నాము. కులాలను కలిసే ఆలోచనా విధానం అనే సిద్ధాంతం కేవలం జనసేన పార్టీలోనే ఉంది. మచిలీపట్నంలో జరిగిన చిన్న వివాదానికే ఫోన్ చేసి పరామర్శించిన జగన్.. నాడు దళిత యువకుడు డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని చంపి డోర్ డెలివరి చేసినప్పుడు ఎందుకు ఆ కుటుంబానికి ఫోన్ చేసి పరామర్శించలేదు? మాజీ మంత్రి విశ్వరూప్ ఇంటిపై దాడి జరిగినప్పుడు ఎందుకు ఫోన్ చేయలేదు? డాక్టర్ సుధాకర్ ను ఇబ్బంది పెట్టినప్పుడు ఎందుకు ఫోన్ చేసి పరామర్శించలేదు? అప్పుడు ఫోన్లు పని చేయలేదా?ఇప్పుడు ఫోన్ చేసి మన ప్రభుత్వం వస్తుంది. వచ్చినప్పుడు వాళ్ల సంగతి తేలుద్దాం అని బెదిరించడం ఎంత వరకు సబబు? మరో వైపు ప్రెస్ మీట్ పెట్టి కాంట్రాక్టర్లను బెదిరిస్తారు.గంజాయి మత్తులో పక్కదారిపడుతున్న యువతను దారిలో పెట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తే రాష్ట్రంలో శాంతిభద్రతలు దారి తప్పాయని నానా యాగి చేస్తారు. ప్రజలు కోరుకుంటున్నది రాష్ట్ర అభివృద్ధి, ప్రశాంతమైన వాతావరణంశాంతిభద్రతల విషయంలో కూటమి ప్రభుత్వం రాజీపడే ప్రసక్తే లేదని ఎవరూ తప్పు చేసినా చట్టం ముందు నిలబెడతాం. సోషల్ మీడియాను వాడుకొని రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో చిచ్చు పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తున్నారు. జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు షేక్ ఇస్మాయిల్, జాకీర్ హుస్సేన్,హరిదాసు గౌరీశంకర్, నన్నపనేని రాంబాబు,కోట అక్కేశ్వరరావు,పలువురు కార్యకర్తలు,వీర మహిళలు పెద్ద ఎత్తున జనసైనికులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని మంత్రి నాదెండ్లకు ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి

తెనాలి టౌన్ సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు, రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కి వినతిపత్రం అందజేశారు. ఆదివారం పట్టణంలోని మంత్రి నాదెండ్ల క్యాంపు కార్యాలయం నందు ఉపాధ్యాయ సంఘం నాయకులు తమ సమస్యల పరిష్కారానికై కృషి చేయవలసిందిగా కోరుతూ వినతి పత్రం అందించారు. సిపిఎస్ ను రద్దు చేయాలని, మెమో 57ను అమలు చేయాలని




కోరారు.అలాగే 12వ పిఆర్సి కమిషన్ నియమించి,ఐఆర్ ను తక్షణమే ప్రకటించాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి, పరిష్కార మార్గం చూపాలని వారు కోరారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ప్రశాంతంగా హిందీ పరీక్షలు

తెనాలి టౌన్ సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త): దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో నిర్వహించే వార్షిక హిందీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని కొత్తపేటలో గల రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హై స్కూల్లో నిర్వహించిన,హిందీ పరీక్షల్లో ప్రాథమిక,మద్యమిక,రాష్ట్ర భాష,ప్రవేశిక, ప్రిలిమినరీ, పరీక్షలను ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించారు.ఈ పరీక్షలకు పట్టణం నుండే కాకుండా ఇతర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున విద్యార్థిని,విద్యార్థులు హాజరయ్యారు.ఈ పరీక్షా కేంద్రంలో 230 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరైనట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. పరీక్ష పూర్తయ్యే వరకు విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్షా కేంద్రం వెలుపలే ఉండి తమ పిల్లలను దగ్గరుండి తీసుకువెళ్లారు.



## సత్తెనపల్లి - అమరావతి మధ్య నిలిచిన రాకపోకలు



సత్తెనపల్లి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : సత్తెనపల్లిలో శనివారం కురిసిన భారీ వర్షంతో సత్తెనపల్లి - అమరావతి వెళ్ళే రహదారిలో గుడిపూడి వాగు పొంగి పొర్లుతోంది. బ్రిడ్జి పై నుంచి నీరు ప్రవహించడంతో సత్తెనపల్లి నుండి అమరావతి వెళ్ళే వాహనాలు పూర్తిస్థాయిలో ఆగిపోయాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. గతంలో కూడా గుడిపూడి వాగుపై ప్రయాణం కొనసాగించిన సమయంలో ద్విచక్ర వాహనాలు వాగులో కొట్టుకుపోయాయి. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలియజేశారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



సత్తెనపల్లి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : మండలంలోని భీమవరం గ్రామస్తులు యంపోగు మరియదాసు అనారోగ్య కారణంగా కనుమూశారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు మల్లి మరియదాసు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మరియదాసు మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం బాధిత కుటుంబానికి మల్లి ఆర్థిక సహాయం అందించారు.

## భోజన ప్యాకెట్ల పంపిణీ



సత్తెనపల్లి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో భోజన ప్యాకెట్ల పంపిణీని స్థానిక తాలూకా సెంటర్‌లో షేక్. ఖజా మున్నా దంపతుల ఆర్థిక సహాయంతో పేదలకు ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ పిల్లుట్ల ఆంజనేయులు మాట్లాడుతూ ఇప్పటికే ఈ సంస్థ ఆధ్వర్యంలో చాలా మంది సేవా కార్యక్రమాలు చేపట్టారని, మున్ముందు మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పేదలకు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ కుమ్మరి దస్తగిరి, సభ్యులు పిక్కిలి రత్తయ్య, మల్లా వెంకటేశ్వర్లు, క్యాలిబర్ జానీ, పి. శివ తదితరులు పాల్గొన్నారు.

## వీరవల్లి వంశీకి శుభాకాంక్షలు తెలిపిన జనసేన నాయకులు



సత్తెనపల్లి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పోరేషన్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన వీరవల్లి వంశీ ప్రసన్నకుమార్ కు సత్తెనపల్లి 20వ వార్డు జనసేన నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో వంశీ మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. వారికి రాష్ట్ర డైరెక్టర్ వీరవల్లి వంశీ కృతజ్ఞతలు తెలిపారు.

## నియోజకవర్గంలో నిషేధిత భూముల జాబితా ప్రకటించాలి




సత్తెనపల్లి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : సత్తెనపల్లి నియోజకవర్గంలోని నిషేధిత 22ఎ భూముల జాబితా వివరాలు ప్రకటించాలని న్యాయవాది నరిశేటి వేణుగోపాల్ కోరారు. ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణంతో పాటు రాజుపాలెం, ముప్పాళ్ళ, నకరికల్లు మండలాల రిజిస్ట్రేషన్, రెవిన్యూశాఖ కార్యాలయాల పరిధిలో నిషేధిత జాబితా 22ఎ లో ఉన్న జాబితాను ఇవ్వడం వలన ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. అటవీ, దేవాదాయ, వక్ఫ్‌బోర్డు, ప్రభుత్వ బంజరు, వాగులు, కుంటలు, చెరువులు, పోరంబోకు జాబితాను తెలియజేయాలన్నారు.

## రోడ్లను ధ్వంసం చేస్తున్న దమ్ము ట్రాక్టర్లు!

పెదకూరపాడు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : మండలంలోని 75 తాళ్ళూరు పరిసర ప్రాంతాల్లో మాగాణి వేసిన పంట పొలాల్లో దమ్ము చేసేందుకు వచ్చే ట్రాక్టర్లు రోడ్లపై తిరగడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయని స్థానికక ప్రజలు ఆరోపిస్తున్నారు. పంట పొలం వద్దకు వెళ్ళి దమ్ము చక్రాలను బిగించుకొని దమ్ము చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ట్రాక్టర్ల యాజమాన్యాలు రోడ్లపై దమ్ము



ట్రాక్టర్‌లతో సజావుగా ప్రయాణం చేస్తున్నారని ప్రజలు అంటున్నారు. అలాంటి వారిపై తగు చర్యలు చేపట్టి రోడ్లను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న హల్దిపూర్ మఠాధిపతి



అమరావతి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త : పవిత్ర పుణ్యక్షేత్రమైన అమరావతి ఆర్యవైశ్య కులదేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానానికి వైశ్యకుల గురువు పరమ పూజశ్రీ శ్రీ వామనాశ్రమం మహాస్వామి వైశ్యపీఠం వారణాసి హల్దీపూర్ (కర్ణాటక) మఠాధిపతిస్వామిజీ అమరావతి అమ్మవారి గుడిని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు పారేపల్లి పుష్పలత రాధాకృష్ణ దంపతులు అమరావతి ఆర్యవైశ్యులు, మహిళలు, భక్తులందరూ స్వామివారిని దర్శించి స్వామి వారి ఆశీస్సులు తీసుకొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## అసైన్ మెంట్ పరీక్షల పుస్తకాలపై విద్యా శాఖ పున: సమీక్షి ంచాలి

గుంటూరు విద్య, ప్రభాతవార్త : ఈ విద్యా సంవత్సరంలో పరీక్షలు కోసం విద్యా శాఖ ప్రవేశ పెట్టిన అసైన్ మెంట్ పరీక్షల పుస్తకాలపై పున: సమీక్షి ంచాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు ప్రభుత్వాన్ని కోరారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గుంటూరు నగర శాఖ కార్యవర్గం లక్ష్మీ ృపురం లోని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కార్యాలయం లో గుంటూరు జిల్లా అధ్యక్షులు పి. సాయి విశ్వనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్/ కార్పొరేషన్ పాఠశాలలో అన్ని కేడర్ లలో 4400 పోస్టులు మంజూరు చేయడం అభినందనీయమని, గుంటూరు నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో మొట్టమొదటి సారిగా 42 ప్రాథమిక ప్రధానోపాధ్యాయులు పోస్టులు మంజూరు చేయడం హర్షించ దగిన విషయమని, డి ఎస్ సి 2025 కేవలం 4 నెలలో భర్తీ ప్రక్రియ పూర్తి చేయడం చాలా గొప్ప విషయం అని, ప్రభుత్వం 12 వ పి ఆర్ సి కమిషన్ ఏర్పాటు చేయాలని, త్వరలో దసరా పండుగ కానుకగా ఒక డి ఏ నీ ప్రకటిస్తే బాగుంటుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గుంటూరు నగర శాఖ నూతన కమిటీ ఏకగ్రీవం గా ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులు: కె. వేణుగోపాల్, అధ్యక్షులు: కె. వీర రాఘవలు, ప్రధాన కార్యదర్శి: టి. శ్రీనివాస రావు, ఆర్థిక కార్యదర్శి: షేక్ రషీద్ , అసోసియేట్ అధ్యక్షులు:(1) ఎస్. వెంకటేశ్వర్లు , ఎస్.నాగ రాజు, జి ఎస్ ఎస్. ప్రసాద్ అదనపు ప్రధాన కార్యదర్శులుగా కె . పూర్ణ చంద్రరావు, ఏ వి.కృష్ణా రావు, టి. పూర్ణ కుమార్ ఉపాధ్యక్షులు: ఎం. రాములు నాయక్, ఎన్.క్రీస్తు రాజు, ఎ.వెంకటేశ్వర రావు కార్యదర్శులు టి . రవి, ఎస్.కె.సుభాని , జి.టి. సుధీర్ కుమార్ లను ఎన్నుకున్నారు.ఈ సమావేశం లో రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. భాస్కర రావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పి. లలిత బాబు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## మహంకాళి అమ్మవారి ఆలయ నూతన నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళం

నరసరావుపేట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ నూతన నిర్మాణానికి భక్తులు రూ. 5,01,116లను విరాళంగా అందజేశారు. వివరాలను ఆదివారం ఆలయ కార్య నిర్వహణాధికారి నలబోతు మాధవిదేవి తెలియజేశారు. నరసరావుపేట పట్టణానికి చెందిన వెంకట సాంబశివ జ్యూయలర్స్ అండ్ డైమండ్స్ అధినేత సాతులూరు శివకుమార్ - లక్ష్మి దంపతుల కుమారుడు సంతోష్ - గాయత్రి, రెండవ కుమారుడు చైతన్య శంకరనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొని విరాళం అందించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వారికి ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రం అందజేశారు. భక్తులు అందించే విరాళాలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని, నూతన ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని ఈవో మాధవిదేవి కోరారు.



## ఒకే రోజు కలెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన భార్య భర్తలు



నరసరావుపేట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : ఏపిలో ఒకే రోజు కలెక్టర్లుగా ఉద్యోగ బాధ్యతలను భార్యభర్తలు స్వీకరించిన అరుదైన సంఘటన చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఈ దృశ్యం ప్రథమంగా చెప్పుకోవచ్చు. వివరాల్లోకి వెళ్తే. పల్నాడు జిల్లా కలెక్టర్‌గా కృతికాశుక్లా, నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా హిమాన్షు శుక్లాలు ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. కాగా 2013 బ్యాచ్‌కు చెందిన వారు భార్యభర్తలు. ఒకరు ఉత్తరప్రదేశ్‌కు, మరొకరు హర్యానాకు చెందినవారు. గతంలో వారు జాయింట్ కలెక్టర్లుగా, వివిధశాఖల అధిపతులుగా విధులు నిర్వహించారు. వారికి ఒకేసారి కలెక్టర్లుగా రాష్ట్ర ప్రభుత్వం అరుదైన అవకాశాన్ని కల్పించింది.

## పల్నాడు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారావు



నరసరావుపేట క్రైం, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా నూతన ఎస్పీగా బి.కృష్ణారావు ఆదివారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నేరాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు వేగంగా న్యాయం అందించే దిశగా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీస్‌శాఖలో క్రమశిక్షణ, జవాబుదారీతనం, పారదర్శకత, ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్‌శాఖ పట్ల ప్రజల్లో నమ్మకం పెంచుతామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేర నియంత్రణకు కృషి చేసేందుకు తగిన చర్యలు చేపడతామని ఎస్పీ బి.కృష్ణారావు తెలియజేశారు. తొలుత ఆయన పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు.

## స్వచ్ఛ నరసరావుపేటే లక్ష్యంగా ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నరసరావుపేట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : స్వచ్ఛ నరసరావుపేటే లక్ష్యంగా ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని 10వ వార్డు పరిధిలో ఉన్న వివిధ ప్రాంతాలలో నిర్వహించిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు పాల్గొన్నారు. బస్టాండ్ వెనుక ఉన్న పలు వీధుల్లోని డ్రైన్‌లలో సిల్ట్ తొలగించారు. అదే విధంగా కాలువలలో గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించారు. నివాసితులు పారిశుద్ధ్య కార్యక్రమాలకు సహకారం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఈ సందర్భంగా కోరారు.

## టిడ్కో, జగనన్న కాలనీలలో కనీస వసతులు కల్పించాలి : మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : టిడ్కో, జగనన్న కాలనీలలో కనీస వసతులు కల్పించాలని వైకాపా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమాన్ని టిడ్కో, జగనన్న కాలనీలలో నిర్వహించారు. స్థానికులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్ళకు వెళ్ళేందుకు దారిలో వీధి దీపాలు లేకపోవడంతో దొంగతనాలు పెరిగాయన్నారు. పాములు, విష పురుగులతో స్థానిక ప్రజలు భయాందోళనలో ఉన్నట్లు తెలిపారు. మంచినీరు లేకపోవడంతో కిలో మీటర్ల దూరం వెళ్ళి తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా వీధికి ఒక కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. బోరింగ్ పంపులు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వర్షం పడితే నివాసితుల పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. పురపాలక సంఘ పరిధిలో ఉన్నప్పటికీ టిడ్కో, జగనన్న కాలనీలను ఏ మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి కాలనీలు ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ ఉండే ప్రజలకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రూ.15 కోట్లు మౌలిక వసతుల ఏర్పాటుకు వైకాపా ప్రభుత్వ పాలనలో కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు. రైల్వేట్రాక్‌కు కాంపౌండ్‌వాల్ లేకపోవడంతో ఇద్దరు చనిపోయారని తెలిపారు. పార్కు ఉన్నప్పటికీ అది అడవిని తలపిస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం మేల్కొని టిడ్కో, జగనన్న కాలనీలలో వసతులు కల్పించాలని వైకాపా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు.



## నాణ్యమైన, నమ్మకమైన బంగారు ఆభరణాలను అందిస్తాం : కపలవాయి

నరసరావుపేట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : భారతదేశం అంతటా నాణ్యమైన, నమ్మకమైన బంగారు ఆభరణాలను అందిస్తామని ఏపి బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్ అన్నారు. తిరుపతి నందు జరిగిన అసోసియేషన్ సమావేశంలో హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ కోడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ డైరెక్టర్ ఆదేశాల మేరకు 26 జిల్లాలలో 70 అసోసియేషన్‌ల నుండి 350 మంది ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్లు ఈ కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. యాభై వేల షాపు యాజమాన్యాలకు అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. నవంబర్ 21,22,23 తేదీలలో విజయవాడలో జ్యూయలరీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని ఏపి బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్ తెలియజేశారు. ఈ సమావేశంలో శాంతిలాల్ జైన్, కె.వి.సత్యనారాయణ, జితేంద్రకుమార్ తదితర రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



## కాలువలో గల్లంతైన బాలుని మృతదేహం లభ్యం

నకరికల్లు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : మండలంలోని కుంకలగుంట గ్రామంలోని కాలువలో పడి శనివారం గల్లంతైన బాలుని మృతదేహాన్ని ఆదివారం కనుగొన్నారు. రెండేళ్ళ బాలుని భౌతికదేహం రైల్వేస్టేషన్ సమీపంలోని పంట కాలువలో భౌతికదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. బాలుడు ఇంటి బయట ఆరుగు పై కూర్చొని ఉండగా ప్రమాదవశాత్తు కాలువలో పడి కొట్టుకుపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## రోటరీక్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండకు ప్లాటినం హోదా సర్టిఫికెట్

వినుకొండ, సెప్టెంబర్14, ప్రభాతవార్త: రోటరీక్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ప్లాటినం హోదా సర్టిఫికెట్ సాధించింది. హైదరాబాద్‌లో జరిగిన




రోటరీ జిల్లా 3150 మెంబర్‌షిప్ కాంక్లేవ్ సుపధం సమావేశంలో అప్రిషేషన్ అవార్డుల్లో భాగంగా ప్లాటినం హోదా సర్టిఫికెట్‌ను రోటరీ జిల్లా గవర్నర్ చేతుల మీదుగా రోటరీక్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ అధ్యక్షులు యేరువ వెంకట నారాయణ అందుకోవడం జరిగింది. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మురళీ, క్లబ్ రీజనల్ ఛైర్మన్ ఆలా శ్రీనివాసరావు, డైరెక్టర్ గుత్తా గురునాధం, కూచి రామాంజనేయులు, గుట్టుపల్లి యువ ప్రసాద్, సభ్యులు నాగేంద్రుడు మాష్టారు, కాళ్ళ వికెఎస్ విజయ్‌కుమార్, గాలి చిన్న కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మాలల రణభేరి సభను జయప్రదం చేయాలి



వినుకొండ, సెప్టెంబర్14, ప్రభాతవార్త: తెలుగు రాష్ట్రాల్లో మాలలకు జరుగుతున్న అన్యాయంపై జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య ఆధ్వర్యంలో నవంబర్ 2వ తేదిన రణభేరి సభను ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర అధ్యక్షులు కొమ్మతోటి పౌలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన ద్వారా సభను విజయవంతం చేయాలని మాలలకు పిలుపునిచ్చారు.

## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిది: చీఫ్‌విప్ జీ.వీ, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన

### 204 మందికిగాను రూ 1.20కోట్లు చెక్కులు పంపిణీ

వినుకొండ, సెప్టెంబర్14, ప్రభాతవార్త: సీఎం రిలీఫ్ ఫండ్ ఆపదలో ఉన్న పేదలకు వరం లాంటిదని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేట




నందు గల చీఫ్‌విప్ కార్యాలయం నందు నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులైన 204 మందికిగాను రూ 1.20కోట్లు చెక్కులు జీ.వీ, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన అందజేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. గత వైకాపా పాలనలో సీఎంఆర్ఎఫ్ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. పేదలకు మంచి చేసే ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారాలు చేయడం తగదన్నారు. రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఐదేళ్ళ వైకాపా పాలనలో వినుకొండ నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలోనే గ్రామాల్లో రోడ్లు, సైడు కాల్వలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేసి మంచి ప్రభుత్వంగా గుర్తింపు పొందామన్నారు. సీఎం చంద్రబాబు సుపరిపాలనలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ పర్యటన

నరసరావుపేట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆదివారం నియోజకవర్గంలో పర్యటించారు. రొంపిచర్ల మండలంలోని సంతగుడి పాడు గ్రామంలో వర్ల వెంకాయమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే అర వింద్‌బాబు



పరామర్శించారు. ఆమె మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదే విధంగా గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.

## మీ కోసం కాల్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్ కృతిక శుక్లా

నరసరావుపేట, సెప్టెంబరు14 ప్రభాతవార్త : మీ కోసం కాల్ సెంటర్ 1100సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదివారం జిల్లా ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15న సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోతే తమ ఫిర్యాదులకు సంబంధించి సమాచారం తెలుసుకోవటానికి 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి యొక్క ఆర్జీలు నమోదు చేసుకునేందుకు మీ కోసం డాట్ ఏపి డాట్ జిఓవి డాట్ ఇన్ వెబ్ సైట్‌ను వినియోగించుకోవలన్నారు. అర్జీ ఇచ్చే సమయంలో కరెక్ట్‌గా దానిని పూరించాలని సూచించారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును వెంట తీసుకుని రావాలని కలెక్టర్ కృతిక శుక్లా కోరారు.

## నవభారత నిర్మాణంలో స్కాట్ విద్యార్థులు

నరసరావుపేట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : శంకరభారతీపురం జెడ్పీ పాఠశాలలో ఆదివారం హోలీఫ్యామిలీ విజన్ స్కూల్, గోళ్ళపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు 80 మంది రెండు రోజులు శిక్షణా తరగతులలో పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం పార్వతీ జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. దేశ నిర్మాణంలో స్కాట్స్ అండ్ గైడ్స్ తమ దేశభక్తిని, సేవా భావాన్ని, నాయకత్వ లక్షణాలతో ముందుకు తీసుకెళ్ళాలన్నారు. తుఫాన్‌లు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు వంటి విపత్కర పరిస్థితులలో సహాయక చర్యలు చేపడతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మామిళ్ళ కృష్ణయ్య, ట్రైనర్ బి.శివనాగిరెడ్డి, మానవవనరుల కమిషనర్ పమ్మి వెంకటరెడ్డి, జిల్లా శిక్షణా కమిషనర్ ఎస్.అచ్చిరెడ్డి, ఆర్గనైజింగ్ కమిషనర్ శ్రీనివాసరావు, పద్మావతి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ పంపిణీ

గుంటూరు విద్య. ప్రభాతవార్త: గుంటూరు స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అవొప రాష్ట్ర అధ్యక్షులు తటవర్తి రాంబాబు అధ్యక్షతన ఆదివారం ప్రతిభ కలిగిన 240 మంది పేద విద్యార్థులకు 45 లక్షల రూపాయల స్కాలర్షిప్లు పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు పాల్గొని స్కాలర్షిప్లు పంపిణీ చేసినారు . బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థానానికి వచ్చి తల్లిదండ్రులకు సమాజానికి ఉపయోగపడాలని తెలిపినారు. కాంతారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకొని ఉద్యోగాల కోసం కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి మనం ఎదగాలని తెలిపినారు. అవొప నగర అధ్యక్షులు కేవీ బ్రహ్మం మాట్లాడుతూ 45 లక్షల రూపాయల స్కాలర్షిప్ పంపిణీ కార్యక్రమం గుంటూరులో నిర్వహించటం అభినందనియమని తెలిపినారు. అవొప ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ గార్లపాటి సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే సంవత్సరం దాతల సహకారంతో కోటి రూపాయలు స్కాలర్షిప్లు ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపినారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, పువ్వాడ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, పొట్టి శ్రీరాములు. చింతా కృష్ణారావు, అవొప రాష్ట్ర మహిళా విభాగం చైర్మన్ నిర్మల, రాధాకృష్ణయ్య, మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్ తదితరులు పాల్గొన్నారు

15-9Pg5 9_15-9Pg5.qxd 9/15/2025 12:48 AM Page 1





# వలసలపై లండన్‌లో భారీ నిరసనలు

## మరోవైపు వలసదారులకు మద్దతుగా ర్యాలీలు
## హింసాత్మకంగా మారిన లండన్ వీధులు



**లండన్, సెప్టెంబరు 14:** యునైటెడ్ కింగ్‌డమ్ రాజధాని లండన్‌లో శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫార్‌రైట్ కార్యకర్త టామీ రాబిన్‌సన్ నిర్వహించిన యునైట్ ది కింగ్‌డమ్ ర్యాలీ హింసాత్మకంగా మారింది. వలస విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఈ ప్రదర్శనలో నిరసనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు.

ఈ ఘటనల్లో 26 మంది పోలీసు అధికారులు గాయపడగా, 25 మందిని అరెస్ట్ చేశారు. మెట్రోపాలిటన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ర్యాలీకి ఊహించిన దానికంటే చాలా ఎక్కువ సంఖ్యలో సుమారు 1.10లక్షల నుంచి 1.5 లక్షల మంది ప్రజలు హాజరయ్యారు. ప్రదర్శన చివరి దశలో కొంతమంది నిరసనకారులు అదు పుతప్పి పోలీసులపై బాటిళ్లు విసిరి దాడులకు పాల్పడ్డారు. ప్రత్యర్థి వర్గాల నిరసనకారులను వేరుచేయడానికి ఏర్పాటు చేసిన బారికేడ్లను ఛేదించడానికి ప్రయత్నించారు. ఈ దాడుల్లో నలుగురు అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరికి పళ్లు విరగగా, మరొకరికి వెన్నెముకకు గాయమైందని, ఇంకొకరికి ముక్కు విరిగి ఉండొచ్చని అధికారులు తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అదనపు బలగాలను మోహరించాల్సి వచ్చింది. టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ఓ వీడియోలో మాట్లాడుతూ భారీగా, అనియంత్రితంగా వస్తున్న వలసలతో బ్రిటన్ నాశనమవుతోందని వ్యాఖ్యానించారు. మా దేశాన్ని మాకు తిరిగి ఇవ్వండి, పడవలను ఆపండి వంటి ప్లకార్డులతో నిరసనకారులు కవాతు నిర్వహించారు. ఇదే సమయంలో స్టాండ్ అప్ టు రేసిజం సంస్థ ఆధ్వర్యంలో సుమారు 5,000మందితో వలసదారులకు మద్దతుగా మరో ప్రదర్శన కూడా జరిగింది. వేల మంది నగర వీధుల్లోకి వచ్చి తమ నిరసనలను తెలియజేశారు. ఒకవైపు వలసదారులపై వ్యతిరేకతను వ్యక్తంచేస్తూ ఆందోళనలు జరగగా మరోవైపు జాత్యహంకారాన్ని ఖండిస్తూ 'స్టాండప్ టు రేసిజమ్' అనే నినాదంతో మరో ర్యాలీ జరిగింది. ఈ రెండు ర్యాలీల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు భారీఎత్తున మోహరించారు.

అయినప్పటికీ ర్యాలీలు హింసాత్మకంగా మారడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. లండన్ వీధుల్లో వలసదారుల వ్యతిరేక ర్యాలీలో వేలమంది పాల్గొన్నారు. వలసలవల్ల తమ దేశంలో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని వారు ఆందోళనవ్యక్తంచేశారు. ఈ నిరసనకారులు తమ డిమాండ్లను గట్టిగా వినిపించడానికి నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకుని నగరంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ తీశారు. కానీ ఈ ర్యాలీలో కొంతమంది నిరసనకారులు హద్దులు దాటడంతో హింసాత్మకంగా మారింది. పోలీసులపై వాటర్ బాటిళ్లు, రాళ్లు రువ్వారు. దాంతో పోలీసులు 26 మందిని అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో నగరంలో మరో నిరసన ర్యాలీ కూడా జరిగింది.

స్టాండ్ అప్ టు రేసిజమ్ అనే సంస్థనాయకత్వంలో జాత్యహంకారానికి వ్యతిరేకంగా 5వేల మంది ర్యాలీలో పాల్గొన్నారు. సమాజంలో సమానత్వం, ఐక్యతను ప్రోత్సహించాలని నిరసనకారులు కోరారు. వివిధ జాతులు, సంస్కృతుల ప్రజలు ఒకే దేశంలో సామరస్యంగా జీవించాలని పిలుపునిచ్చారు. శాంతియుతంగా తమ నిరసనను తెలియజేశారు. ప్లకార్డులు, బ్యానర్‌లు పట్టుకుని, నినాదాలు చేస్తూ, జాత్యహంకార వివక్షను ఖండిస్తూ ముందుకు నడిచారు.



# భారత్ పాకిస్థాన్ మ్యాచ్‌కు నిరసనగా టీవీల ధ్వంసం

## భారీ ఆందోళనలు జరిపిన శివసైనికులు

**ముంబయి, సెప్టెంబరు 14:** ఆసియా కప్ 2025లో భాగంగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య ఆదివారం జరగనున్న క్రికెట్ మ్యాచ్ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ మ్యాచ్ ను వ్యతిరేకిస్తూ శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే వర్గం) పార్టీ కార్యకర్తలు ముంబైలో ఆందోళన చేపట్టారు. పార్టీ అధికార ప్రతినిధి ఆనంద్ దూబే నేతృత్వంలో నిరసనకారులు టీవీ సెట్లను పగలగొట్టి, కేంద్ర ప్రభుత్వానికి, బీసీసీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆనంద్ దూబే మాట్లాడుతూ, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశమని, అలాంటి దేశంతో అన్ని రకాల సంబంధాలను తెంచుకోవాలని డిమాండ్ చేశారు. మ్యాచ్ నిర్వహణకు అనుమతి ఇవ్వడం ద్వారా మోదీ ప్రభుత్వం మన సోదరీమణుల సిందూరాన్ని అవమానిస్తోందని తీవ్రంగా ఆరోపించారు. దీనికి గుర్తుగా మహిళా కార్యకర్తలు చేతిలో సిందూరం పట్టుకుని నిరసన తెలిపారు. దుబాయ్ లో జరగనున్న ఈ మ్యాచ్ ను మేము వ్యతిరేకిస్తున్నాం. ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని భారత ప్రభుత్వాన్ని కోరుతున్నామని దూబే అన్నారు. పహల్గామ్ లో తమ ఆప్తులను కోల్పోయిన సోదరీమణులు, తల్లులు ఈ మ్యాచ్ ను ఎలా చూడగలరని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీ ఈ మ్యాచ్ ను ఆపాలి వారి మనోభావాలతో ఆడుకోవద్దు, బీసీసీఐకి, జైషాకు తమ తప్పు తెలిసేలా విరాళాలు పంపుతున్నామని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత క్రికెటర్లు కూడా ఈ మ్యాచ్ ను బహిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఆటగాళ్లు ఈ మ్యాచ్ ను బహిష్కరిస్తే, మేము వారికి అండగా నిలుస్తాం. అలా కాకుండా ఆడితే మాత్రం, వారి తీరును కూడా ఖండిస్తామని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ నిరసనల మధ్య, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భారత కాలమానం ప్రకారం రాత్రి 8:00 గంటలకు భారత్‌పాకిస్థాన్ మ్యాచ్ ప్రారంభం కానుంది.

# యుద్ధాల ఆంక్షలతో సమస్యలు పరిష్కరించలేరు

## చైనా తీవ్ర స్పందన



**బీజింగ్, సెప్టెంబరు 14:** తమ దేశంపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనపై చైనా తీవ్రంగా స్పందించింది. యుద్ధాలు, ఆంక్షల ద్వారా సమస్యలను పరిష్కరించలేమని, అవి పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తాయని గట్టిగా బదులిచ్చింది. వివాదాస్పద అంశాల పరి ష్కారానికి శాంతియుత చర్చలకే తాము కట్టుబడి ఉన్నామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పష్టం చేశారు. స్లోవేనియా పర్య టనలో భాగంగా ఆ దేశ ఉప ప్రధాని తాన్యా ఫజోన్‌తో సమావేశం అనంతరం వాంగ్ యీ విలేకరులతో మాట్లాడారు. చైనా ఎప్పుడూ యుద్ధాలలో పాల్గొనదు, వాటిని ప్రోత్సహిం చదు. చర్చల ద్వారా రాజకీయ పరిష్కారాలను ప్రోత్సహిం చడమే మా విధానం అని అన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ సమాజం గందరగోళం, ఘర్షణలతో నిండి ఉందని, ఈ సమయంలో బహుళపాక్షిక విధానాలను బలోపేతం చేయాల్సి న అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. చైనా, యూరప్‌లు ప్రత్యర్థులుగా కాకుండా మిత్రులుగా ఉండాలని ఆయన పిలుపు నిచ్చారు. అంతకుముందు, డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం ముగిసే వరకు నాటో కూటమి చైనాపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలి. రష్యాపై చైనాకు బలమైన పట్టు ఉంది. ఈ భారీ సుంకాలు ఆ పట్టును విచ్ఛిన్నం చేస్తాయి. తద్వారా ఈ భయంకరమైన యుద్ధానికి ముగింపు పలకవచ్చు అని ట్రంప్ పోస్ట్ చేశారు. గతంలో కూడా ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. అమెరికాకు వ్యతిరేకంగా జిన్‌పింగ్ కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. అయితే, ఆసక్తికరంగా, ఈ ఆరోపణలు చేసిన కొన్ని గంటలకే చైనా నాయకత్వంతో తన వ్యక్తిగత సంబంధాలు చాలా బాగున్నాయని చెప్పడం గమనార్హం.

# మోడీ మణిపూర్ పర్యటన కంటితుడుపు చర్యే

## ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** కల్లోలిత మణిపూర్‌లో ప్రధాని పర్యటన కేవలం ఒక పిట్‌స్టాప్ వంటిది మాత్రమేనని ఎఐసిసి అధ్యక్షుడుఖర్గే వాదించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. మోదీ పర్యటన కేవలం ఒక పిట్ స్టాప్ (చిన్న విరామం) మాత్రమేనని ఇది రాష్ట్ర ప్రజలకు తీవ్ర అవమానం అని ఘాటుగా వ్యాఖ్యానించారు. చురాచంద్‌పూర్, ఇంఫాల్‌లలో పర్యటించడానికి వచ్చిన మోదీపై ఖర్గే సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడ్డారు. నరేంద్ర మోదీ గారు.. మణిపూర్‌లో మీ 3 గంటల పర్యటన కనికరం కాదు. ఇది ఒక ప్రహసనం. కేవలం ప్రదర్శన కోసం మాత్రమే. రిలీఫ్ క్యాంప్‌లలోని ప్రజల రోదనలు వినకుండా పారిపోవడమే మీ ఉద్దేశ్యం అని ఆయన పోస్ట్ చేశారు. అక్కడితో ఆగకుండా హింస మొదలైన ఈ 864 రోజుల్లో 300 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. మొత్తంగా 67,000 మంది నిరాశ్రయులు అయ్యారని చెప్పారు. అంతేకాకుండా 1,500 మందికి పైగా గాయపడ్డారని తెలిపారు. ఈ సమయంలో మీరు 46 విదేశీ పర్యటనలు చేశారని కానీ సొంత ప్రజలను పరామర్శించడానికి ఒక్కసారి కూడా రాలేదని ఖర్గే అన్నారు. మీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మణిపూర్‌లోని అమాయక ప్రజల జీవితాలను బుల్డోజ్ చేసిందంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు. అలాగే ప్రధాని, హోం మంత్రి అమిత్ షా అసమర్థత, కుమ్మక్కు కారణంగానే రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రపతి పాలన విధించడం ద్వారా ఈ సమస్యను కప్పిపుచ్చుకోవాలని చూశారని ఆరోపించారు. ఈ విషయంలో మీ రాజధర్మం ఎక్కడ కనిపిస్తుందో చెప్పాలంటూ ఖర్గే ప్రశ్నలు సంధించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ప్రధాని ఇంతకుముందే రాష్ట్రానికి వచ్చి ఉండాల్సిందని అన్నారు. రెండు సంవత్సరాల తర్వాతనైనా ఆయన మణిపూర్‌ను సందర్శించడానికి నిర్ణయించుకోవడం సంతోషం. ప్రధాని మోదీ తన పర్యటనలో నిరాశ్రయులైన ప్రజలతో మాట్లాడారు. అలాగే రూ.8,500 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మణిపూర్‌లో మైతేయ్, కుకి వర్గాల మధ్య భూ హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై మే 2023 నుంచి ఘర్షణలు జరుగుతున్నాయి.

## జెన్‌జడ్ ఉద్యమంలో మృతులకు 'అమరవీరుల హోదా'

## నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కర్కి

**ఖాట్మండు, సెప్టెంబరు 14:** జెన్‌జడ్ యువత చేపట్టిన భారీ ఆందోళనల కారణంగా కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం కుప్పకూలిన కొన్ని రోజులకే ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి తాజాగా కీలక ప్రకటనలు చేశారు. తమ ప్రభుత్వం కేవలం ఆరు నెలల పాటే అధికారంలో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సుశీల కర్కి మాట్లాడుతూ తానుగానీ, తన బృందం గానీ అధికారాన్ని రుచి చూడటానికి ఇక్కడికి రాలేదు. ప్రజలకు సేవ చేయడానికే బాధ్యతలు చేపట్టాం. ఆరు నెలలకు మించి ఒక్క రోజు కూడా అధికారంలో కొనసాగం. కొత్తగా ఎన్నికయ్యే పార్లమెంటుకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. దేశ పునర్నిర్మాణానికి ప్రజలందరి సహకారం అవసరమని, వారి మద్దతు లేకుండా తాము విజయం సాధించలేమని అన్నారు. ఇటీవల జరిగిన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అధికారికంగా 'అమరవీరులు'గా గుర్తిస్తామని కర్కి హామీ ఇచ్చారు. ఇది ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వం ఇస్తున్న గౌరవంగా భావిస్తున్నారు. అదే సమయంలో నిరసనల సందర్భంగా జరిగిన విధ్వంసకర ఘటనలపై విచారణ జరిపిస్తామని ఆమె స్పష్టం చేశారు. అధికారం కోసం కాకుండా దేశాన్ని తిరిగి గాడిన పెట్టడానికే తాము వచ్చామని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నేపాల్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# మా కన్నీళ్లు ఆరకముందే పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లా..

## పహల్గావ్ బాధితుల ఉద్వేగం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** తమ కన్నీళ్లు ఇంకా ఆరిపోలేదని పహల్గామ్ బాధిత కుటుంబాలు వాపోయాయి. భారత్‌పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్‌ను బహిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్ పహల్గామ్‌లోని బైసరన్ మైదానంలో పాక్ ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో పర్యాటకులతో సహా 26 మంది మరణించారు. ఈ సంఘటన నేపథ్యంలో పాకిస్థాన్‌తో భారత్ అన్ని విధాలా తెగదెంపులు చేసుకున్నది. మేలో ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ సైనిక చర్య చేపట్టింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన తర్వాత సుమారు ఐదు నెలలకు ఆదివారం నుంచి దుబాయ్‌లో భారత్, పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య ఆసియా కప్ టోర్నీ జరుగనున్నది. అయితే ఈ నిర్ణయం తీసుకున్న బీసీసీఐతో పాటు కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. పహల్గామ్ బాధిత కుటుంబాలు కూడా దీనిపై స్పందించాయి. పాక్‌తో మ్యాచ్‌ను భారత్ ఆటగాళ్లు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. 'మా కన్నీళ్లు ఇంకా ఆరిపోలేదు. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఏమిటి?' అని భర్త, కుమారుడ్ని కోల్పోయిన కిరణ్‌బెన్ ప్రశ్నించారు. మరోవైపు ఆమె చిన్న కుమారుడు సావన్ పర్మార్ కూడా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పహల్గామ్ దాడిలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులుకూడా అమరులయ్యారని గుర్తు చేశారు. భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరుగుతోందని తెలిసి తాము చాలా కలత చెందినట్లు చెప్పారు. 'పాకిస్థాన్‌తోఅన్ని సంబంధాలు తెంచుకున్నామని ప్రధాని మోదీ అన్నారు. మరి మనం ఇంకా ఈ ఆట ఎందుకు ఆడుతున్నాం? మేం ఇంకా దుఃఖిస్తున్నాం. ఈ ఆట ఆడాల్సిన అవసరం ఏమిటి?' అని ఆయన ప్రశ్నించారు.

# ఏకైక ఆమ్ ఆద్మీ ఎమ్మెల్యేపై ప్రజాభద్రతా చట్టం

**శ్రీనగర్, సెప్టెంబరు 14:** ప్రజాప్రతినిధిపై ప్రజా భద్రతా చట్టం కింద చర్యలు తీసుకోవడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. కానీ జమ్మూ కాశ్మీర్‌లోని ఏకైక ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్‌పై పోలీసులు ఈ పీఎస్‌ఏ చట్టాన్ని ప్రయోగించి అరెస్ట్ చేయడం ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. గత వారం పోలీసులు అదుపులోకి తీసుకున్న మెహ్రాజ్ మాలిక్‌పై ఇప్పటికే 18 కేసులు నమోదై ఉన్నాయని, పోలీస్ డైరీలో ఆయనపై రోజువారీ నివేదికలు ఉన్నాయని దోడా జిల్లా మెజిస్ట్రేట్ జారీ చేసిన పీఎస్‌ఏ డోసియర్‌లో పేర్కొన్నారు. 33 పేజీల ఈ డోసియర్‌లో మాలిక్‌ను హిస్టరీ షీటర్‌గా పేర్కొంటూ ఆయన సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాలను తగలబెట్టమని ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అధికారులు, రాజకీయ ప్రత్యర్థులపై ఆయన తరచుగా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని డోసియర్‌లో పేర్కొన్నారు. ముఖ్యంగా ఎన్నికల డ్యూటీ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించడం, వైద్యుల పట్ల అనుచిత భాష ఉపయోగించడం వంటి ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. 1978లో ఈ చ ట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఒక సిట్టింగ్ ఎమ్మెల్యేపై పీఎస్‌ఏ కింద కేసు నమోదు కావడం ఇదే మొదటి సారి. ఈ చట్టం ప్రకారం ఒక వ్యక్తిని విచారణ లేకుండానే రెండు సంవత్సరాల వరకు నిర్బంధించవచ్చు. ఇటీవల దోడా జిల్లా మెజిస్ట్రేట్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కొద్ది రోజులకే పోలీసులు మెహ్రాజ్ మాలిక్‌పై ఈ చట్టాన్ని ప్రయోగించారు. మాలిక్ అరెస్టుకు వ్యతిరేకంగా దోడాలో భారీ నిరసనలు చెలరేగాయి. పరిస్థితిని అదుపు చేయడానికి అధికారులు కర్ఫ్యూ విధించి ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ఈ ఘర్షణల్లో పోలీసులు, నిరసనకారులు గాయపడ్డారు. ఈ అరెస్టుపై రాజకీయ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. బీజేపీ ఈ అరెస్టును సమర్థిస్తుండగా మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వంటి ఇతరపార్టీల నాయకులు మాత్రం దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణిస్తున్నారు.

# బీహార్‌లో 243 స్థానాల్లోను పోటీచేస్తాం

## మహాకూటమి కీలకనేత తేజస్వియాదవ్ సంచలనం



**ముజఫరాపూర్(బీహార్), సెప్టెంబరు 24:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) నేత తేజస్వి యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేసి రాజకీయ వేడిని రాజేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాల్లోనూ తమ పార్టీయే పోటీ చేస్తుందని ప్రకటించి మహాఘట్‌బంధన్ కూటమిలో ప్రకంపనలు సృష్టించారు. సీట్ల పంపకాలపై మిత్రపక్షాలతో చర్చలు జరగాల్సి ఉండగా, తేజస్వి చేసిన ఈ ఏకపక్ష ప్రకటన కూటమి భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేసింది. ముజఫర్‌పూర్‌లోని కాంతిలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న తేజస్వి, ఈసారి ప్రజలు తన ముఖం చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ ఆయన, కేవలం నినాదాలతోనే ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. బీహార్ నుంచి ఓట్లు, గుజరాత్‌లో ఫ్యాక్టరీలు ఈ ఎత్తుగడలు ఇకపై చెల్లవని వ్యాఖ్యానించారు. తమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం పెన్షన్, ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తోందని, తాము ముందుంటే ప్రభుత్వం తమను అనుసరిస్తోందని అన్నారు. ఆర్‌జేడీ అధికారంలోకి వస్తే ఉపాధి, అభివృద్ధికి పెద్దపీట వేస్తామని తేజస్వి హామీ ఇచ్చారు. తమ పార్టీ ప్రకటించిన మై బెహన్ యోజన ను కాపీ కొట్టి ప్రభుత్వం మహిళలకు రూ.10,000 ఇస్తోందని, కానీ తాము గెలిస్తే ఐదేళ్లలో ప్రతి మహిళకు లక్షన్నర రూపాయలు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేసిన తేజస్వి, రూ.80 వేల కోట్లకు లెక్కలు చెప్పడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో వంతెనలు కూలిపోతున్నాయని, ఆసుపత్రుల్లో రోగులకు భద్రత కరువైందని, అయినా ప్రభుత్వం అవినీతిపరులను వదిలేసి ఎలుకలకు రక్షణ కల్పిస్తోందని ఎద్దేవా చేశారు. 2020 ఎన్నికల్లో ఆర్‌జేడీ 144 స్థానాల్లో పోటీ చేసి 75 గెలవగా, కాంగ్రెస్ 70 స్థానాల్లో పోటీకి దిగి కేవలం 19 సీట్లకే పరిమితమైంది. ఈసారి జేఎంఎం, ఎల్జేపీ వంటి పార్టీలు కూడా కూటమిలో చేరాయి. ఈ నేపథ్యంలో సీట్ల సర్దుబాటు కీలకంగా మారిన సమయంలో, అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తామన్న తేజస్వి ప్రకటన మిత్రపక్షాలను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది.

### భద్రతా వలయం ఛేదించుకుని తేజస్వి కాళ్లపై పడ్డయువకుడు!

బీహార్‌లో ప్రతిపక్ష నాయకుడు, ఆర్జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్‌పర్యటనలో భద్రతాలోపం తలెత్తింది. ముజఫర్‌పూర్ జిల్లా పర్యటనలో భాగంగా ఒక కార్యక్రమంలో పాల్గొన్న తేజస్వి యాదవ్ హెలికాప్టర్‌లో తిరిగి వెళ్లేందుకు సిద్ధపడుతుండగా ఓ యువకుడు సెక్యూరిటీ వలయాన్ని ఛేదించుకుని పరుగుపరుగున ఆయన దగ్గరికి వచ్చి పాదాలపై పడ్డాడు. దీనికిముందు ముజఫర్‌పూర్‌లోని కాంతి స్కూల్‌లో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తేజస్వి యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొని బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. సరిగ్గా అప్పుడే నల్లటి చొక్కా ధరించిన ఒక యువకుడు సెక్యూరిటీ వలయాన్ని ఛేదించుకుని తేజస్వి చెంతకువచ్చి ఆయన పాదాలపై పడ్డాడు. దాంతో ఒక్కసారిగా తేజస్వి దిగ్భ్రాంతికి గురయ్యారు. భద్రతా సిబ్బంది ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. యువకుడి పేరు షరీఫుల్ ఇస్లామ్‌గా గుర్తించారు. ఈ ఘట నకు సంబంధించిన వీడియో సోషల్ మీడి యాలో వైరల్ అవుతోంది. తేజస్వియాదవ్‌పై ఉన్న అభిమానానికి నిదర్శనమని కొందరు.. భద్రతా లోపమని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు.

# వరద సాయం ఉగ్ర సంస్థల పరం


## పాకిస్థాన్‌లో లష్కరే స్థావరాల పునరుద్ధరణ



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 14:** ఉగ్రవాదులతో తమకు సంబంధం లేదని ప్రపంచ వేదికపై మేకపోతు గాంభీర్యాలు పలికే పాకిస్థాన్ లోలోపల ఉగ్రస్థావరాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా భారత్ పాక్‌లోని అనేక ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. అయినా బుద్ధి మారని దాయాది దేశం తినడానికి లేకపోయినా కూడా వరద బాధితుల పేరుతో సేకరించిన నిధులను ఉగ్ర స్థావరాల పునరు ద్ధరణకు ఖర్చు చేస్తున్నట్లు భారత నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళం ధ్వంసం చేసిన లష్కరే ప్రధాన క్యాంపు కార్యాలయం మర్కాజ్ తోయిబాను పునర్నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. ధ్వంసమైన లష్కరే తోయిబా ప్రధాన కార్యాలయ విభాగాలను తొలగించడానికి దాని చుట్టూ భారీ యంత్రాలను మోహరించి ఉన్న దృశ్యాలు ఉపగ్రహ చిత్రాల్లో కనిపిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. దీనిని పునర్నిర్మించిన తర్వాత మళ్లీ ఉగ్రవాదులకు శిక్షణ స్థావరంగా ఉపయోగించనున్నట్లు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ధ్వంసమైన ఎల్‌ఇటికి ఆగస్టులో పాక్ ప్రభుత్వం నుంచి రూ. 1.25 కోట్లు ఇవ్వగా.. పునరుద్ధరణకు అయ్యే మొత్తం ఖర్చు సుమారు రూ. 4.7 కోట్లకుపైగా ఉంటుందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. వీటికి కావాల్సిన నిధులను సేకరించడానికి పాక్ మేకవన్నె పులిలా మానవతావాద ముసుగులో ప్రచారాలు చేపడుతోంది. వరద ప్రభావిత ప్రాంతాల సహాయం పేరుతో విరాళాలు సేకరించి ఉగ్ర సంస్థలకు మళ్లిస్తోంది.

# సంక్షిప్తంగా..

## అసోంలో భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 5.8గా నమోదు



**గౌహతి, సెప్టెంబరు 14:** అసోంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.8 తీవ్రతగా నమోదైంది. ఉదల్‌గిరి జిల్లాలోని ధెకియజులి ప్రాంతానికి 16 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 5కిలోమీటర్ల లోతులో ఇది సంభవించిందన్నారు. భూకంప తీవ్రతకు పలు ఇళ్లు స్వల్పంగా ఊగినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్, చైనాలోనూ భూ ప్రకంపనలు వచ్చినట్లు తెలిసింది. అసోంలోని ఇదే ప్రాంతంలో వారం క్రితం 3.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ప్రధాని మోదీ ప్రస్తుతం అసోం పర్యటనలోనే ఉన్న విషయం తెలిసిందే.

## చైనా నౌకలను అడ్డుకొన్న తైవాన్



**తైపెయి సిటీ, సెప్టెంబరు 14:** తైవాన్ కోస్ట్‌గార్డ్ అడ్మినిస్ట్రేషన్ (సిజిఎ) శనివారం చైనాకు చెందిన నౌకలను అడ్డుకొంది. వీటిల్లో బీజింగ్‌కు చెందిన కోస్ట్‌గార్డ్ నౌక ఒకటి కాగా మరొకటి భారీ చేపల పడవగా చెబుతున్నారు. రెండు నౌకలు డాంగ్‌షా ద్వీపం వద్ద కార్యకలాపాలు సాగిస్తుండగా ఈ ఘటన చోటుచేసు కొంది. దీంతో తైవాన్-చైనా మధ్య దక్షిణ చైనా సముద్ర జలాల్లో ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. ఫోకస్ తైవాన్ పత్రిక కథనం ప్రకారం గురువారం ఉదయం 6.15 గంటల సమయంలో రెండు చైనా నౌకల ను డాంగ్‌షా-నాంషా వద్ద గుర్తించారు. ఇవి ఇంకా నిషేధిత ప్రదేశానికి కొంచెం దూరంలో ఉండటంతో 2,000 టన్నుల కట్టర్ తైనాన్ అనే షిప్‌ను రంగంలోకి దించారు. అది శుక్రవారం చైనా కోస్ట్‌గార్డ్ నౌకను వెన్నంటే ఉండటంతో అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. అయితే ఆ రోజు రాత్రి చైనా చేపలవేట నౌక నిషేధిత ప్రాంతానికి చేరుకొంది. దీంతో రెండు తైవాన్ నౌకలు అక్కడికి చేరుకొని దానిని అడ్డగించాయి. దీంతో అది వెనక్కి వెళ్లిపోయింది.

## మాడ్రిడ్‌లో చర్చల వేళ అమెరికాపై చైనా దర్యాప్తులు షురూ



**బీజింగ్, సెప్టెంబరు 14:** అమెరికా రెండు అంశాల్లో తప్పుడు విధానాలు అవలంబిస్తోందని ఆరోపిస్తూ చైనా ఒకేసారి రెండు దర్యాప్తులు మొదలు పెట్టింది. స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో రెండు దేశాల మధ్య చర్చలు మొదలుకానున్న వేళఇది జరగడం గమనార్హం. మాడ్రిడ్ సమావేశంలో జాతీయ భద్రత, టిక్ టాక్ సోషల్ మీడియా యాజ మాన్య హక్కుల వంటివి చర్చకు రానున్నాయి. అమెరికా సెమీకండక్టర్లను లక్ష్యంగా చేసుకొని చైనా ఈ దర్యాప్తులు చేపట్టింది. కొన్ని ఐసి చిప్స్‌లో అమెరికాపై యాంటీ డంపింగ్ ఇన్వెస్టిగేషన్‌ను మొదలు పెట్టింది. వీటిని అమెరికాలోని టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఆన్ చిప్స్ సంస్థలు తయారుచేస్తుంటాయి. చైనాలో తయారైన సెమీకండెక్టర్లపై అమెరికా వివక్ష చూపుతోందంటూ మరో దర్యాప్తు చేపట్టింది. ఆదివారం మాడ్రిడ్‌లో చైనా వైస్‌ప్రీమియర్ లిఫెంగ్, అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ భేటీ అయ్యారు. శుక్రవారం అమెరికా ప్రభుత్వం 23 సంస్థలను ఆంక్షల పరిధిలోని జాబితాలో చేర్చడంతో చైనా ప్రతీకారంగా ఈ నిర్ణయం తీసుకుంది. వీటిల్లో చైనా చిప్స్ తయారీ సంస్థ ఎస్ఎంఐసి కూడా ఉంది.

## టేకాఫ్ కాకుండానే రన్‌వేపై నిలిచిపోయిన ఇండిగో



**లక్నో, సెప్టెంబరు 14:** ఉత్తరప్రదేశ్‌లోని లక్నో విమానాశ్రయంలో ఆదివారం ఊహించని ఘటన చోటు చేసుకుంది. లక్నో నుంచి ఢిల్లీ వెళ్తున్న ఇండిగో విమానంలో టేకాఫ్ సమయంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానం పైకి ఎగురలేక రన్‌వేపైనే ఆగిపోయింది. దీంతో పైలట్ చాకచక్యంగా వ్యవహరించి టేకాఫ్‌ను నిలిపివేశారు. ఆసమయంలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ సహా 151మంది ప్రయాణికులు విమానంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. టేకాఫ్ నిలిపివేసిన అనంతరం ప్రయాణికులను కిందకు దించి వేరే విమానంలో ఢిల్లీకి పంపారు.

## గగనతలాన్ని కాపాడిన మిగ్ 21లకు రిటైర్మెంట్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భారత వాయుసేనకు దాదాపు అర్ధశతాబ్దానికి పైగా సేవలు అందించి గగనతలాన్ని కాపాడిన మిగ్-21లకు ఇప్పుడు రిటైర్మెంట్ ప్రకటించారు. అయితే వీటిని కొనుగోలు చేసేందుకు చాలా సంస్థలు క్యూ కట్టాయి. కనీసం ఒక్క దానినైనా సొంతం చేసుకోవాలని పోటీ పడుతున్నాయి. వాయుసేన మిగ్-21 ఫైటర్‌జెట్ రిటైర్మెంట్ తర్వాత విద్యాసంస్థలు వార్ మెమోరి యల్స్ మిలిటరీ మ్యూజియాలు వీటి ఎయిర్ ఫ్రేమ్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వద్ద క్యూకట్టాయి. సెప్టెంబర్ 26న రెండు స్క్వాడ్రన్ల ఈ యుద్ధ విమానాలకు తుది వీడ్కోలు పలకనున్నారు.

15-09pg6exHMNWJQEP 10_15-09pg6exHMNWJQEP.qxd 9/15/2025 12:51 AM Page 1



# ఆక్వాను ఆదుకోండి - కేంద్రానికి సిఎం చంద్రబాబు లేఖ

## - అమెరికా సుంకాలతో రాష్ట్రంలో ఆక్వాకు తీవ్ర నష్టాలు వచ్చాయి - దేశీయ వినియోగంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని ముఖ్యమంత్రి వినతి

**విజయవాడ,సెప్టెంబర్14, ప్రభాతవార్తప్రతినిధి:** ఆమెరికా సుంకాలతో ఇబ్బందిపడుతున్న ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలని కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఆక్వా రైతులు నష్టపోకుండా కేంద్ర స్థాయిలో కొన్ని నిర్ణయాలు తీసుకోవాలని కోరుతూ చంద్రబాబు వివిధ కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు. దేశీయంగానూ ఆక్వా ఉత్పత్తుల వినియోగం పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్, వాణిజ్యపరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు సీఎం విడివిడిగా లేఖలు రాశారు. జీఎస్టీ, ఆర్థిక వెసులుబాట్లు వంటి అంశాలను పరిశీలించాలని కేంద్ర ఆర్థిక మంత్రికి, ఇతర దేశాలతో ఆక్వా విషయంలో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలని కేంద్ర వాణిజ్యపరిశ్రమల శాఖ మంత్రికి, దేశీయ మార్కెట్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మత్స్య శాఖ మంత్రికి లేఖలు రాశారు. రాష్ట్రంలో ఆక్వా రైతులు, ఆ రంగంపై ఆధారపడిన కుటుంబాలు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయని సీఎం తన లేఖల్లో పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చంద్రబాబు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. జాతీయ స్థాయిలో జరిగే రొయ్యల ఎగుమతుల్లో ఏపీ నుంచి 80 శాతం వాటా ఉందని.. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో 34 శాతం వాటా ఏపీ కలిగి ఉందని సీఎం పేర్కొన్నారు. సుమారు రూ. 21,246 కోట్ల విలువైన సముద్ర, మత్స్య ఉత్పత్తులు ఏపీ నుంచి ఎగుమతి అవుతున్నాయని సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఆక్వా రంగం మీద ఆధారపడి 2.5 లక్షల ఆక్వా రైతు కుటుంబాలు, 30 లక్షల మంది ఆక్వా అనుబంధ రంగాలపై ఆధారపడిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రులకు రాసిన లేఖల్లో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమెరికా విధించిన సుంకాలతో రొయ్యలు ఎగుమతులపై ఎక్కువగా ప్రభావం పడిందని ఆయన స్పష్టం చేశారు. దాదాపు రూ. 25 వేల కోట్ల మేర నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నట్టు సీఎం తన లేఖల్లో పేర్కొన్నారు. 50 శాతం మేర ఎగుమతుల ఆర్డర్లు రద్దు అయ్యాయయని లేఖలో వివరించారు. దాదాపు 2 వేల కంటైనర్లలో జరుగుతున్న ఎగుమతులపై రూ. 600 కోట్ల మేర సుంకాల భారం పడిందని తెలిపారు. ఆక్వా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని.. ఆక్వా ఫీడ్ ఉత్పత్తిదారులతో జరిపిన చర్చల ఫలితంగా కేజీ ఆక్వా ఫీడ్ ఎమ్మార్పీపై రూ. 9 మేర తగ్గించ గలిగామన్నారు. సబ్సిడీతో ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేసేందుకు కూడా ఆలోచన కూడా చేస్తున్నామని సీఎం తన లేఖల్లో వివరించారు. రాష్ట్రం ప్రభుత్వంతో పాటు కేంద్ర సాయం కూడా ఆక్వా రైతులను నిలబెట్టేందుకు అవసరమవుతుందని కేంద్ర మంత్రులకు రాసిన లేఖలో ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఎగుమతి దారులకు..ఆక్వా కంపెనీలకు బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం, వడ్డీ చెల్లింపులపై 240 రోజుల పాటు మారటోరియం విధించాలని కోరారు. వడ్డీ రాయితీ కల్పించడంతోపాటు... ఫ్రోజెన్ రొయ్యలపై ఉన్న 5 జీఎస్టీని తాత్కాలికంగా మినహాయించడం వంటి చర్యలు తీసుకోవాలని సీఎం లేఖల్లో కోరారు. ఈ చర్యలతో పాటు అమెరికా కాకుండా ఇతర దేశాలకు ఆక్వా మార్కెట్ ను విస్తరించే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు.

యూరోపియన్ యూనియన్, సౌత్ కొరియా, సౌదీ, రష్యా దేశాల్లో ఆక్వా ఎగుమతులు పెరిగేలా ఆయా దేశాలతో ఫ్రీ ట్రేడ్ ఒప్పందాలు కుదుర్చుకునే అంశాలను పరిశీలించాలని లేఖల్లో ముఖ్యమంత్రి కోరారు. ఎగుమతి దారులకు మధ్యంతర ఆర్థిక సహాయం, ఎగుమతులపై విధించే సుంకాలు, పన్నుల ఉపశమనం పథకంపై మరింత స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యూరోపియన్ యూనియన్ దేశాలకు సీఫుడ్ సరఫరా చేయడానికి తాము సిద్దంగా ఉన్నట్టు ఎగుమతిదారులు తనకు విజ్ఞప్తి చేశారని సీఎం చంద్రబాబు వివరించారు.

ఈ చర్యలతో పాటు దేశీయంగా ఆక్వా మార్కెట్ పెంచుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

# ఆడపిల్లలను అదనపు భారంగా భావించవద్దు

## - హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



విజయవాడలో బాలికల భద్రత,రక్షణపై జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో ప్రసంగిస్తున్న ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ థాకూర్,ఇతర న్యాయ ప్రముఖులు

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆడపిల్లలను ఎప్పుడు అదనపు భారంగా భావించడం కూడదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ థాకూర్ అన్నారు.ఆడపిల్లలను మనం బాధ్యతగా స్వీకరించి,వారి వ్యక్తిత్వాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా సామాజిక తీర్చిదిద్దాలన్నారు.వారిలో సృజనాత్మక,ఆలోచనా విధానం ఒక ఉన్నతమైన సమాజాన్ని తీర్చిదిద్దుతుందన్నారు. భారతదేశంలో బాలికలు, సురక్షిత వాతావరణం,.సంరక్షణ, అనే అంశంపై రాష్ట్ర స్థాయి ఆదివారం విజయవాడ లోని తుమ్మలపల్లి కాలాక్షేత్రం లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ థాకూర్ ముఖ్య అతిథిగా హాజరయి,మాట్లాడుతూ ఈ సమావేశం ఒక బాలిక సంరక్షణకు సంబంధించినదన్నారు. చరిత్రలోకి వెళితే, మహిళలు ఎలా బాధపడ్డారో మనం చూశామని, ముఖ్యంగా ఈ దేశంలో ప్రారంభంలో సతి సహగమనం అనే ఆచారం ఉండేదని, సామాజిక సంస్కర్త రాజా రామ్ మోహన్ రాయ్ కృషి వల్ల ఆ ఆచారం నిషేధించబడిందన్నారు. అనేక సంవత్సరాలుగా మహిళల బాధలు మరియు వేదనలు తగ్గినప్పటికీ, మహిళాలపై వివక్ష పూర్తిగా తొలగించబడలేదన్నారు. సాధారణంగా సంవత్సరాలుగా ఒక మహిళను ఎవరైతే ఎక్కువ లేదా బాలికను కుటుంబానికి ఆస్తిగా కాకుండా భారంగా చూసారో ఆ సమాజానికి ఆపాదించబడుతుందన్నారు. చాలా కుటుంబాలలో ఒక బాలికను బాధ్యతగా కాకుండా ఒక భారంగా పరిగణిస్తారు. బాలికలు కుటుంబానికి సహకరించలేరని, అందువల్ల వీలైనంత త్వరగా ఆమెకు వివాహం చేయాలనే ప్రయత్నాలు జరుగుతాయన్నారు. అందువలన బాల్య వివాహాలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. బాలికల రక్షణ గురించి చట్టపరమైన ఫ్రేమ్ వర్క్ ఉన్నప్పటికీ, నిజ జీవితంలో దానికి కార్యరూపం అనుకున్నంత స్థాయిలో జరగడం లేదన్నారు. ప్రపంచ జాబితా ప్రకారం నేడు 90 మిలియన్ల మంది పిల్లలు లైంగిక హింసను అనుభవిస్తున్నారన్నారు, ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది మహిళలు మరియు పురుషులు వారి బాల్యంలో అలాంటి హింసకు గురయ్యారన్నారు. 1.6 బిలియన్ల మంది పిల్లలు తప్పకుండా వారి ఇంట్లో సంరక్షకుల ద్వారా హింసాత్మక శిక్షను భరిస్తున్నారన్నారు. హింసాత్మక క్రమశిక్షణను అనుభవించే పిల్లలలో మూడింట రెండు వంతులు శారీరక శిక్షకు మరియు మానసిక దూషణకు గురవుతున్నారన్నారు. నలుగురు చిన్న పిల్లల్లో ముగ్గురు తమ సంరక్షకుల ద్వారా క్రమం తప్పకుండా హింసకు గురవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పాఠశాలలో హింస ఉందని, దాదాపు 130 మిలియన్లు, 13 నుండి 15 సంవత్సరాల వయస్సు గల ముగ్గురిలో ఒకరి కంటే ఎక్కువ మంది విద్యార్థులు బెదిరింపులకు గురవుతున్నారన్నారు.. ప్రపంచంలోని పిల్లలలో 86 మందిని చట్టం ద్వారా శారీరక శిక్ష నుండి పూర్తిగా రక్షించబడలేదన్నారు. ఇప్పుడు ఆన్లైన్ లో 30 దేశాల్లోని యువకులలో మూడింట ఒక వంతు మంది ఆన్లైన్ వేధింపులకు గురవుతున్నట్లు నివేదించారు. 2020లో 153,000 కంటే ఎక్కువ వెబ్‌సైట్‌లు బాల లైంగిక వేధింపుల చిత్రాలను కలిగి ఉన్నట్లు నివేదించబడ్డాయని , ఇది అంతకు ముందు సంవత్సరం కంటే 16 ఎక్కువని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా లైంగిక హింస విస్తృతంగా ఉందని, సుమారుగా 15 మిలియన్ల మంది కౌమార బాలికలు 15 నుండి 19 సంవత్సరాల మధ్య బలవంతపు లైంగిక సంబంధాన్ని లేదా ఇతర బలవంతపు లైంగిక చర్యలను వారి జీవితకాలంలో అనుభవించారని తెలిపారు. అంగవైకల్యాలు కలిగిన పిల్లలు వైకల్యం లేని పిల్లల కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ హింసకు గురయ్యే అవకాశం ఉందన్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో నివేదిక ప్రకారం వారిలో 90 మంది కుటుంబానికి తెలిసిన వారిచే దాడికి గురయ్యారని, ఇది చాలా భయంకరమైనదన్నారు.

## రాహుకాల సమయంలో అంతరాలయ దర్శనాలకు చెక్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇక మీదట రాహుకాల సమయంలో అంతరాలయ దర్శనాలకు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి నిర్ణయం తీసుకున్నారు. దళారుల దందాకు చెక్ పెట్టారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో విఐపిల కోసం ఏర్పాటు చేసిన 'అంతరాలయ దర్శనాలు'కు రూ.500ల టిక్కెట్లు ఏర్పాటు చేసారు.ఈ అవకాశాన్ని దళారులు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నారు. అంతేకాకుండా అంతరాలయానికి వచ్చిన విఐపిల నుంచి అర్చకులకు కూడా తట్టల్లో ఘనంగానే సంభావనలు దక్కేవి. అయితే సామాన్య భక్తులు ఆ సమయంలో నొచ్చుకునే వారు. కొన్ని సమయాల్లో సామాన్య భక్తులు సంయమనం మరచి రెచ్చిపోయి సిబ్బంది మీద తిరగబడే సందర్భాలు లేకపోలేదు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి దేశ విదేశాల నుంచి భక్తులు వస్తున్నారు. వారి భక్తిభావాన్ని పరిరక్షించుటకు దేవస్థానం ఎన్నో చర్యలు తీసుకుంటుంటే దళారులు ఆ అవకాశాలను కూడా సద్వినియోగం చేసుకుంటున్నారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనానికి దేవస్థానం రూ.500లు టిక్కెట్లు ఖరారు చేసారు. ఎవరైనా సరే అంతరాలయ దర్శనానికి వెళ్ళాలంటే ఈ టిక్కెట్టు కొనుక్కోవాల్సిందే అని ఖరారు చేసారు.ఈ నిర్ణయం దళారులకు వరంగా మారింది. వచ్చిన విఐపిలకు అంతరాలయ దర్శనం చేయిస్తామంటూ వేల రూపాయలు దండుకోవటం మొదలెట్టారు. అయితే రాహుకాల సమయంలో అంతరాలయ దర్శనాలతో భక్తుల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. అంతేకాక స్వామి గర్భగుడి వద్ద ఉన్న సిబ్బందిపై సామాన్యభక్తులు తెలియక తిరుగుబాటు చేసే వారు.ఈ అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఇఓ బాపిరెడ్డి ఎలాగోలా చెక్‌పెట్టాలని నిర్ణయించారు.

## జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలలో బిసిలకు రిజర్వేషన్ కల్పించాలి: సిపిఐ రామకృష్ణ

### - విజయవాడలో కాంగ్రెస్ నేతలు రఘువీరా, శివాజీ

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బీసీలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ కల్పించాలనే అంశంపై ఆదివారం విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఘువీరారెడ్డి, కొలనుకొండ శివాజీ, జల్లి విల్సన్, దోనేపూడి శంకర్, కోటేశ్వరరావు, ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జన గణనతో పాటు, కులగణన కూడా చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించిన విధంగా.. బీసీలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ రెండు అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనిట్లు చెప్పారు. పక్కన ఉన్న తెలంగాణాలో కుల గణన అమలు చేశారని, కర్నాటలో కూడా ప్రకటించారని.. మన ఏపీలో కూడా కుల గణన జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ సాధించుకునేందుకు ఎలా ముందుకు వెళ్లాలనే అంశాలపై ఈరోజు సమావేశంలో చర్చిస్తున్నామన్నారు. 143 వెనుక బడిన కులాలు ఉండగా, బీసీలకు స్థానాలు తగ్గించడం వల్ల బీసీలు పదవులు కోల్పోయారని చెప్పారు. తెలంగాణాలో కుల గణన జరిగిన నేపథ్యంలో బీసీలకు పదవులు వచ్చాయని, ఏపీలో కూడా ఇదే విధంగా కుల గణన చేపట్టి.. బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తీర్మానం చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపుతామని రామకృష్ణ పేర్కొన్నారు. రఘువీరారెడ్డి,

కొలను కొండ శివాజీలు మాట్లాడుతూ తెలంగాణా,కర్ణాటకలో బీసీ ముసాయిదాను అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రకటించాయన్నారు.నిర్దిష్ట ప్రామాణికాలతో బీసీ సర్వేను నిర్వహించి, తదనుగుణంగా రూపొందిన నివేదికపై చర్చించి.తర్కించి రిజర్వేషన్లు అమలు చేసారన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో 7,441 బిఇడి సీట్లు భర్తీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** రాష్ట్రంలో బ్యాచ్‌లర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బి.ఇడి) సీట్ల భర్తీకి నిర్వహించిన రెండో విడత టిజి ఎడ్‌సెట్ కౌన్సె లింగ్‌లో 7,441 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆదివారం టిజి సెట్స్ కన్వీనర్ పాండురంగారెడ్డి

సీట్ల కేటాయింపు వివరాలు వెల్లడించారు.రెండో విడత కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటాలో మొత్తం 10,005 బి.ఇడి సీట్లు అందుబాటులో ఉండగా, 12,076 మంది వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో 9,955 సీట్లు కేటాయించగా, 4,474 మంది విద్యార్థులు రిపోర్టింగ్ చేసినట్లు తెలిపారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 18 వరకు కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాలని అన్నారు.



జాతీయ సాంస్కృతిక ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

# సమాజ మనుగడకు కళలు దోహదం చేస్తాయి

## డా. పట్టాభి కళాపీఠం వ్యవస్థాపక ఛైర్మన్ డా. తూములూరి రాజేంద్రప్రసాద్

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** సమాజ మనుగడకు సాహిత్యం, కళలు దోహదం చేస్తాయని డా. పట్టాభి కళాపీఠము వ్యవస్థాపక ఛైర్మన్ డా. తూములూరి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం గుంటూరు ఎస్.హెచ్.వో హాలులో జాతీయ సాంస్కృతిక ఉత్సవాల పోస్టర్ ను సాహితీవేత్తలతో కలసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలు మల్లెతీగ సాహిత్యసేవాసంస్థతో కలిసి రచయితలు, కళాకారులు, కార్టూనిస్టుల కోసం నవంబరులో విజయవాడలో ఒక గొప్ప సాహిత్య సాంస్కృతిక సంబరం చేయడం నేటి అవసరంగా భావిస్తున్నానన్నారు. ఈ వేదికను ఔత్సాహికులందరూ వినియోగించు కోవాల్సిందిగా కోరారు. ఉత్సవాల కమిటీ గుంటూరు పట్టణ కార్యదర్శి బండికల్లు జమదగ్ని మాట్లాడుతూ ఎలాంటి రుసుమూ లేకుండా ప్రతినిధులందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని, ముందుగా పేరు నమోదు చేసుకుని వేడుకల్లో పాల్గొన్నవారికి సత్కారం చేయాలని కమిటీ నిర్ణయించిందని, కవులు,రచయిత(త్రు)లు,కార్టూనిస్టులు,కళాకారులు తమ పేరు, వివరాలు పంపి నమోదు చేసుకోవాలని కోరారు.

ఇతర వివరాలకు 9246415150, 83329 03156 నెంబర్లలో సంప్రదించవచ్చారు. కార్యక్రమంలో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ, ఉపాధ్యక్షుడు చొప్పా రాఘవేంద్రశేఖర్, సింగర్ ఎన్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.



# శ్రీవారి అనుగ్రహం మహిళా శక్తిపై ఉండాలి

## - తిరుమలలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

**తిరుమల,సెప్టెంబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహం దేశంలోని మహిళాశక్తిపై కలగాలని లోక్‌సభస్పీకర్ ఓంబిర్లా తెలిపారు. తిరుపతిలో తొలిసారిగా జరుగుతున్న జాతీయ మహిళా సాధికారత సదస్సు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశసింగ్, ఏపి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజుతో కలసి ఓంబిర్లా తిరుమల ఆలయం వద్దకు విచ్చేశారు. వీరికి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాధం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన బిర్లా అనంతరం ఆనంద నిలయంలోనికి చేరుకని శ్రీవేంకటేశ్వరస్వామినికి దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు.రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఓంబిర్లా, హరివంశ్‌సింగ్, అయ్యన్నపాత్రుడు, రాఘురామరాజుకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. వీరితోబాటు ఇన్ఫోసిస్ అధినేత, ఎంపి సుధానారాయణమూర్తి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ శ్రీవారిని దర్శించుకున్నారు.

# ఎన్ఎఫ్ఐఆర్ నూతన జాతీయ కార్యవర్గం

## - జాతీయ ప్రధాన కార్యదర్శిగా మరోసారి ఎన్నికైన డాక్టర్ మర్రి రాఘవయ్య - రైల్వే జోనల్ కార్యదర్శిగా ఎన్నికైన భరణి భాను ప్రసాద్

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్ (ఎన్ఎఫ్ఐఆర్) జాతీయ మహాసభల్లో తెలుగు రాష్ట్రాలు మరోసారి తమ సత్తాను చాటుకున్నాయి. ఇటీవల న్యూఢిల్లీలోని కర్నయిల్ సింగ్ స్టేడియంలో 31వ జాతీయ మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో సమాఖ్య ప్రతినిధులు రాబోయే కాలవ్యవధికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్ఎఫ్ఐఆర్ అధ్యక్షులుగా గుమాన్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మర్రి రాఘవయ్య, కోశాధికారిగా ఆర్‌పి సింగ్, తెలుగు రాష్ట్రాల దక్షిణ మధ్య రైల్వే జోనల్ కార్యదర్శిగా ఎం భరణి భాను ప్రసాద్‌లను సమాఖ్య ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు వర్కింగ్ కమిటీ సభ్యులుగా యు వెంకటేశ్వర్లు, కె విఆర్ ప్రసాద్, ఎం వెంకటేశ్వరరావు, కె ప్రభాకర్, అరుణ్ కుమార్, ప్రభురాజ్, రమణయ్య, డి సత్యవాణిలను ఎన్నుకున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లివ్వాలి



**విజయవాడ, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ బిసిలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు, మహిళా బిల్లులో బిసి మహిళకు ప్రత్యేక సబ్‌కోటా ఇవ్వాలన్నారు. చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్‌లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నరసారావు, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, ఉపాధ్యక్షులు ఎలమందరావు, బిఎస్ఆర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీర్స్ డే సందర్భంగా టిఎస్ సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** తమ మేధో శక్తితో మానవ మనుగడకు ఎన్నో ఫలాలను అందించిన ఘనత ఇంజినీర్లదేనని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఇంజనీర్లందరికీ ముఖ్యమంత్రి ఇంజనీర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ఆర్థికాభివృద్ధికి, భారతావని ప్రగతికి బలమైన పునాదులు నిర్మించిన భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినమైన సెప్టెంబర్ 15ను పురస్కరించుకొని, ఆయన జ్ఞాపకార్థం ఇంజనీర్స్ డేగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజి నీరుగా, దార్శని కుడిగా, విద్యాప్రదాతగా, నిపుణుడిగా, పారిశ్రామిక ప్రగతి చోదకుడిగా ప్రత్యేకతను చాటారన్నారు. అత్యుత్తమ ఇంజనీరింగ్ సాంకేతికతతో వివిధ రంగాలలో ఆయన చేసిన కృషి భారతదేశ ఇంజనీరింగ్ రంగానికి ఆదర్శంగా నిలిచాయని సిఎం చెప్పారు. మూసీ వరదల నుంచి హైదరాబాదు నగరాన్ని రక్షించేందుకు జల నియంత్రణ ప్రణాళికలు,ఎన్నో గొప్ప నిర్మాణాలు చేపట్టటంలో ప్రత్యేక చొరవ చూపించారన్నారు.

## యూరియా కొరత తీవ్రం

### పంట చేతికి రాదనుకొని మరణించిన రైతు

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రతరం అవుతోంది. యూరియా బస్తాలు దొరకపోవడంతో పంట చేను చేతికి రాదన్న మనస్తాపంతో ఒక యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రాష్ట్రంలోని కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మండలం, ధనియాలపాడు పంచాయతీ పరిధిలోని సేవ్యాతండాలో ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల తెలిపారు.

## అద్భుతంగా ముగిసిన రాయలసీమ నృత్యకళోత్సవాలు

**తిరుపతి,సెప్టెంబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** నాటక రంగాన్ని పరిరక్షించుకుంటూ కళాకారులను ప్రోత్సహించేదిశగా ప్రతి ఏడాది క్రమం తప్పకుండా రాయలసీమ రంగస్థలి కళాసంస్థ చేపడుతున్న నృత్యోత్సవాలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఆదివారం ఉదయం ఒంగోలు జానపద బృందం కళాకారులు సుగాలి నృత్యం ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. కళాకారులకు ప్రదర్శన బహుమతిగా శ్రీవేంకటేశ్వరస్వామి ప్రతిమలను అందజేశారు. విజేతలకు పురస్కారాలు, బహుమతులు అందజేశారు. తిరుపతి మహతి కళాక్షేత్రంలో మూడురోజులు జరిగిన రాయలసీమ రంగస్థలి నృత్యకళోత్సవాలు కళాకారులను, ఆహుతులను ఆకట్టుకున్నాయి. కళాకారులకు శ్రీకృష్ణదేవ రాయ పురస్కారాలను నిర్వాహకులు రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, ,కళాకారులు కెఎన్ రాజ, విజయభాస్కర్‌రెడ్డి, కోండే చెంగారెడ్డి,తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, నాగేశ్వరరావు ,మల్లారపు వాసు ప్రదానం చేశారు.



## తిరుమలలో జడివాన

**తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం వేకువజాము నుండి ఉదయం 9గంటల వరకు తిరుమలలో జడివాన కురిసింది., వేకువజామున 4గంటలనుండి మోస్తరుగా కురిసిన వాన ఆ తరువాత చిరుజల్లులతో బలంగా పడింది. ఆదివారం ఉదయం తిరుమలలో శ్రీవారి దర్శనానికి వచ్చిన ప్రముఖులు, భక్తులు గొడుగులక్రింద సేదదీరారు. అంతేగాక వానలోనే స్వామివారిని దర్శించుకున్నారు. జడివానతో తిరుమలలో వాతావరణం పూర్తిగా మారిపోయింది. చల్లటిగాలులు వీస్తున్నాయి

### డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జికి

## పార్టీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా డిసిసి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సా రెడ్డితోపాటు సిద్దిపేట నియోజకవర్గఇన్‌చార్జి పూజల హరి కృష్ణకు పిసిసి క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్, ఎంపి మల్లు రవి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డిపై గజ్వేల్‌కు చెందిన దళితులు, పార్టీ శ్రేణులు ఫిర్యాదు చేయడంతో నర్సారెడ్డిని గాంధీభవన్‌కు పిలిపించి షోకాజ్ నోటీసు జారీ చేశారని పార్టీ వర్గాలు తెలిపారు. పిసిసి క్రమశిక్షణ కమిటీకి వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించినట్లు వివరించారు. అలాగే సిద్దిపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణపై సైతం పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్‌కు 10మందికిపైగా సిద్దిపేటకు చెందిన నాయకులు ఫిర్యాదు చేయడంతో వివరణ ఇవ్వలని పిసిసి క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీచేసిందని పార్టీ శ్రేణులు తెలిపారు.


## కీచక టీచర్ కటకటాల్లోకి

### వెరిటాస్ సైనిక్ పాఠశాలలో విద్యార్థినిపై ఉపాధ్యాయుని లైంగిక దాడి

**ములుగు, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్ చక్కదిద్దాల్సిన పాఠశాలలో ఉపాధ్యాయుడు వారిపై లైంగిక కోరిక చూపితే ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్‌కు చెబితే పాఠశాల నుంచి రెడ్ టీసీ ఇచ్చి పంపిస్తామని హెచ్చరించిన సంఘట ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో చోటుచేసుకుంది. బాధిత విద్యార్థిని కుటుంబసభ్యులు, గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి అందించిన వివరాల మేరకు... హైదారాబాద్‌కు చెందిన ఓ విద్యార్థిని 9వ తరగతి చదువుతుంది. కాగా ఈనెల 4న సాయంత్రం విద్యార్థులందరూ చదువుకుంటున్నారు. అదే సమయంలో పాఠశాలలోని ప్రణయ్ అనే ఉపాధ్యాయుడు వచ్చి ఉపాధ్యాయుల దినోత్సవం కోసం తరగతి గదిని డెకరేషన్ చేయాల్సి ఉందని ఓ విద్యార్థిని తీసుకొని వెళ్లారు. తరగతి గదిలోకి వెళ్లగానే లైట్స్ ఆఫ్‌చేసి ఆ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధిత విద్యార్థి ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లింది.

15-09Pg7exHMNWJQE 11_15-09Pg7exHMNWJQE.qxd 9/15/2025 12:47 AM Page 1





## అలయ్ బలయ్ కార్యక్రమానికి రండి

### సిఎం రేవంత్‌రెడ్డికి దత్తాత్రేయ ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** జూబ్లీహిల్స్ నివాసంలో సిఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే నెల 3న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో జరిగే అలయ్ బలయ్ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డిని దత్తాత్రేయ ఆహ్వానించారు. ఈ మేరకు సిఎంకు ఆహ్వాన పత్రికను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయను సిఎం రేవంత్ శాలువా కప్పి సత్కరించారు. కాగా, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని బండారు దత్తాత్రేయ నిర్వహిస్తారు. రాజకీయాలకు అతీతంగా అలయ్ బలయ్ వేడుకలు ప్రతీ యేడాది దసరా సమయంలో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రతి యేటా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులు, అధికారులు, సెలబ్రిటీలు, ప్రముఖులు పాల్గొంటారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయాలకు అతీతంగా నాయకులను ఒకే వేదికమీదకు తీసుకురావాలనే ఉద్దేశంతో 2005లో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.

## టైంస్కేల్ ఇచ్చేవరకు సమ్మె విరమించేది లేదు

### రాష్ట్ర గిరిజన హాస్టల్, ఆశ్రమం పాఠశాల డైలీవేజ్ వర్కర్ల జెఎసి నేతలు

**హైదరాబాద్ (ముషీరాబాద్), సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** తెలంగాణ గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లకు టైమ్ స్కేల్ ఇచ్చేవరకు సమ్మె విరమించేది లేదని తెలంగాణ గిరిజన హాస్టల్, ఆశ్ర మం పాఠశాల డైలీవేజ్ వర్కర్ల జెఎసి నేతలు ఎం. పాపారావు, బి.మధు, నాగేశ్వరరావు, బ్రహ్మాచారి, గోపాల్‌లు స్పష్టం చేశారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లు న్యాయమైన డిమాండ్ల సాధనకై ఈనెల 12 నుంచి సమ్మె ప్రారంభించారని గుర్తు చేశారు. టైస్కేల్‌తో పాటు సమాన పనికి సమాన వేతనం, పాత పద్ధతిలోనే వేతనాల చెల్లింపులు, చనిపోయిన కాంటినెంట్స్ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం వంటి డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఎటువంటి స్పందన లేకపోవటంతో సమ్మెకు దిగవలసి వచ్చిందని తెలిపారు. జిల్లాలలో సమ్మె చేస్తున్న డైలీ వేజ్ వర్కర్లను అధికారులు ఫోన్‌లు చేసి, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదరించటం సరికాదని, సమ్మెచేసే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఉద్యాన పంటలకు ప్రోత్సాహకం

### రైతులకు రాయితీలు ప్రకటించిన డైరెక్టర్ యాస్మిన్

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులకు రాయితీలు ఇవ్వాలని ఆ శాఖ నిర్ణయం తీసుకుంది. ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకుగాను రైతులకు వివిధ రాయితీలు అందించేందుకు ప్రణాళికను రూపొందించింది. సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా అందిస్తున్న రాయితీలు, నిధులను ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉద్యాన శాఖ డైరక్టర్ యాస్మిన్ బాషా ప్రకటించారు. తెలంగాణలో కొత్తగా ఉద్యాన తోటల విస్తీర్ణాన్ని పెంచేందుకు పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 9,902 ఎకరాలకు సంబంధించి మామిడి, అరటి, జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బత్తాయి వంటి పండ్ల తోటల సాగు నిమిత్తం 18.48 కోట్ల రూపాయలను కేటాయించారు. అదేవిధంగా కూరగాయల సాగు నిమిత్తం 10 వేల ఎకరాల విస్తీర్ణాన్ని పెంచే లక్ష్యానికి గాను 9.60 కోట్ల రూపాయలు, 2,949 ఎకరాల్లో ఉల్లి సాగు కోసం 2.35 కోట్ల రూపాయలు కేటాయింపులు చేశారు.

అలాగే రాష్ట్రంలోని 2,549 ఎకరాల్లో పూల సాగు నిమిత్తం 2.06 కోట్ల రూపాయలు, 3,294 ఎకరాల్లో అల్లం, వెల్లుల్లి సాగుకు సంబంధించి 5.33 కోట్ల రూపాయలను కేటాయించారు. ఈవిధంగా ప్రకటించిన ఉద్యాన పంటల సాగు నిమిత్తం అన్ని విభాగాల్లో 40 శాతం రాయితీని రైతులకు అంద చేయనున్నారు. వీటితోపాటు, అదనంగా పుట్టగొడుగుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు గాను వాటి యూనిట్లకు 1.08 కోట్ల రూపాయలను కేటాయింపులు చేశారు. పాత తోటల పునరుద్ధరణకు మరో 2 కోట్ల రూపాయలు, నీటి వనరుల సృష్టి కోసం 2.73 కోట్ల రూపాయలు, ప్లాస్టిక్ మల్చింగ్ కోసం 14.24 కోట్ల రూపాయలను కేటాయించారు. వీటికి 40 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు. ఇక సేంద్రీయ సాగు, నర్సరీల ఏర్పాటు, విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, పాలీహౌజ్‌లు, కోల్డ్ స్టోరేజీలు వంటి యూనిట్ల ఏర్పాటుకు 30 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు.

## సుప్రీంకోర్టు తీర్పు నుండి ఇన్‌సర్వీస్ టీచర్లకు రక్షణ కల్పించాలి

### ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** టెట్‌పై ఈ నెల 1న సుప్రీంకోర్టు ఐదేళ్ళ పైబడి సర్వీసున్న ఇన్ సర్వీస్ టీచర్లందరూ రెండేళ్ళలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్ )ఉత్తీర్ణులు కావాలని లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని ఆదేశిస్తూ ఇచ్చిన తీర్పు నుండి సీనియర్ టీచర్లకు రక్షణ కల్పించాలంటే విద్యాహక్కు చట్టంలో సెక్షన్ 23 ను సవరించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉపాధ్యాయులు అప్ డేట్ కావటానికి తాము వ్యతిరేకం కాదని, అయితే 2010కి ముందే నియామకమైన టీచర్లకు టెట్ మినహాయింపు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. 15 సంవత్సరాల తర్వాత హఠాత్తుగా రెండేళ్లలో పరీక్ష పాస్ కావాలంటే సీనియర్ టీచర్లు ఆందోళన చెందుతున్నారని, దీంతో ఏర్పడే సంక్షోభాన్ని నివారించడానికి తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలన్నారు. జాతీయ విద్యావిధానం సవరించాలని, సిపిఎస్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఆదాయ పన్ను పరిమితిని పెంచాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో నిర్వహిస్తున్న దేశవ్యాప్తం క్యాంపైన్‌లో భాగస్వాములు కావాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రెండేళ్ల కాలంలో వీలైనన్ని ఎక్కువ పర్యాయాలు టెట్ పరీక్ష నిర్వహించి అవసరమైన ఉపాధ్యాయులందరూ ఉత్తీర్ణులు అయ్యేలా అవకాశం కల్పించాలన్నారు. డిగ్రీ, బిఎడ్ అర్హతలతో ఎస్జీటీలుగా నియామకమైన ఉపాధ్యాయులకు ఓడిఎల్ (ఓపెన్ అండ్ డిస్టెన్స్ లర్నింగ్) పద్ధతిలో జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ల ద్వారా డిఎడ్ స్వల్పకాలిక శిక్షణను అందించి టెట్ పేపర్ 1 వ్రాసుకోవడానికి అర్హత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ముందు ఇటీవల మరణించిన సిపిఐ జాతీయ నాయకులు సురవరం సుధాకర్ రెడ్డికి నివాళులర్పించారు.

# సింగరేణి మనుగడను సర్కారు కాపాడాలి

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** తెలంగాణలో ఏకైక ప్రభుత్వరంగ పరిశ్రమగా ఉన్న సింగరేణి మనుగడను ప్రభుత్వం కాపాడాలని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సింగరేణిపై సమీక్ష చేసి, సింగరేణి కార్మిక వర్గాన్ని తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడారని మండిపడ్డారు. సింగరేణి పట్ల డిప్యూటీ సిఎం భట్టికి మరింత శ్రద్ధ ఉండాలని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రాంతం పట్ల, సింగరేణి సంస్థ పట్ల ప్రేమ లేదు అని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడిన మాటలను ఆయన ఖండించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లా డారు. సింగరేణిని కాపాడాలని కెసిఆర్ అనేక ప్రయత్నాలు చేశారని, కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టారని తెలిపారు. దేశవ్యాప్తంగా 1400 బొగ్గు బ్లాకులను ప్రయివేటీకరణకు నిర్ణయం తీసుకున్నారని, కార్పొరేట్ సంస్థలను కాపాడటం కోసం బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరణ చేశారని చెప్పారు.

తెలంగాణలో ఉన్న బొగ్గు బ్లాకులన్నీ సింగరేణికి దక్కాలని కెసిఆర్ అన్నారని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక 4 బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరణ చేశారని, 4 బొగ్గు బ్లాకులను కాపాడటం కోసం కెసిఆర్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. కేంద్రంలో బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి బొగ్గు బ్లాకుల వేలం పాటలో కలిసి పాల్గొన్నారని గుర్తు చేవారు. సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాకు ఎట్లా వచ్చిందని, కర్ణాటకలో కాపర్, బంగారం గనులను సింగరేణి దక్కించుకుందని సింగరేణి సంస్థ ప్రకటించిందని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నా కాంగ్రెస్ సింగరేణికి ఏం చేయలేదని విమర్శించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ తెస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, సింగరేణి సంస్థలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మంత్రులు, ఎమ్మెల్యేల ఆధిపత్యం పెరిగి, సింగరేణి నాశనం అయ్యే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. సింగరేణి సిఎండి కాంగ్రెస్ చెప్పుచేతల్లో పనిచేస్తున్నారని ఆరోపించారు.

# అటవీప్రాంతం గుండా నూతన రోడ్డు మార్గాలు



### మేడారం జాతర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** వచ్చే జనవరిలో జరిగే మహా మేడారం జాతరను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం పనులను వేగవంతం చేసినట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఆదివారం మేడారం జాతరకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె దగ్గరుండి పరిశీలిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రహదారులు చాలా ముఖ్యమైనవని, జిల్లా ఎస్పీతోపాటు మేడారం సర్కిల్‌లో పనిచేసే పోలీస్ అధికారులతో కలిసి కొత్తరోడ్లను పరిశీలించినట్లు తెలి పారు. ప్రస్తుతం ఉన్న మార్గాలను వెడల్పు చేయడంతో పాటు కొత్తరోడ్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. అటవీ ప్రాంతంగుండా నూతన రహదారి మార్గా లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా కొండపర్తి నుంచి గోనెపల్లి, ముత్తాపురం మీదుగా పడికాపురం వరకు రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని, కాల్వ పల్లి నుంచి కన్నేపల్లికి వచ్చే దారిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కాల్వపల్లి నుంచి ఊరటం వరకు వచ్చే దారిలో బీటీ రోడ్డు వేస్తున్నామని, అడవి దారులను డెవలప్ చేసుకుని వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ జామ్ కాకుండా భక్తులందరూ మేడారం ఆలయం వరకు వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఛత్తీస్‌గడ్, ఖమ్మం వైపు నుంచి వచ్చే భక్తులకు చిన్నబోయినపల్లి మీదుగా ఊరటం దాకా రహదారి మార్గాన్ని కల్పిస్తామని, మేడారం మహా జాతర లోపు రూ 16.5 కోట్లతో కొండాయి బ్రిడ్జి కంప్లీట్ చేస్తామని, దీనికి సంబంధించి నిధులను సీఎం ఇప్పటికే మంజూరు చేశారు చేసినట్లు తెలిపారు. జాతర సమయంలో ఎక్కడికక్కడ అటవీ ప్రాంతంలో పార్కింగ్ ప్లేస్‌లను ఏర్పాటు చేస్తామని, మట్టి రోడ్లను, బీటి రోడ్లను ఏర్పాటు చేస్తాం వచ్చిపోయే భక్తులకు ఇబ్బంది లేకుండా డివైడర్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సమ్మక్క సారలమ్మ కీర్తిని మరింత పెంచే విధంగా యజ్ఞంలా పనిచేస్తుట్లు తెలిపారు. కొంతమంది తమ ప్రయోజనాల కోసం దేవుడి దగ్గర చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసి పూజారుల ఆలోచన, విశ్వాసం నమ్మకం, ఆచారం లకు అనుగుణంగా సమ్మక్క సారలమ్మ గుడిని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఒక ఆదివాసి బిడ్డగా ఆదివాసి జీవితాన్ని తెలిసిన వ్యక్తిగా మొదటి నుంచి ఆదివాసి సాంప్రదాయాలు ఆచారాలను కాపాడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో కొందరు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తే అడ్డుకున్నానని, ఆదివాసి సంప్రదా యాలకు భంగం వాటిల్లకుండా పనులు చేయించే బాధ్యత నాదిసమ్మక్క సారలమ్మ కీర్తి ఇనుమడింప చేసే విధంగా మేడారం ఆధునీకరణ పనులు జరుగుతాయన్నారు.

# గద్వాల జిల్లా కెటిఆర్ సభ అట్టర్‌ఫ్లాప్

### మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** తేరు మైదానానికి ఒక చరిత్ర ఉందని, దాన్ని కెటిఆర్ అబద్దాలకు అడ్డగా మార్చి నడిగడ్డ ప్రతిష్టను దిగజార్చి పోయాడని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మండిపడ్డారు. అలంపూర్ నియోజక వర్గంలో గెలిచిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అభివృద్ధిపై ఆలోచన లేదు అని వారికి ఫ్యూడలిస్టు, శాడిస్ట్ రాజకీయాలు చేయడమే తప్ప ప్రజా సమస్యలపై అవగాహన లేదని సంపత్ కుమార్ అన్నారు.

శనివారం సభలో కెటిఆర్ మాట్లాడుతూ గురుకుల హాస్టల్‌లో ఎలుకలు దూరుతున్నాయని చేసిన విమర్శను సంపత్ కుమార్ తిప్పికొట్టారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి రోజుల్లో తాను ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కలిసి కొట్లాడి అలంపూర్ నియోజకవర్గానికి అత్యధిక గురుకులాలను తీసుకువచ్చానని గుర్తుచేశారు. అలంపూర్ నియోజకవర్గంలో ఒక్కటంటే ఒక్క డబుల్ బెడ్ ఇల్లు కట్టలేదని, ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అలంపూర్ నియోజకవర్గంలో 3500 పైచిలుకు ఇందిరమ్మ ఇళ్లకు నిర్విఘ్నంగా నిర్మాణం జరుగుతుం దన్నారు. ఇది ప్రజాపాలనకు దర్పం పడుతుందని అన్నారు. పదేళ్ల రాజకీయంలో మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడడం తగదన్నారు.

పెద్ద ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ గురించి కూడా మాట్లాడే అర్హత కెటిఆర్‌కు లేదని సంపత్ కుమార్ అన్నారు.

టిఆర్ఎస్ పరిపాలనలోనే ఆ కంపెనీకి స్వయంగా కెటిఆర్ చేతుల మీదుగా 9 పర్మిషన్లు ఇచ్చాడు అని అన్నారు. దళితులు, బిసిల గురించి మాట్లాడే నైతికత కెటిఆర్‌కి లేదన్నారు.

# దేశ సమగ్రతకు పునాది హిందీ

### కులాలు, మతాల పేరిట దేశాన్ని విచ్ఛిన్నం చేయకండి:

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



అవార్డులను ప్రదానం చేస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** అధికార బాషగా హిందీ ఈ దేశ సమగ్రతకు బలమైన పునాదిగా నిలిచిందని పలువురు వక్తలు చెప్పారు. టిపిసిసి మైనార్టి సెల్ ఛైర్మన్ రాజేష్‌కుమార్ అగర్వాల్, తెలంగాణ హిందీ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎన్ఎస్ కుమార్ అధ్యక్షతన ఆదవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అధ్యసంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'హిందీ దివస్' కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధులుగా పిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్, గౌరవ అతిధులుగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణుగోపాలరావు, ఎఐసిసి కార్యదర్శి శివ్వనాథన్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక కమిషన్ ఛైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కొంతమంది తమ స్వార్థ రాజకీయల కోసం కులాలు, మతాలు పేరిట దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిం చారు. రాజకీయాలు అనేవి పదవుల కోసం మాత్రమేనని, ఇంకొందరు తమ పదవులు కాపాడు కోవ డానికి దిగజారుడు రాజకీయాలకు పాల్పడు తున్నారని ఆరోపించారు.

ఇది దేశ భవిష్యత్తుకు మంచిది కాదన్నారు. 1949లో భారత రాజ్యాంగ సభ హిందీని దేశ అధికార భాషగా ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రపం చీకరణ ప్రభావంతో ఇంగ్లీషుకు ప్రాధాన్యత పెరిగినప్పటికి హిందీ తన స్థానాన్ని కోల్పోలేద న్నారు. తెలంగాణ లౌకిక వాదానికి పెట్టింది పేరని, భాష, ప్రాంతం అనే భేదం లేదన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భాషలు, మతాలు వేరైనా మనమంతా భారతీయులమని, పరస్పరం గౌరవించుకుంటూ కలిసి, మెలిసి జీవించాలని, మర్యాదలపై దాడులు సరికాదన్నారు.

హిందీ జర్నలిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.సర్వర్, ప్రదీప్ సురానీ, లక్ష్మీనారాయణ రాఠి, సిఎ మురళిమనోహర్ పలోడ్, భీమ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. హిందీ దివస్ సందర్భంగా పలువురికి ముఖ్య అతిధులు అవా ర్డులను ప్రదానం చేశారు.

# 'సెప్టెంబరు 17'ను తెలంగాణ విలీన దినోత్సవంగానే నిర్వహించండి

### సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెప్టెంబర్ 17ను గత ఏడాది తెలంగాణ ప్రజాపరిపాలన దినంగా నిర్వహించారని, ఈ ఏడాది కూడా అదే పేరుతో నిర్వహించనున్నట్లు తమకు తెలిసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. విమోచన దినోత్సవాన్ని ప్రజాపాలన దినంగా నిర్వహించడం వల్ల నాటి చారిత్రాత్మక పోరాటాన్ని ఏ మాత్రం ప్రతిబింబించడం లేనందున తెలంగాణ విలీన దినోత్సవంగానే నిర్వహించడం సముచితమని పేర్కొన్నారు. ఇందుకు తగు నిర్ణయం తీసుకోవాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. ఈ మేరకు ఆ వివరాలతో కూడిన ప్రకటనను కూనంనేని విడుదల చేశారు. నాటి మహత్తర తెలంగాణ స్వాతంత్ర్యోద్యమ, రైతాంగ సాయుధ పోరాట చరిత్రను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాఠ్యాంశాలలో చేర్చాలని ఆయన సిఎంకు సూచించారు. అమరవీరుల స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అందులో ఆనాటి పోరాటంలో అసువులు బాసిన అమరుల పేర్లను, ఫోటోలను ప్రతి గ్రామం నుంచి అధికారికంగా సేకరించి భావితరాలకు మార్గదర్శకంగా ఉండేలా స్మారక కేంద్రంలో మ్యూజియం ఏర్పాటు చేయాలని ఆ లేఖలో కోరారు. హైదరాబాద్‌లో నాటి పోరాట యోధులు రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి ఒకే చోట, దొడ్డి కొమరయ్య, షేక్ బందగీ, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ లాంటి ఆనాటి సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ముఖ్య ప్రదేశాలలో ఏర్పాటు చేస్తే తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని కూనంనేని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. తొలి సార్వత్రిక ఎన్నికల్లో నెహ్రూను మించిన మెజారిటీ పొందిన ప్రజానాయకుడు రావి నారాయణరెడ్డి విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టాలని కోరారు. నాటి తెలంగాణ స్వాతంత్ర్య పోరాట నాయకుల పేర్లు చిరస్థాయిగా నిలిచే విధంగా వివిధ ప్రభుత్వ పథకాలకు, ప్రాజెక్టులకు నామకరణం చేయాలని సూచించారు. పలు సభలలో నాటి కమ్యూనిస్టు పార్టీ, నాయకులు చేసిన వీరోచిత పాత్రను శ్లాఘించడం, అలాగే వీరనారి చాకలి అయిలమ్మ పేరును మహిళా యూనివర్సిటీకి, తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టినందుకు కమ్యూనిస్టు పార్టీ తరపున ప్రత్యేకించి అభినందనలు తెలియజేస్తున్నామని సిఎంకు తెలిపారు. చరిత్రపై సంపూర్ణ అవగాహన ఉన్న వారిగా పై ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నానని కూనంనేని వెల్లడించారు.

## గ్రూప్-1 ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో రాకూడదని కెటిఆర్ కుట్ర

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రూప్ 1 ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో రాకూడదని కెటిఆర్ కుట్ర పన్నుతున్నారని ఎంపి చామల కిరణ్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గ్రూప్ 1 పరీక్షలలో 563 అభ్యర్థుల దగ్గర మూడు కోట్ల రూపాయలు లెక్కన తీసుకొని ప్రభుత్వం వాళ్ళను ఎంపిక చేసిందని అంటున్నారు. మీ హయాంలో మీరెట్లా ఉద్యోగాలు ఇవ్వలేదు, మీ హయాంలో గ్రూప్ 1, 2, 3 4, పెట్టే పరిస్థితి లేదన్నారు. మా సిఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగల కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్లుతున్నామని, న్యాయనిపుణుల సలహాలు తీసుకుని ఎట్టి పరిస్థితుల్లో కూడా అడ్డంకులు రావద్దన్న సదుద్దేశంతో గ్రూప్ 1 పరీక్షలు పెట్టామన్నారు. 563 మంది తల్లిదండ్రులు ఒక్కొక్కరు మూడు కోట్లు పెట్టే స్తోమత ఉంటుందా? మీ హయాంలో ఎవరికి ఉద్యోగాలు ఇవ్వని మీరు మీకు ఓటేయని ప్రజలు బాధపడుతూ ఉండాలనుకుంటున్నారా? అంటూ ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనం తప్ప ప్రజల మీద నీకు ప్రేమ లేదని, అమెరికాలో చదువుకుని ఉద్యోగం చేస్తూ ఇండియాకు వచ్చి మంత్రి పదవి చేపట్టిన నీకు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఎలా మాట్లాడతావు అంటూ ప్రశ్నించారు. రాజకీయ దురుద్దేశంతో ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారంటూ మండిపడ్డారు. తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కెటిఆర్‌కి గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన నిరుద్యోగుల తల్లిదండ్రులు మీడియా ముందుకు వచ్చి బుద్ధి చెప్పాలన్నారు. శనివారం కెటిఆర్ మాట్లాడిన మాటలు నిజమా కాదా తెలియాలి అంటే తల్లిదండ్రులు స్పందించాలన్నారు.



పాతబస్తీ చార్మినార్ పరిసర ప్రాంతాల్లో మర్కాజి మిలాద్ ఊరేగింపు

## పాతనగరంలో మిలాద్ ఊరేగింపు..

### పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**హైదరాబాద్ (చార్మినార్), సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** మిలాద్-ఉన్-నబీ సందర్భంగా పాతబస్తీలోని పలు ప్రాంతాలలో ఆదివారం నిర్వహించిన మిలాద్ ర్యాలీ ప్రశాంతంగా కన్నుల పండుగగా కొనసాగింది. దక్షిణ మండలం పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. చార్మినార్, గుల్జారా హౌస్, మదీనా, దారుషిఫా, ఒల్టా హోటల్, శాలిబండ, హుస్సేనీఆలం, మొగల్‌పుర, భవానీనగర్, చాంద్రాయణగుట్ట, కాలాఫత్తర్, కామాటిపుర బహదూర్‌పుర, నయాపూల్, సిటీ కళాశాల చౌరస్తా, మూసాబౌలి, మిశ్రీగంజ్, కాజీపుర, కిల్వత్, వట్టెపల్లి, కిషన్‌బాగ్, ఫత్తర్‌గట్టితో పాటు వివిధ ప్రాంతాలలో మిలాద్ ర్యాలీని నిర్వహించారు. పాతబస్తీ మిశ్రీ గంజ్ దర్గా నుంచి ప్రారంభమైన మిలాద్ ఊరేగింపు పలు ప్రాంతాల మీదుగా కొనసాగిన అనంతరం చార్మినార్‌కు చేరుకుంది. కాగా పాతనగరంలోని పలు ప్రాంతాలు నుంచి వచ్చిన ర్యాలీలు చార్మినార్‌వద్ద ప్రధాన ర్యాలీలో కలిశాయి.

ప్రశాంతమైన వాతావరణంలో ర్యాలీని నిర్వహించామని మిలాద్ మర్కాజీ ఊరేగింపు జాయింట్ కన్వీనర్, ఖాద్రియా ఇంటర్నేషనల్ సొసైటీ అధ్యక్షులు ఖాద్రి తెలిపారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక నుంచి నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ ఊరేగింపులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ అదనపు కమిషనర్ విక్రమన్ సింగ్, దక్షిణ మండలం డిసిపి స్నేహ్ మెహ్రాతో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఊరేగింపులో ఒంటెలు, గుర్రాలు ఉన్నాయి. చార్మినార్, మక్కామసీదు, గుల్జారాహౌస్‌తోపాటు పలుచోట్ల వేదికలు ఏర్పాటు చేసి స్వాగతం పలికారు. మిలాద్ ఊరేగింపు సందర్భంగా పాతబస్తీలోని పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. చార్మినార్, గుల్జారాహౌస్, మదీనా ప్రధాన రహదారులలో నిలబడి ప్రజలు మిలాద్ ఊరేగింపును తిలకించారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు ప్రశాంతంగా జరిగిందని చార్మినార్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

## పెరిగిన చికెన్ ధరలు

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** నాన్ వెజ్ ప్రియులకు భారీ షాక్ తగిలింది. రాష్ట్రంలో చికెన్ ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కిలో చికెన్ ధర 240 రూపాయలుగా ఉంది. వారానికి సుమారు 20 రూపాయల చొప్పున ధర పెరుగుతూ వచ్చి ప్రాంతాలను బట్టి ఇప్పుడు ఏకంగా 240 నుండి 260 రూపాయల వరకూ ధర పలుకుతోంది. దీంతో సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు చికెన్ ధరల పెరుగుదల పెద్ద భారమైంది. వారానికి ఒకటి రెండు సార్లు చికెన్ తినే వారు ఇప్పుడు వినియోగాన్ని తగ్గించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా చేపలు, గుడ్ల వైపు మొగ్గుచూపుతున్నారు. కాగా ఇప్పటి వరకూ శ్రావణ మాసం, వినాయక చవితి కారణంగా అంతగా డిమాండ్ లేకుండా ఉండటంతో చికెన్ ధరలు స్థిరంగా ఉన్నాయి. అయితే దసరా పండుగ సమయం దగ్గరపడు తుండటంతో మళ్లీ చికెన్ కొనుగోళ్లు విపరీతంగా పెరిగాయి. దసరా సంద ర్భంగా ఇంటింటా విందులు, వేడుకలు ఉండటంతో చికెన్‌కు డిమాండ్ ఏర్పడింది.

## పాత పెన్షన్ అమలు చేసే పార్టీలకే మా ఓటు

### పాట్నా పెన్షన్ సంఘర్ష్ సభలో ఎన్ఎంఒపిఎస్ సెక్రటరీ జనరల్

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** పాత పెన్షన్ అమలు చేసేవారికి ఓటు వేయాలని నేషనల్ మూవ్మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. ఆదివారం బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో మిల్లర్ హై స్కూల్ గ్రౌండ్ లో ఆధ్వర్యంలో పెన్షన్ సంఘర్ష్ భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్రప్రభుత్వ ఉద్యోగి పెన్షన్ రాష్ట్ర పరిధిలోనిది. ఇటీవల దేశంలో పార్టీలు తమ మ్యానిఫెస్టోలో సిపీఎస్ రద్దు పాత పెన్షన్ అమలు చేస్తామని తెలంగాణ, కర్ణాటక లో సిపీఎస్ ఉద్యోగుల మద్దతుతో అధికారంలోకి వచ్చాయన్నారు. ఇప్పుడు ఈ ఎన్నికల్లో బీహార్ లో కాంగ్రెస్ పార్టీ ,రాష్ట్రీయ జనతా దళ్‌లు, తెలంగాణ ,కర్ణాటక ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఆయా రాష్ట్రాల్లో పాత పెన్షన్‌ను పునరుద్ధరించకుండా బీహార్‌లో సిపీఎస్ ఉద్యోగుల ఆయా పార్టీలకు మద్దతు ఇస్తున్నారన్నారు. ఇటీవల కేంద్రం యూ.పి.యెస్ ప్రకటించడం ద్వారా, రెండు దశాబ్దాల తర్వాత ఎన్.పి.యెస్ నిష్ప్రయోజనమైందన్నారు. ఉద్యోగికి కంట్రిబ్యూషన్ తో సంబంధం లేకుండా ఒపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ యూ. పి.యెస్ విధానం ద్వారా ఇప్పటికి ఎన్. పి.యెస్ ట్రస్ట్ ద్వారా షేర్ మార్కెట్ లో పెట్టుబడులు పెట్టిన 10.53 లక్షల కోట్లకు మరింతగా కంట్రిబ్యూషన్ ను పెంచి ప్రవేటు పెట్టుబడిదారులకు అప్పజెప్పడమేనన్నారు. 2004 నుండి అమల్లోకి తెచ్చిన పి.ఎఫ్ ఆర్ డి ఏ బిల్లు 2013 సెప్టెంబర్ లో పార్లమెంట్‌లో పాస్ చేయించారని ఇప్పటివరకు వ జమైన మొత్తం నిధి అంతా ఇష్టా రాజ్యంగా షేర్ మార్కెట్ లోకి పెట్టుబడులుగా వెళ్లాయని ఆయన ఆరోపించారు. ఎన్. పి.యెస్ పై నిరసనలు వెల్లువెత్తటంతో, కావాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు మార్చుకోవచ్చని అంటూనే ఇన్నాళ్ళు ఎన్.పి.ఎస్ లో జమకాబడిన మొత్తాలను కేంద్రం ఇవ్వదని ఒపీఎస్ ను పునరుద్ధరించిన రాష్ట్రాలకు స్పష్టం చేయడం ,రాష్ట్ర ఉద్యోగుల పై రాష్ట్రాల అధికార స్వేచ్ఛ హరించడమేన్నారు.

15-09pg10 12 GNT_15-09pg10.qxd 9/15/2025 12:41 AM Page 1





## హాంకాంగ్ ఓపెన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమి

**న్యూఢిల్లీ:** హాంకాంగ్ ఓపెన్ 2025లో సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమితో రన్నరప్‌గా సరిపెట్టుకుంది. ఈ భారత జంట చైనాకు చెందిన ఆరో సీడ్ వీ కెంగ్ లియాంగ్ మరియు చాంగ్ వాంగ్ ద్వయం చేతిలో ఓడిపోయింది. ఆదివారం జరిగిన హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500లో భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి రన్నరప్‌గా నిలిచారు. ఎనిమిదో సీడ్ రాంకిరెడ్డి-శెట్టి జోడీ చైనాకు చెందిన ఆరో సీడ్ వీ కెంగ్ లియాంగ్‌చాంగ్ వాంగ్ జోడీ చేతిలో 21-19, 14-21, 17-21 తేడాతో పరాజయం చెందింది. 2025 బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లతో సహా ఐదు సెమీఫైనల్స్‌లో నిష్క్రమణలను ఎదుర్కొన్న ఈ భారత జంట హాంకాంగ్ ఓపెన్‌ను ఒక గంటలోపు పోటీని ముగించింది. రెండవ గేమ్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ ప్రదర్శన నిరాశాజనకంగా ప్రారంభమైంది. ఆట సగం ముగిసే సమయానికి 5-11తో వెనుకబడి ఉంది. ఆ తర్వాత ఈ జంట తమ లక్ష్యాన్ని మరింతగా పెంచుకుని, త్వరలోనే అంతరాన్ని కేవలం రెండు పాయింట్లకు తగ్గించింది. అయితే, వారు తమ లయను కోల్పోయి చివరికి రెండవ సెట్‌ను 14-21తో వదులుకున్నారు. మూడవ మరియు చివరి గేమ్‌లో, చైనాకు చెందిన వీచాంగ్ 0-6తో ప్రారంభంలో ఆరు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించి, దాన్ని 11-2కి పెంచారు. అయితే భారత జంట తీవ్రంగా పోరాడి 17-20తో అంతరాన్ని తగ్గించింది. కానీ తదుపరి పాయింట్‌లో షటిల్‌ను వైడ్ చేసి మ్యాచ్‌ను వదులుకుంది. ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష ్య సేన్, చైనాకు చెందిన రెండో సీడ్ షి



## వరల్డ్ కప్ నింగ్బోలో మేఘనకు కాంస్యం

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ నింగ్బో-2025లో మేఘనా సజ్జనార్ తొలి కాంస్యం సాధించగా, స్వప్నిల్ కుసాలే ఓటమితో టోర్నీ నుండి నిష్క్రమించింది. చైనాలోని నింగ్బోలో ఆదివారం జరిగిన ఈ ప్రపంచ కప్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో మేఘనా సజ్జనార్ కాంస్యం గెలుచుకోవడం ద్వారా తన తొలి వ్యక్తిగత అంతర్జాతీయ పతకాన్ని సాధించింది. 31 ఏళ్ల మేఘనా 632.6 స్కోరుతో క్వాలిఫైయింగ్‌లో ఏడో స్థానంలో నిలిచి పతక రౌండ్‌కు చేరుకుంది. ఫైనల్‌లో అస్థిరమైన ప్రారంభం ఉన్నప్పటికీ, ఆమె 230.0 షూట్ చేసి కాంస్యం సాధించడానికి పట్టుదలతో ప్రయత్నం చేసింది. ఈ టోర్నీలో చైనాకు చెందిన టీనేజర్ పెంగ్ జిన్లు 255.3 పాయింట్లతో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించి స్వర్ణం సాధించగా, నార్వేకు చెందిన ఒలింపియన్ జీనెట్ హెగ్ డ్యూస్టాడ్ 252.6 పాయింట్లతో రజతం గెలుచుకుంది. కాగా భారత్‌కు చెందిన పారిస్ 2024 కాంస్య పతక విజేత స్వాప్నిల్ కుసాలే పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్లలో పరాజయాన్ని చవిచూశాడు. 587-30+తో 21వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు దూరమయ్యాడు. ఇక కిరణ్ అంకుష్ జాదవ్ నాల్గవ స్థానంలో (590-31+) అర్హత సాధించినా, చివరి రౌండ్ ప్రారంభంలోనే నిష్క్రమించాడు. ఈషా, మేఘన మరియు కిరణ్ తప్ప, మరే ఇతర భారతీయ షూటర్లు నింగ్బోలో ఫైనల్స్‌కు చేరుకోలేదు. ఒలింపిక్ పతక విజేత మను భాకర్ ఈ ఈవెంట్‌లో పాల్గొనలేదు. దీంతో మేఘనా పోడియం ఫినిషింగ్‌తో, భారత్ రెండు పతకాలతో టోర్నమెంట్‌ను ముగించింది. ఇప్పటికే శనివారం ఇషా సింగ్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో స్వర్ణం సాధించింది.

### ఆస్ట్రేలియాతో మహిళల వన్డేలో..

## భారత్ 281 పరుగుల స్కోర్

### వరల్డ్ రికార్డు బద్దలు కొట్టిన స్మృతి, ప్రతీక

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో వన్డేలో భారత్ మహిళా క్రికెట్ జట్టు భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీకా రావల్ అద్భుత ప్రదర్శన కనపరిచారు. ఇద్దరూ అర్థ శతకాలతో చెలరేగి 100కు పైగా పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. ఈ క్రమంలోనే పాతికేళ్లుగా బెలిండా క్లార్క్-లిసా కైట్లీ పేరిట ఉన్న వన్డే ప్రపంచ రికార్డును స్మృతి-ప్రతీకా బద్దలు కొట్టారు. ఆదివారం న్యూ ఛండీగఢ్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన తొలి అంతర్జాతీయ మహిళల వన్డే సిరీస్ తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై భారత జట్టు 50 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 281 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. స్మృతి, ప్రతీక రావల్, హర్లీన్ ల అర్థ సెంచరీలతో రాణించారు. ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ప్రతీక, స్మృతి ఫ్లాట్ పిచ్‌పై 114 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యంతో భారత స్కోరుకు పునాది వేశారు. ప్రతికా 96 బంతుల్లో 64 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. అర్థ సెంచరీ ఆరు బౌండరీలతో స్మృతి 63 బంతుల్లో 58 పరుగులు చేసింది. ఆమె 32వ ఒఐడీ అర్థ సెంచరీ ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో ఫోబ్ లిచ్‌ఫీల్డ్ చేతిలో రనౌట్ అయింది. అలాగే హర్లీన్ మిడిల్ ఓవర్లలో 57 బంతుల్లో 54 పరుగులు చేసింది. అందులో తన నాలుగో వన్డే అర్థ సెంచరీలో 4 బౌండరీలు, 2 సిక్సర్లు ఉన్నాయి. కెప్టెన్ హర్మన్ ప్రీత్‌కౌర్ 11, జెమీమా రోడ్రిగ్స్ 18 పరుగులు మాత్రమే చేయగా, చివరి ఓవర్లలో రిచా ఘోష్ 25, రాధా యాదవ్ 19, దీప్తి శర్మ 20 నాటౌట్‌గా ఫర్వాలేదనిపించారు. ఈ క్రమంలో 50 ఓవర్లలో భారత్ జట్టు ఏడు వికెట్లు నష్టానికి 281 పరుగులు చేసింది. ఇది మహిళల వన్డేల్లో ఆస్ట్రేలియాపై భారత్ సాధించిన రెండవ అత్యధిక స్కోరు. ఆస్ట్రేలియా బౌలర్లలో పేసర్ మేఘన్ షట్ రెండు వికెట్లు పడగొట్టగా, అలానా కింమ్ గార్త్, అన్నాబెల్, సదర్‌లాండ్, అలనా కింగ్, తహ్లియా మెక్‌గ్రాత్ ఒక్కో వికెట్ తీసుకున్నారు.







### వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో..

## ఫైనల్స్‌కు కుషారే

న్యూఢిల్లీ: ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025, హైజంప్‌లో సర్వేష్ కుషారే ఫైనల్‌కు చేరిన తొలి భారతీయుడుగా రికార్డుకెక్కాడు. టోక్యోలోని నేషనల్ స్టేడియంలో ఆదివారం జరిగిన పోటీల్లో 29 ఏళ్ల జంపర్ అర్హత పోటీలో 2.25 మీటర్లు దూకి, పురుషుల హైజంప్ ఫైనల్‌కు టాప్ 12 అథ్లెట్లలో చారిత్రాత్మక స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఫైనల్‌లో చోటు దక్కించుకోవడానికి తన రెండవ ప్రయత్నంలో 2.25 మీటర్లు క్లియర్ చేశాడు. గత సంవత్సరం పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన కుషారే, 2.16 మీటర్లతో విజయవంతమైన క్లియరెన్స్‌తో ఓపెనింగ్ చేశాడ. ఆ తర్వాత 2.21 మీటర్లతో, ఆపై 2.25 మీటర్లకు పైగా ప్రయాణించి తన చారిత్రాత్మక అర్హతను నిర్ధారించుకున్నాడు. ఇక ఒలింపిక్ ఛాంపియన్ జియాన్మార్కో తంబేరి 2.21 మీటర్లు జంప్ చేయడంలో విఫలమై పోటీ నుండి నిష్క్రమించాడు. అలాగే ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్, న్యూజిలాండ్‌కు చెందిన హమీష్ కెర్ కూడా 2.25 మీటర్లు క్లియర్ చేసి సులభంగా అర్హత సాధించాడు. కాగా పురుషుల హైజంప్ ఫైనల్ ఈ నెల 16వ తేదీన జరగనుంది.

### వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో

## పసిడితో మెరిసిన జాస్మిన్



**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఒలింపిక్ రజత విజేతను ఓడించి భారత్ బాక్సర్ జాస్మిన్ స్వర్ణంతో మెరిసింది. ఇదే టోర్నీలో భారత్‌కు చెందిన మరో బాక్సర్ నుపుర్ రజతాన్ని దక్కించుకుంది. లివర్‌పూల్‌లో ఆదివారం జరిగిన పోటీల్లో జాస్మిన్ లంబోరియా 57 కిలోల బరువు విభాగంలో తన తొలి బంగారు పతకాన్ని సాధించింది. పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత పోలాండ్‌కు చెందిన పారిస్ స్జెరెమెటాపై అద్భుతమైన విజయం సాధించింది. జాస్మిన్ రౌండ్ 2, 3లో దూసుకుపోయి నంబర్ వన్ సీడ్ స్జెరెమెటాను 4-1 తేడాతో ఓడించి తన తొలి ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాన్ని గెలుచుకుంది. అంతేకాకుండా ఈ ఎడిషన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశానికి ఇది తొలి స్వర్ణం. కాగా జాస్మిన్ ఈ ఏడాది అస్తానాలో జరిగిన ప్రపంచ బాక్సింగ్ కప్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆమె బర్మింగ్‌హామ్ 2022 కామన్వెల్త్ గేమ్స్, 2021 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలను కూడా కైవసం చేసుకుంది. ఇక 80 కిలోల ఫైనల్‌లో పోలాండ్‌కు చెందిన అగాటా కాజ్మార్స్కా చేతిలో ఓడిపోయి భారత్‌కు చెందిన నుపుర్ రజతం సాధించింది. సెమీఫైనల్లో, జైస్మిన్ వెనిజులాకు చెందిన ఒమైలిన్ కరోలినా అల్కాలా సెగోవియాను 5-0 తేడాతో ఓడించింది. అలాగే 80 కిలోల విభాగంలో మరో భారత్ బాక్సర్ పూజా రాణి ఇంగ్లాండ్‌కు చెందిన ఎమిలీ అస్క్విత్‌తో జరిగిన అద్భుతమైన సెమీఫైనల్ తర్వాత పోడియం ఫినిషింగ్‌తో సరిపెట్టింది.

## డేవిస్ కప్ విజేతగా సుమిత్



**న్యూఢిల్లీ:** భారత్ స్విట్జర్లాండ్‌ను ఓడించి తొలి యూరోపియన్ విదేశీ డేవిస్ కప్ విజయాన్ని సాధించింది. ఈ విజయం భారత్ 2026 వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్ మొదటి రౌండ్‌కు చేరుకోవడానికి అర్హత కల్పిస్తుంది. భారత్ కాలమానం ప్రకారం ఆదివారం బీల్‌లో జరిగిన డేవిస్ కప్ 2025 ప్రపంచ గ్రూప్ టైలో భారత నెంబర్ వన్ ప్లేయర్ సుమిత్ నాగల్‌తో కూడిన పురుషుల జట్టు స్విట్జర్లాండ్‌ను 3-1 తేడాతో ఓడించి చరిత్ర సృష్టించింది. దీంతో 32 సంవత్సరాల తర్వాత ఒక యూరోపియన్ దేశంపై భారత్ సాధించిన తొలి విదేశీ డేవిస్ కప్ విజయం ఇది. చివరిసారిగా 1993లో ఫ్రాన్స్‌పై విజయం సాధించింది. ఇక నిర్ణయాత్మక రివర్స్ సింగిల్స్ రబ్బర్‌లో సుమిత్ నాగల్ 6-1, 6-3 తేడాతో స్విట్జర్లాండ్‌కు చెందిన హెన్రీ బెర్నెట్‌పై విజయం సాధించి విజయాన్ని నమోదు చేశాడు. డేవిస్ కప్ స్టాండింగ్స్‌లో 37వ స్థానంలో ఉన్న భారతదేశం, తొమ్మిదో సీడ్ స్విట్జర్లాండ్ (24వ ర్యాంక్)ను ఓడించి 2026 వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్ మొదటి రౌండ్‌లో స్థానాన్ని సంపాదించుకుంది. రివర్స్ సింగిల్స్‌లో మొదటి మ్యాచ్‌లో 18 ఏళ్ల బెర్నెట్‌ను ఎదుర్కొన్న సుమిత్ ప్రారంభంలోనే బ్రేక్ వేసి ఆధిపత్యం చెలాయించాడు. డేవిస్ కప్‌లో అరంగేట్రం చేసిన దక్షిణేశ్వర్ సురేష్ తొలి సింగిల్స్ రబ్బర్‌లో 76(4), 63తో హోమ్ ఫేవరెట్ జెరోమ్ కిమ్‌ను ఓడించాడు. 626వ ర్యాంక్‌లో ఉన్న సురేష్ అద్భుతమైనప్రదర్శన చేశాడు. వరుససెట్లలో మ్యాచ్‌ను కైవసం చేసుకునే ముందు బహుళ బ్రేక్ పాయింట్లను కాపాడుకున్నాడు. తరువాత సుమిత్ నాగల్ 6-3, 7-6(4)తో రెండుసార్లు ఒలింపియన్ మార్కోఆండ్రియా హ్యూస్లర్‌ను ఓడించాడు. మొదటి సెట్‌లో నాగల్ రెండుసార్లు హ్యూస్లర్‌ను బ్రేక్ చేసి, రెండవ సెట్ టైబ్రేక్‌లో భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని ఇచ్చాడు.

### శీతాకాల సమావేశాల్లోనే

## 'ఎఫ్‌డిఐ' బిల్లు!



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 14:** బీమారంగంలో నూరుశాతం ఎఫ్‌డిఐలను అనుమతించే బిల్లును వచ్చే సమావేశాల్లోనే ప్రవేశపెడుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. బీమారంగంలోకి మరిన్ని సంస్థలను తీసుకురావడంతోపాటు అధిక సంఖ్యలో ఉద్యోగాల సృష్టికి ఇది ఉపకరిస్తుందన్నారు. ఈ ఎఫ్‌డిఐ బిల్లును రానున్న శీతకాలసమావేశాల్లోనే పార్లమెంటులోప్రవేశపెట్టనున్నట్లు ఆమె తెలిపారు. బీమా చట్టం 1938 లోని వివిధ నిబంధనలను సవరించాలని ఆర్థికమంత్రిత్వశాఖ ప్రతిపాదించింది.

బీమారంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రస్తుత 74శాతంనుంచి 100శాతం వరకూ పెంచడంతోపాటు అధీకృత మూలధనం తగ్గించడం, కాంపొజిట్ లైసెన్స్ నిబంధన వంటివి ఈ బిల్లులో ఉన్నాయన్నారు. బీమా నియంత్రణ అభివృద్ధిచట్టం 1999లోనూ సవరణలు ప్రతిపాదించినట్లు తెలిపారు.పాలసీదారుల ప్రయోజనాలను ప్రోత్సహించడం వారి ఆర్థికభద్రతను పెంచడం బీమా మార్కెట్‌లోకి మరిన్ని భాగస్వామ్య సంస్థలప్రవేశాన్ని సులభతరంచేయడం ఆర్థికవృద్ధి, ఉపాధికల్పనకు ప్రతిపాదిత సవరణలు ఉపయోగపడతాయని నిర్మలాసీతారామన్ అన్నారు. మోడీ ప్రభుత్వం తెచ్చినసంస్కరణలు భారత్‌లోని ప్రతి పౌరుడు సాధించిన విజయమని అన్నారు.

దీపావళి పండుగకు ముందేజిఎస్టీ సంస్కరణలను ప్రారంభించాలని ప్రధాని నరేంద్రమోడీ సూచించారు. ప్రధాని మోడీసూచనమేరకే ఈ సంసనకరణలనుప్రజలకుముందు తీసుకువచ్చి దేశంలోని సామాన్య కుటుంబాలపైభారం తగ్గించామన్నారు. ప్రజల సాధికారతతోనే భారత్ అభివృద్ధిచెందిన దేశంగా మారుతుందన్నారు.



### న్యూయార్క్‌లో ముకేష్ అంబాని లగ్జరీ విల్లా

## కొనుగోలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** రిలయన్స్ ఛైర్మన్ ముకేష్ అంబాని అమెరికాలో విలువైన ఆస్తులు కొనుగోలుచేసారు. న్యూయార్క్‌లో ప్రస్తుతం 145కోట్లను వెచ్చించి లగ్జరీ భవనం కొనుగోలుచేసారు.న్యూయార్క్‌లోని ట్రైబెకా ప్రనాంతంలో భవంతిని 17.4 మిలియన్ డాలర్లు అంటే మన కరెన్సీలో రూ.145 కోట్లతో కొనుగోలుచేసినట్లు రియల్‌డీల్ తాజా నివేదికతో వెలుగులోకి వచ్చింది. 2023 ఆగస్టులోమన్‌హట్టన్‌లో హడ్సన్ నదికి ఎదురుగా ఉన్న తన 9 మిలియన్ డాలర్ల విల్లాను విక్రయించిన రెండేళ్లకే అంబాని ఈ కొత్త భవంతిని కొనుగోలుచేసారు. ఈ భవనం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అమెరికా విభాగం కొనుగోలుచేసింది. టెక్ బిలియనీర్ రాబర్ట్ పెరా 2018లో 20 మిలియన్ డాలర్లకుకొనుగోలుచేసి లగ్జరీభవనంగా మార్చాలనిచూసారు. తర్వాత 2021లో దాన్ని 25 మిలియన్ డాలర్లకు విక్రయించారు. ఇపుడు అదే భవనం 17.4 మిలియన్ డాలర్లకు అంబాని సొంతంచేసుకున్నారు. అంబాని ప్రస్తుతం 97.9 బిలియన్ డాలర్లతో అంటే రూ.8.2 లక్షలకోట్లతో దేశంలోనే అత్యంత సంపన్నవ్యక్తిగా నిలిచారు. రెండోస్థానంలో ఆదానిగ్రూప్ ఛైర్మన్ గౌతమ్ ఆదాని ఉండగా ఆయన నికర ఆస్తులు 82.1 బిలియన్ డాలర్లని తేలింది.

## మరోసారి తెరపైకి బ్యాంకుల విలీనం!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** దేశంలో ఇప్పటి వరకు చాలా సార్లు బ్యాంకుల విలీనం జరిగింది. రెండు మూడు బ్యాంకులను కలిపి ఒక పెద్ద బ్యాంకుగా ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. ఇప్పుడు మరోసారి ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం అంశం తెరపైకి వచ్చింది. వికసిత్ భారత్ 2047 విజన్‌లో భాగంగా ప్రపంచంలోని అతిపెద్ద బ్యాంకుల్లో భారత్‌కు చెందిన బ్యాంకులకు చోటు కల్పించాలని లక్ష్యంగా కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ రంగ బ్యాంకుల అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఎస్‌బీ మంథన్ 2025 పేరిట ఈ సమీక్ష చేపట్టారు. ఇందులో కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ప్రపంచంలోని టాప్20 బ్యాంకుల్లో రెండు దేశీయ బ్యాంకులకు చోటు కల్పించేలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా మరిన్ని బ్యాంకులను విలీనం చేసే అవకాశాలపై చర్చిచినట్లు సమాచారం. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్థిక సేవల విభాగం గత రెండు రోజుల పాటు పీఎస్‌బీ మంథన్ 2025ని నిర్వహించింది. ఇందులో తొలి రోజున బ్యాంకుల విలీనం, వరల్డ్ టాప్ 20లో రెండు దేశీయ బ్యాంకుల లక్ష్యంపై చర్చించినట్లుగా ప్రభుత్వ వర్గాలు సూత్రప్రాయంగా వెల్లడించాయి. కేంద్రం జాబితాలో పెద్ద బ్యాంకులు ఉన్నట్లు సమాచారం. అయితే బ్యాంకుల విలీనం, ఏ బ్యాంకులు ఉండొచ్చు అనే విషయాలపై క్లారిటీ లేదు. ప్రస్తుతం ఆస్తుల విలువ పరంగా చూసుకుంటే వరల్డ్ టాప్ 100లో భారత్ నుంచి కేవలం రెండు బ్యాంకులే చోటు దక్కించుకున్నాయి. దేశీయ అతిపెద్ద బ్యాంకింగ్ సేవల సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) 43వ స్థానంలో కొనసాగుతోంది. ఇక ప్రైవేట్ రంగంలోని దిగ్గజ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (హెచ్‌డిఎఫ్‌సి) 73వ స్థానంలో ఉంది. పీఎస్‌బీ మంథన్ 2025లో జరిగిన ప్రధాన చర్చలంలో వరల్డ్ టాప్ 20 బ్యాంకుల్లో మన దేశానికి రెంచిన రెండు బ్యాంకులను నిలపడంపై చర్చ జరిగినట్లు సమాచారం. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను విలీనం చేస్తారా అని అడిగిన ప్రశ్నకు అలాంటి చర్చ జరగలేదని అధికారులు తెలిపారు. అయితే, విలీనం ద్వారానే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ సమావేశానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రెటరీ ఎం నాగరాజు నేతృత్వం వహించారు. ఆర్థిక శాఖ సీనియర్ అధికారులు, ప్రభుత్వ బ్యాంకుల టాప్ ఎగ్జిక్యూటివ్స్ పాల్గొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ సీఎస్ శెట్టి, పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈఓ అశోక్ చంద్ర హాజరయ్యారు. సమావేశం తొలి రోజున చీఫ్ ఎకానమిక్ అడ్వైజర్ వీ అనంత నాగేశ్వరన్, ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ జే, డీఎఫ్ఎస్ మాజీ సెక్రెటరీ, ఎక్స్ ఐఆర్‌డీఏఐ ఛైర్మన్ దెబాశిస్ పాండా మాట్లాడారు.

## దీపావళికి ఇపిఎఫ్ఒ ధమాకా!



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 14:** ఎటిఎంలద్వారా పిఎఫ్ డబ్బు ఉపసంహరించుకునేకొత్త సౌకర్యం త్వరలో ప్రవేశపెట్టబోతున్నారు. ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను సులభవంగా నిర్వహించుకునేందుకు ఇపిఎఫ్ 3.0 పేరుతో కొత్త విధానాలను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. నిజానికి సెప్టెంబరులోనే ఈ కొత్తవిధానాలు రావాల్సి ఉంది. కానీ కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా వాటిని నిలిపివేసారు. దీపావళికి ముందు ఏటిఎంలద్వారా పిఎఫ్ సొమ్ము ఉపసంహరించుకునే వెసులుబాటు కష్టమర్లకు కల్పిస్తుందని తెలుస్తోంది. బ్యాంకుల తరహాలోనే సరళమైన లావాదేవీని సృష్టించేప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం ఈచర్య తీసుకోనున్నట్లు వెల్లడించింది.అక్టోబరు 10,11 తేదీల్లో ఇపిఎఫ్ఒ ట్రస్టుకమిటీ సమావేశం కేంద్ర కార్మిక మంత్రి మన్సుక్ మాండవీయ అధ్యక్షతన జరుగుతుంది. దీపావళికి ముందు సుమారు 8 కోట్లమంది పిఎఫ్ చందాదారులోటిఫికేషన్‌కు సంబంధించి ఈసమావేశంలోముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. యుపిఐద్వారా పిఎఫ్ డబ్బును ప్రవేశపెట్టడం వంటి బ్యాంకింగ్‌షేవలపైనే చర్చించనున్నారు. నెలకు అదనంగా కనీసం పెన్షన్‌ను రూ.1000నుంచి 1500 నుంచి 2500కు పెంచే ప్రణాళిక గురించి కూడా చర్చకు రానున్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య వివాహం ఇల్లు కొనుగోలు వంటి కొన్ని నిర్దిష్టకారణాలతో పిఎఫ్ ఖాతాదారులు ఇంటర్నెట్‌ద్వారా రూ.5 లక్షలవరకూ వారి సొమ్ము విత్‌డ్రాచేసుకోవచ్చు. కానీ డబ్బులుచేతుల్లోకి రావడానికి కనీసం రెండుమూడురోజులు పడుతోంది.కొత్తగా పిఎఫ్‌లో ఏటిఎం సేవలు అందుబాటులోకి వస్తే సొమ్ములు తీసుకోవడం మరింత సులువవుతుంది. అయితే బ్యాంకులద్వారా పిఎఫ్ సొమ్ము సులభంగా పొందేలాచేయడంచేస్తే పథకం ఉద్దేశ్యం దెబ్బతింటుందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తంచేసాయి. పిఎఫ్ అనేది ఉద్యోగులు తమ పదవీ విరమణ సమయంలో అత్యవసర పరిస్థితులకు ఉపయోగపడే పథకం అని వాటిని ఎటిఎంలద్వారా తీసుకోడానికి అనుమతించేలా పథకం ఉద్దేశ్యం దెబ్బతింటుందని అంటున్నారు.




## బోయింగ్‌పై రూ.27.36 కోట్ల జరిమానా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** ప్రముఖ విమాన తయారీ సంస్థ బోయింగ్‌కు అమెరికా నియంత్రణ సంస్థ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ మరోసారి ఫైన్ విధించింది. భద్రతకు సంబంధించిన ఉల్లంఘనలను గుర్తించడంతోసుమారు 3.1 మిలియన్ డాలర్లు అంటే రూ.27.36 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉల్లంఘనలు మొత్తం సెప్టెంబరు 2023నుంచి ఫిబ్రవరి 2024లోపు చోటుచేసుకున్నవేనని ఎఫ్ఎఎ తెలిపింది. అలాస్కా ఎయిర్‌లైన్స్ డోర్ ఊడిపోవడంవంటి వాటాతో చాలా సంఘటనలు న్నాయి.వాషింగ్టన్‌లోని రెంటాన్ ఫ్యాక్టరీలోనిర్వహించినదర్యాప్తులో క్వాలిటీ సిస్టమ్స్‌లో వందల ఉల్లంఘనలునానయి.కెన్సాస్‌లోని బోయింగ్‌సబ్‌కాంట్రాక్టుసంస్థ స్పిరిట్ ఏరోసిస్టమ్స్‌లోనూ ఇదేపరిస్థితి నెలకన్నది. 2విమానాలు ఎగిరేందుకు యోగ్యత లేనివిగా గుర్తించింది. నాణ్యతలేనివిమానానికి ధృవీకరణ వచ్చేట్లు సంతకంచేయాలని ఒత్తిడిచేసినట్లు గుర్తించారు. పెనాల్టీపై స్పందించేందుకు బోయింగ్‌కు 30 రోజుల గడువు ఉంది. ఈ ఏడాదిజూన్‌లో అమెరికా నేషనల్‌ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీబోర్డు 17 నెలలపాటు నిర్వహించిన దర్యాప్తు నివేదికను విడుదలచేసింది.బోయింగ్ తయారీ భద్రతా పర్యవేక్షణలో చాలా లోపాలున్నా ఎఫ్ఎఎ తనిఖీలు ఆడిట్స్ ఏమాత్రం ప్రభావంచూపలేదని పేర్కొంది. అందువల్లనే అలాస్కా సంఘటన చోటుచేసుకున్నట్లు గుర్తించింది.



## బ్యాంకుల్లో 444 రోజుల డిపాజిట్లపైనే ఎక్కువ ఆసక్తి!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** బ్యాంకులు కొత్తగాప్రవేశపెట్టిన 444 రోజుల డిపాజిట్ అన్నివర్గాలను ఆకర్షిస్తోంది. వడ్డీరూపంలోనే కాకుండా పెట్టుబడిదారులకు ఇది బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తోంది. అయితే ప్రభుత్వరంగ బ్యాంకులన్నింటికంటే ఇండియన్ ఓవర్సీస్‌బ్యాంకు 6.75% వడ్డీతో ఎక్కువ రాబడి ఇస్తోంది. 10.25 లక్షలుపెట్టుబడి పెడితే ఈ బ్యాంకులు మెచూరిటీ 11,11,952.08 వరకూ లభిస్తుంది. రెండోస్థానంలోఉన్న పంజాబ్‌సింధ్ బ్యాంకు 6.70శాతం, ఎస్‌బిఐ తన అమృత్ సృష్టితో 6.60శాతంతో మూడోస్థానంలోను, కెనరాబ్యాంకు 6.50శాతంతో చివరిస్థానంలోను ఎక్కువ రిటర్నులిచ్చే బ్యాంకుల్లో నిలిచాయి. ఎస్‌బిఐలో అయితే 6.60సాధారణ వడ్డీరేటు. ఈ క్రమంలో రూ.10.25 లక్షలకు 444 రోజుల తర్వాత సుమారు రూ.11,09,958.24 వస్తుంది. వడ్డీరూపంలో రూ.94,958.24 పొందుతారు. పంజాబ్ సింధ్‌బ్యాంకులో అయితే ఇదే మొత్తానికి మెచూరిటీ విలువ సుమారు 11,11,287.15 అవుతుంది. వడ్డీరూపంలో 86,287.15 వస్తుంది. ఇక ఐఒబిలో అయితే 444 రోజుల ఎఫ్డీలో 6.75శాతం వడ్డీతో 10.25 లక్షల సొమ్ముకు 11,11,952.08 వస్తుంది. వడ్డీ 86,952.08గా ఉంది. ఇక కెనరాబ్యాంకు అయితే ఈస్కీంపై 6.50 వడ్డీ ఇస్తోంది. ఈ జాబితాలో తక్కువ వడ్డీరేటు. 10.25 లక్షలసొమ్ముకు సుమారు 11,08,630.59 వస్తుంది. వడ్డీ కేవలం రూ.83,630.59 మాత్రమే వస్తుంది.రిటర్నులు కొంచెం తక్కువగా ఉంటాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14